ప్రకటనల కోసం సంప్రదించండి
98483 28698

తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక
Estd : 2002
# జనంసాక్షి
www.janamsakshi.org
ఆదివారం 03.05.2026 | సంపుటి : 12 | సంచిక : 283 | పేజీలు : 12 | వెల : రూ. 4/-
RNI NO.TELTEL / 2013 /50370
హైదరాబాద్ | Simultaneously Published from Hyderabad & Karimnagar | ఎడిటర్ : ఎం.ఎం. రహమాన్






# రిటైర్మెంట్ బకాయిలు 100 రోజుల్లో

- ఉద్యోగుల సమస్యలు నేనే పరిష్కరిస్తా
- రిటైర్మెంట్ బెనిఫిట్స్ కోసం రూ.6వేల కోట్లు
- ఉద్యోగుల సంక్షేమానికి కట్టుబడ్డాం

- జూన్ 1లోగా ఆరోగ్య భద్రతా కార్డులను అందిస్తాం
- త్వరలోనే పీఆర్సీ, జూన్ 1వ తేదీ నుంచి హెల్త్ కార్డులు
- దశల వారిగా మిగిలిన సమస్యల పరిష్కారం
- ఇది ఫ్రెండ్లీ ప్రభుత్వం.. ఉద్యోగుల సమస్యలు పరిష్కరించే బాధ్యత మాదే
- ఉద్యోగ సంఘాలతో భేటీలో సీఎం రేవంత్ రెడ్డి
- మే 5వ తేదీ కార్యచరణను రద్దు చేసుకుంటున్నాము
- టీజీఈ జేఏసీ చైర్మెన్ వి. లచ్చిరెడ్డి ప్రకటన
- ముఖ్యమంత్రి హామీలపై టీజీఈ జేఏసీ ప్రతినిధుల హర్షం

హైదరాబాద్(జనంసాక్షి): రాష్ట్రంలో ఉద్యోగులకు సీఎం రేవంత్ రెడ్డి గుడ్ న్యూస్ చెప్పారు. త్వరలోనే పీఆర్సీ నివేదిక తెప్పించుకొని అమలు చేయడం తో పాటు జూన్ 1వ తేదీ నుంచి హెల్త్ కార్డులను అమలు చేస్తున్నట్లు ప్రకటించారు. సీఎం రేవంత్ రెడ్డి శనివారం తన క్యాంపు కార్యాలయంలో ఉద్యోగ సంఘాల ప్రతినిధులతో సమావేశమైయ్యారు. ఈ సందర్భంగా సీఎం ఉద్యోగుల పై హామీల వర్షం కురిపించారు. ఇందులో ప్రధానంగా100 రోజుల్లో పెన్షనర్స్ కు రూ.6వేల కోట్లను విడుదల చేస్తామని తెలిపారు. అలాగే ప్రతి రెండు నేలలకు ఒకసారి జాయింట్ స్టాఫ్ కౌన్సిల్ నిర్వహించి ఉద్యోగుల సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. సీఎం హామీల పట్ల టీజీఈ జేఏసీ చైర్మెన్ వి. లచ్చిరెడ్డి హర్షం వ్యక్తం చేశారు. అంతకు ముందు సుమారు 45 సమస్యలను టీజీఈ జేఏసీ చైర్మన్ వి.లచ్చిరెడ్డి, సెక్రటరీ జనరల్ వోడ్నాల రాజశేఖర్, టీజీఈ జేఏసీ భాగస్వామ్య పక్ష ఉద్యోగ సంఘాల మిగతా 2లో..





# నేడే 'నీట్'

- దేశవ్యాప్తంగా అన్ని పరీక్షా కేంద్రాల వద్ద 163 సెక్షన్..
- జిరాక్స్, ఇంటర్నెట్ సెంటర్లు క్లోజ్!

న్యూఢిల్లీ(జనంసాక్షి):వైద్య విద్యా కోర్సుల్లో ప్రవేశాల కోసం నిర్వహించే నీట్-యూజీ పరీక్షకు సర్వం సిద్ధమైంది. దేశ వ్యాప్తంగా ఆదివారం (మే 3న) జరగనున్న ఈ పరీక్షకు ఎన్‌టీఏ అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఈ ప్రతిష్ఠాత్మక పరీక్ష నేపథ్యంలో పోలీసులు అప్రమత్తమయ్యారు. పరీక్షా కేంద్రాల వద్ద కట్టుదిట్టమైన భద్రతను ఏర్పాటు చేస్తున్నారు. సైబరాబాద్ కమిషనరేట్ పరిధిలో పరీక్షా కేంద్రాల వద్ద ఆదివారం మిగతా 9లో..

# రేపు మంత్రివర్గ భేటి

## ఉద్యోగుల సమస్యలే ప్రధాన ఎజెండా

### పలు కీలక నిర్ణయాలు తీసుకునే అవకాశం

### సీఎం రేవంత్ అధ్యక్షతన రాష్ట్ర మంత్రివర్గం

హైదరాబాద్(జనంసాక్షి):రాష్ట్ర మంత్రివర్గం రేపుసమావేశం కానుంది. సచివాలయంలో 4వ తేదీన మధ్యాహ్నం 3 గంటలకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధ్యక్షతన కేబినెట్ భేటీ జరగనుంది. తుమ్మిడిహెట్టి బ్యారేజీపై కేబినెట్ చర్చించనున్నట్లు తెలుస్తోంది. ప్రాణహిత-చేవెళ్ల ప్రాజెక్టులో భాగంగా తుమ్మిడిహెట్టి వద్ద 150 మీటర్ల ఎత్తులో బ్యారేజీ నిర్మించి శ్రీపాద ఎల్లంపల్లికి నీటిని తరలించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇటీవల నిర్వహించిన సమావేశంలో నిర్ణయించారు. తుమ్మిడిహెట్టి నుంచి ఎల్లంపల్లికి నీటిని తరలించేందుకు నాలుగు మార్గాలు ప్రతిపాదనలో ఉన్నాయి. వీటిపై కేబినెట్ చర్చించి, నిర్ణయం తీసుకొనే అవకాశం ఉంది. ఉద్యోగులు, ఫించనర్ల సమస్యలు, డిమాండ్లపై మంత్రి మండలి చర్చించ నున్నట్లుగా తెలుస్తోంది. ఉద్యోగులు, పింఛనర్ల పెండింగ్ బిల్లులు 100 రోజుల్లో క్లియర్ చేయాలని భావిస్తున్న ప్రభుత్వం, అందుకు సంబంధించిన కార్యాచరణపై కేబినెట్ భేటీలో నిర్ణయం తీసుకో నుంది. పెండింగ్ డీఏలు, ప్రభుత్వం నగదు రహిత చికిత్సలపై మంత్రివర్గ సమావేశంలో చర్చించే అవకాశం ఉంది. ప్రభుత్వంలో ఆర్టీసీ ఉద్యోగుల విలీనం, కొత్త ఆసరా ఫించన్లు, తెలంగాణ ఉద్యమకారుల కోసం కార్యక్రమాలు, ఇందిరమ్మ బీమా పథకం తదితర అంశాలపై కూడా మిగతా 2లో..

# చెరువుల పునరుద్ధరణకు కమిటీలు

- ఇందులో రైతులు, స్థానిక అధికారులు, స్టేక్‌హోల్డర్స్‌లు సభ్యులుగా ఉండాలి
- రాష్ట్రంలోని అన్ని చెరువుల్లో పనులు తక్షణమే పూడికతీత పనులు ప్రారంభించాలి
- జిల్లా యంత్రాంగానికి మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి ఆదేశాలు

హైదరాబాద్(జనంసాక్షి): తెలంగాణ వ్యాప్తంగా చెరువుల పునరుద్ధరణపై రాష్ట్ర ప్రభుత్వం దృష్టి పెట్టింది. ఈ క్రమంలోనే చెరువుల పునరుద్ధరణకు కమిటీలు వేయాలని నిర్ణయించింది. చెరువుల వారీగా కమిటీలు వేయాలని జిల్లా యంత్రాంగానికి మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి ఆదేశాలు జారీ చేశారు. శనివారం నీటిపారుదల శాఖ అధికారులు, ఇంజినీర్లతో మంత్రి ఉత్తమ్ సమీక్ష నిర్వహించారు. రైతులు, స్థానిక అధికారులు, స్టేక్‌హోల్డర్స్‌తో కమిటీలు వేయాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఈ వేసవిలో మిగతా 2లో..



# కాంగ్రెస్ అవినీతిపై జనం నజర్

- వారి పాలన చూసిన తర్వాత ఎట్టి పరిస్థితుల్లోనూ ఓట్లు వేయరు
- 20 సంవత్సరాల పాటు కాంగ్రెస్ అధికారంలోకి రావడం కల్ల :కేటీఆర్
- పార్టీ ఉమ్మడి రంగారెడ్డి ప్రజాప్రతినిధులు, సీనియర్ నేతలతో సమీక్ష

రంగారెడ్డి(జనంసాక్షి):రాష్ట్రంలో రెండున్నర సంవత్సరాల కాంగ్రెస్ పాలన చూసిన తర్వాత ప్రజలు ఎట్టి పరిస్థితుల్లోనూ కాంగ్రెస్‌కు ఓటు వేసే అవకాశమే లేదని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ కనీసం 20 సంవత్సరాల పాటు అధికారంలోకి రావడం కల్లని పేర్కొన్నారు. ఉమ్మడి రంగారెడ్డి జిల్లా పార్టీ ప్రజా ప్రతినిధులు, సీనియర్ నేతలతో సుదీర్ఘ సమీక్షను నంది నగర్‌లోని తన నివాసంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రస్తుత రాజకీయ పరిణామాలతో పాటు పార్టీని బలోపేతం చేసే దిశగా చేపట్టాల్సిన కార్యాచరణ పై దిశా నిర్దేశం చేశారు. అడ్డగోలుగా హామీలు ఇచ్చి కాంగ్రెస్ పార్టీ మిగతా 2లో..



# అభివృద్ధిని చూసి ఓర్వలేకే విమర్శలు

- బీఆర్ఎస్ నేతల ఆరోపణలు నిరాధారం
- గ్రామీణ రహదారుల అభివృద్ధిని జీర్ణించుకోలేకే అసత్య ఆరోపణలు చేస్తున్నారు:మంత్రి సీతక్క



హైదరాబాద్(జనంసాక్షి):హైబ్రిడ్ యాన్యుటీ మోడల్ రహదారులపై బీఆర్ఎస్ ఆరోపణలను మంత్రి దనసరి అనసూయ సీతక్క ఖండించారు. వాస్తవాలను పక్కనపెట్టి అర్థం లేని విమర్శలు చేయడం బాధాకరమని పేర్కొన్నారు. ఆవేశానికి లోనుకాకుండా ఆలోచనాత్మకంగా వ్యవహరించాలని హరీష్ రావుకు సూచించారు.గ్రామీణ రహదారులను జాతీయ రహదారుల స్థాయిలో ఆధునీకరించడం, కొత్త రహదారుల నిర్మాణం చేప ట్టడం ద్వారా రాష్ట్ర ఆర్థికాభివృద్ధిని వేగవంతం చేయాలనే ప్రభుత్వ సంక ల్పాన్ని జీర్ణించుకోలేకే ఇలాంటి నిరాధార ఆరోపణలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. వార్త 12లో

## కాంట్రాక్టర్లను బెదిరిస్తున్న కేటీఆర్, హరీశ

- కాంగ్రెస్ ఎమ్మెల్సీలు బల్మూరి, అద్దంకిల ఆరోపణలు
- ఫోన్ ట్యాప్ చేసిన వారే విమర్శలు చేస్తే ఎలా? : ఎమ్మెల్యే దానం

2లో..

# పాంచజన్యంతో ప్రజాపోరు పూరిస్తాం

## సర్వోదయ తెలంగాణ లక్ష్యంగా పనిచేస్తాం

- ప్రజలకు విద్య, వైద్యంపై ప్రత్యేక దృష్టి
- అన్ని వర్గాల ప్రజల సంక్షేమం లక్ష్యంగా పోరాటం
- ప్రతి అంశంపైనా స్పష్టమైన విధానంతో సాగుతాం
- మీట్‌దిప్రెస్‌లో టీఆర్ఎస్ అధ్యక్షురాలు కవిత

హైదరాబాద్(జనంసాక్షి):తెలంగాణ రక్షణసేన ఐదు అంశాలను ప్రధాన అజెండాగా తీసుకుందని కల్వకుంట్ల కవిత అన్నారు. పాంచజన్యం పూరించామని, ఇక విజయపథంలోకి దూసుకు పోతామని అన్నారు. సర్వోదయ తెలంగాణ లక్ష్యంగా పోరాటం చేస్తామని అన్నారు. ఎంత పెద్ద ఆరోగ్య సమస్య వచ్చినా.. పేదలకు ఉచితంగా వైద్యం అందిస్తామన్నారు. బషీర్ బాగ్ ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన మీట్ ది ప్రెస్ కార్యక్రమంలో కవిత మాట్లాడారు. పేదలకు నాణ్యమైన ఉచిత విద్య, వైద్యం అందాలన్నదే తమ లక్ష్యం అన్నారు. ధాన్యం కొనుగోళ్లను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్లక్ష్యం చేస్తున్నాయి. ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులు రోజుల తరబడి పడిగాపులు కాస్తున్నారు. ధాన్యం కుప్పల పైనే ప్రాణాలు విడుస్తున్నారు.ప్రభుత్వాలు ఇస్తున్న హామీల వల్ల ఉపాధి అంటే హాస్యాస్పదమైంది. మేం చెప్పే ఉపాధి కల్పన అంటే.. ప్రభుత్వ ఉద్యోగాలు మాత్రమే కాదు. యువత, మహిళలు మిగతా 2లో..




# బతుమ్మకుంట ముమ్మాటికీ చెరువే..

- అక్కడ చెరవు పదెకరాల్లో ఉన్నట్లు నాసా చిత్రాలు ఉన్నాయి
- ఎడ్ల సుధాకర్ హైకోర్టుకు వెళ్లడంపై హైడ్రా కమిషనర్ వివరణ



హైదరాబాద్(జనంసాక్షి): హైదరాబాద్ బతుకమ్మ కుంట చెరువు భూమి తనదే అని, అక్కడ తాను వ్యవసాయం కూడా చేసినట్లు హైకోర్టును ఎడ్ల సుధాకర్ ఆశ్రయించిన క్రమంలో అందుకు ఆధారాలు లేవని, అయినా చెరువును ఆక్రమించి వ్యవసయాం చేయడం కూడా నేమేనని హైడ్రా కమిషనర్ రంగనాథ్ అన్నారు. 12లో..

## పర్షియల్ గల్ఫ్, హర్మూజ్‌లపై కొత్త నియమాలు



# అమలు చేస్తాం

### జలసంధిని కాపాడుకోవడానికి ప్రణాళికలు సిద్ధమవుతున్నాయి

- పూర్తిగా మా ఆధీనంలోనే ఉండేలా చర్యలు చేపడుతాం
- ఇస్లామిక్ రివెల్యూషనరీ గార్డ్స్ కార్ప్స్ కీలక ప్రకటన
- అమెరికాతో మళ్లీ యుద్ధం జరగొచ్చు..
- ఇరాన్ సైనికాధికారి కీలక వ్యాఖ్యలు
- యుద్ధం ఆపాలని.. ప్రపంచదేశాలు వారిపై ఒత్తిడి తేవాలి
- ఇరాన్ సుప్రీం లీడర్ ప్రతినిధి అబ్దుల్ మాజిద్ హకీమ్ ఇలాహి

టెహ్రాన్(జనంసాక్షి): పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు కొనసాగుతున్న ప్రస్తుత తరుణంలో ఇస్లామిక్ రివెల్యూషనరీ గార్డ్స్ కార్ప్స్ కీలక ప్రకటన చేసింది. చమురు సరఫరాలో కీలక మార్గమైన హోర్ముజ్ జలసంధిపై కొత్త సముద్ర నియమాలు అమలు చేయనున్నట్లు వెల్లడించింది. అరేబియా గల్ఫ్, హోర్ముజ్ జలసంధి మార్గాలపై తమ నియంత్రణను బలోపేతం చేసే ఉద్దేశంతో ఐఆర్‌జీసీ కొత్త నిబంధనలను అమలు చేయనున్నట్లు ఇరాన్ ప్రభుత్వ మీడియా పేర్కొంది. అరేబియా గల్ఫ్, హోర్ముజ్ జలసంధి మీదుగా విస్తరించి ఉన్న దాదాపు 2 వేల కిలోమీటర్ల ఇరాన్ తీర ప్రాంతంపై తమ పర్యవేక్షణ ఉంటుందని ఐఆర్‌జీసీ నావికా దళ కమాండర్ ఓ ప్రకటన విడుదల చేశారు. ఆ మార్గంలో రవాణాపై త్వరలోనే కొత్త నిబంధనలను అమలు మిగతా 2లో..

## ఇరాన్ ప్రతిపాదనలు నచ్చలేదు

- మేం సముద్రపు దొంగల్లాంటివాళ్లం.. ఘర్షణ ముగిశాక.. అణ్వాయుధాలు లేని ఇరాన్‌ను మనం చూస్తాం
- ఇరాన్‌పై యుద్ధం చేయకుంటే పశ్చిమాసియా, ఐరోపాలు ముక్కలైపోయేవి
- బీ2 బాంబర్లతో దాడి చేసి ఆ దేశం అణ్వాయుధాన్ని తయారుచేయకుండా అడ్డుకున్నాం:ట్రంప్

వాషింగ్టన్(జనంసాక్షి):పశ్చిమాసియాలో కాల్పుల విరమణ ఒప్పందం కొనసాగుతున్నప్పటికీ శాంతి చర్చల విషయంలో మిగతా 2లో..

# బెంగాల్‌లో గెలవబోయేది మేమే

- 200 సీట్లలో విజయం సాధిస్తాం
- ఎగ్జిట్ పోల్స్ నమ్మబోం: మమత



కోల్‌కతా(జనంసాక్షి): పశ్చిమబెంగాల్ అసెంబ్లీ ఎన్నికల్లో తృణమూల్ కాంగ్రెస్ ఘన విజయం సాధిస్తుందని ముఖ్యమంత్రి మమతా బెనర్జీ అన్నారు. ఈనెల 4న కౌంటింగ్ జరుగనుండటంతో కౌంటింగ్ ఏజెంట్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా శనివారంనాడు ఆమె మాట్లాడారు. '200కు పైగా సీట్లతో మనం గెలవబోతున్నాం' అని ఈ సందర్భంగా మమతా బెనర్జీ ధీమా వ్యక్తం చేశారు. ఎగ్జిట్ పోల్స్ కేవలం స్టాక్ మార్కెను మభ్యపెట్టేందుకే తప్ప మరొకటి కాదని, 2021, 2024లోనూ వాళ్లు ఇదే చేశారని, ఇప్పుడు కూడా జరిగిందదేనని మమతా బెనర్జీ వివరించారు. సీఏపీఎఫ్ దౌర్యనాలకు గురైన టీఎంసీ కార్యకర్తలకు రాబోయే రోజుల్లో తాము రివార్డులిస్తామని చెప్పారు. కాగా, రెండు అసెంబ్లీ నియోజకవర్గాల్లోని 15 పోలింగ్ కేంద్రాల్లో మిగతా 2లో..

## ఛత్తీస్‌గఢ్‌లో పేలిన మందుపాతర

### నలుగురు జవాన్లు మృతి

చర్ల(జనంసాక్షి): మందుపాతర తొలగిస్తుండగా నలుగురు జవాన్లు మృతి చెందిన ఘటన ఛత్తీస్‌గఢ్‌లోని కాంకేర్- నారాయణపూర్ జిల్లాలో చోటు చేసుకుంది. ఛోటేబెతియా పోలీస్ స్టేషన్ సరిహద్దు ప్రాంతంలో మిగతా 9లో..

# గ్లోబల్ బిజినెస్ హబ్‌గా తెలంగాణ

- ఎక్స్‌ప్లోర్ టు ఎక్స్‌పాండ్ లోగో ఆవిష్కరణలో శ్రీధర్ బాబు

హైదరాబాద్(జనంసాక్షి):తెలంగాణ ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి డి.శ్రీధర్ బాబు 'ఎక్స్‌ప్లోర్ టు ఎక్స్‌పాండ్ ఇటూ ఇ' అనే అంతర్జాతీయ వేదిక లోగోను అధికారికంగా ఆవిష్కరించారు. ఈ వేదిక ద్వారా తెలంగాణలోని వ్యాపారులు, ఎగుమతిదారులు, విద్యార్థులు, స్టార్టప్‌లు, నిపుణులు అంతర్జాతీయ అవకాశాలను అన్వేషించి ప్రపంచ స్థాయిలో విస్తరించే అవకాశాలు కల్పించబడతాయి. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ.. ఇలాంటి అంతర్జాతీయ వేదికలు వ్యాపారవేత్తలకు, ఎగుమతిదారులకు, యువతకు కొత్త అవకాశాలను తీసుకువస్తాయని అన్నారు. తెలంగాణను గ్లోబల్ బిజినెస్ హబ్‌గా నిలబెట్టడంలో ఈ కార్యక్రమం మిగతా 2లో..



# నాలుగు నెలల్లో ఎన్ఎండీసీ 16% వృద్ధి



హైదరాబాద్, మే 2 (జనంసాక్షి) : మైనింగ్ దిగ్గజం ఎన్ఎండీసీ, ఏప్రిల్ 2026లో 46.4 లక్షల టన్నుల ఇనుప ఖనిజాన్ని ఉత్పత్తి చేసి, 36.8 లక్షల టన్నులను విక్రయించింది. దేశంలోనే అతిపెద్ద ఇనుప ఖనిజం ఉత్పత్తి సంస్థ అయిన ఇది, గత ఏడాది ఇదే కాలంతో పోలిస్తే ఎఫ్ వై27 మొదటి నెలలో ఉత్పత్తిలో 16% వృద్ధిని నమోదు చేసింది. బైలాడిలా ఇనుప ఖనిజ ప్రాజెక్టులలో తన అత్యుత్తమ మైనింగ్ పనితీరుతో, ఏప్రిల్ 2026లో సాధించిన ఉత్పత్తి, కంపెనీ కాలక్రమంలో ఏప్రిల్ నెలలో ఎన్ఎండీసీ సాధించిన అత్యధిక ఉత్పత్తిగా నిలిచింది. గత నాలుగేళ్ల కాలంలో ఇనుప ఖనిజ ఉత్పత్తిని పరిశీలిస్తే, భారతదేశం 3.9% స్థిరమైన సీఏజీఆర్ నమోదు చేసినట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో, ఎన్ఎండీసీ 6.8% బలమైన సీఏజీఆర్ ను సాధించి, పరిశ్రమ వృద్ధిని అధిగమించి, తద్వారా అదనపు ఉత్పత్తిలో తన వాటాను పెంచుకుంది. "ఎన్ఎండీసీ సామర్థ్యాలు, నైపుణ్యాల విస్తరణ పూర్తి స్థాయిలో జరుగుతోంది. మా వ్యూహాత్మక ముందడుగుకు వీలు కల్పించేందుకు, లాజిస్టిక్స్, మౌలిక సదుపాయాలు, సాంకేతికత, సరఫరా గొలుసు అనుసంధానం వంటి రంగాలలో మేము అవసరమైన పునాదులు వేశాం. ఏప్రిల్‌లో 4.6 మిలియన్ టన్నులతో ప్రారంభించి, ఈ ఆర్థిక సంవత్సరానికి 60o మిలియన్ టన్నుల లక్ష్యాన్ని ఎన్ఎండీసీ నిర్దేశించుకుంది. తదుపరి స్థాయి వృద్ధిని అందుకోవడానికి మా బృందం సిద్ధంగా, సమన్వయంతో ఆత్మవిశ్వాసంతో ఉంది" అని ఎన్ఎండీసీ సీఎండీ అమితావా ముఖర్జీ అన్నారు. ఈ ఏడాడి మొదలు నాలుగు నెల్లో 53 మిలియన్ టన్నులు, ఎన్ఎండీసీ నుండి వచ్చిన సానుకూల ప్రారంభ దశ నివేదిక భారతదేశ ఇనుము, ఉక్కు రంగంలో ఆశావాదాన్ని పెంచుతున్నాయి.

# ఆర్యవైశ్య మహాసభలో ఆంధ్రా పెత్తనం

**ఆర్యవైశ్య మహాసభ అట్టర్ ప్లాప్**

- తెలంగాణ నేతల బహిష్కరణ
- రాష్ట్ర ఆర్యవైశ్య సంఘం నేత మిడిదుడ్డి శ్యామ్ సుందర్



హైదరాబాద్, మే2(జనంసాక్షి) : తెలంగాణ ఆర్యవైశ్య మహాసభలో ఆంధ్రా పెత్తనమే కొనసాగుతోందని, తెలంగాణ వైశ్యనేతలు దూరంగా ఉండటమే ఇందుకు కారణమని రాష్ట్ర ఆర్యవైశ్య సంఘం నేత మిడిదుడ్డి శ్యాంసుందర్ ఆరోపించారు. రాష్ట్ర మహాసభ అధ్యక్షుడిగా అమరవాది లక్ష్మీనారాయణ హైదరాబాద్‌లో శనివారం పదవీ స్వీకార ప్రమాణం చేయగా, జరిగిన సభ ఆశించిన స్థాయిలో సాగకపోగా, అట్టర్ ప్లాప్ అయిందని ఆయన అన్నారు. కేవలం ఆంధ్ర నాయకులకే పరిమితమైన ఈ సభకు తెలంగాణ నేతలెవరూ హాజరు కాలేదని ఆయన చెప్పారు. ఈ మేరకు ఆయన ఓ ప్రకటనను విడుదల చేశారు. అమరవాది ప్రమాణ స్వీకార కార్యక్రమాన్ని తెలంగాణ ఆర్యవైశ్య నేతలు, ఆర్యవైశ్య ప్రముఖులు, ప్రజా ప్రతినిధులు ముక్త కంఠంతో బహి ష్కరించడం ద్వారా అమరవాది వర్గానికి గట్టి బుద్ధి చెప్పారని శ్యామ్ విమర్శించారు. ముఖ్యంగా వైశ్య పితామహుడు గంజి రాజమౌళి గుప్తా, ఎమ్మెల్సీ బొగ్గారపు దయానంద్, ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ, మాజీ ఎమ్మెల్యే గణేశ్ గుప్త, వైశ్య కార్పొరేషన్ చైర్పర్సన్ సుజాత, వంటి హేమా హేమీలతో పాటు వైశ్య కార్పొరేషన్ మాజీ చైర్మన్లు కోలేటి దామోదర్, ఉప్పల శ్రీనివాస్ గుప్త, బొల్లం సంపత్ వంటి వారు అమరవాది ప్రమాణ స్వీకారానికి హాజరు కాలేదన్నారు. ప్రోటోకాల్ ఉన్న నాయకులు సైతం ఈ 'అక్రమ ఎన్నిక'ను నిరసిస్తూ దూరంగా ఉండటం, అమరవాది వర్గం పట్ల ఉన్న వ్యతిరేకతకు నిదర్శనమని ఆయన పేర్కొన్నారు. గత 11 ఏళ్లుగా అప్రజాస్వామికంగా వ్యవహరిస్తున్న అమరవాది వర్గానికి తెలంగాణ వైశ్య సమాజం ఈ విధంగా చెంపదెబ్బ కొట్టిందని శ్యాంసుందర్ మండిపడ్డారు. నిన్నటి వరకు ఆంధ్ర నేతలను విమర్శించిన వారే, నేడు టీజీ వెంకటేష్, కనకరాజు వంటి ఆంధ్ర నాయకుల అండ కోసం పాకులాడటం వారి ద్వంద్వ నీతికి నిదర్శనమని ధ్వజమెత్తారు. గతంలో శ్రీశైలం సత్రం విషయంలో ప్రాంతీయవాదాన్ని రెచ్చగొట్టిన అమరవాది, ఇప్పుడు తన పదవి కోసం ఆంధ్ర నేతలను ఆశ్రయించడం విడ్డూరంగా ఉందన్నారు. కేవలం 2-3 ఓట్ల సాంకేతిక మెజారిటీతో, అంగబలం, అర్థబలంతో గెలిచినంత మాత్రాన అది నిజమైన విజయం కాదని, తనకు వచ్చిన 520 ఓట్లు నీతినిజాయితీకి ప్రతీకలని ఆయన స్పష్టం చేశారు. కేవలం కొద్దిమంది రైస్ మిల్లర్ల నాయకులతో తూతూమంత్రంగా సభ జరుపుకోవడం హాస్యాస్పదమని, ఈ అక్రమ పదవి శాశ్వతం కాదని ఆయన హెచ్చరించారు. వైశ్య మహాసభలో జరిగిన అక్రమాలు, అన్యాయంపై త్వరలోనే న్యాయస్థానం ద్వారా పోరాటం చేస్తామని, తప్పు చేసిన వారికి కోర్టు ద్వారా బుద్ధి చెబుతామని శ్యాంసుందర్ హెచ్చరించారు. పదవుల కోసం, వ్యాపారాల కోసం కొందరు బానిసలుగా మారవచ్చు కానీ, ఆత్మాభిమానం ఉన్న ఆర్యవైశ్య జాతి అన్యాయాన్ని ఎప్పుడూ సహించదని ఆయన పేర్కొన్నారు. తెలంగాణ ఆర్యవైశ్య మహాసభ పేరుతో ఆంధ్రా నేతలతో సభ నిర్వహించి అమరవాది వర్గం ఏకాకిగా మిగిలిపోయిందని, భవిష్యత్తులో తమ సత్తా ఏంటో చూపిస్తామని హెచ్చరించారు.

# పాలమూరు పట్టణాభివృద్ధికి ప్రణాళికలు

- ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి



మహబూబ్‌నగర్, మే2 (జనంసాక్షి) : మహబూబ్‌నగర్ పట్టణాభివృద్ధికి ప్రణాళికలు రూపొందించామని, అధునాతన హంగులతో నగరంలో పార్కులు, వాకింగ్ ట్రాక్స్ అభివృద్ధి చేస్తున్నట్టు ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి అన్నారు. పట్టణ ప్రజలకు అన్ని మౌలిక సదుపాయాలు అందించేందుకు నిరంతర కృషి చేస్తున్నట్లు చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం సహకారంతో భారీ నిధులు సమీకరించి అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతునట్లు పేర్కొన్నారు. మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని ఎంవీఎస్ డిగ్రీ కళాశాల మైదానంలో రూ.50 లక్షల నిధులతో నూతనంగా ఏర్పాటు చేయనున్న వాకింగ్ ట్రాక్‌కు కార్పొరేషన్, ముడా ఛైర్మన్లతో కలిసి శంకుస్థాపన చేశారు. నగర సుందరీకరణలో భాగంగా పట్టణంలో ఖాళీగా ఉన్న వివిధ ప్రాంతాల్లో పార్కులు, ఓపెన్ జిమ్ కేంద్రాలుగా అభివృద్ధి చేయనున్నామని, ఇప్పటికే మూడా ఆధ్వర్యంలో అనేక పార్కులను అభివృద్ధి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకువచ్చినట్లు వెల్లడించారు. జిల్లా కేంద్రంలో ఉన్న మైదానాలకు వేలాది మంది వాకర్స్ వస్తుండటంతో వారి అవసరాలను దృష్టిలో ఉంచుకుని వాకింగ్ ట్రాక్, లైటింగ్ సదుపాయాలు ఏర్పాటు చేస్తున్నామని పేర్కొన్నారు.

# ఉత్తమ్ కెసిఆర్ కోవర్ట్

- పౌరసరఫరాలో అత్యంత అవినీతి
- నిజామాబాద్ ఎంపి అర్వింద్ ఆరోపణలు



హైదరాబాద్, మే2 (జనంసాక్షి) : కాంగ్రెస్ నేతలకు ఎంపీ ధర్మపురి అర్వింద్ స్ట్రాంగ్ కౌంటర్ ఇచ్చారు. దేశవ్యాప్తంగా గ్యాస్ ధరలు పెరగడానికి కారణం తెలియక రాహుల్‌గాంధీ పిల్ల చేష్టలు చేస్తున్నారని మండిపడ్డారు. చెప్పులు, దుస్తులు సరిగా వేసుకోవడానికి రాని వ్యక్తి దేశంలో ప్రధాన విపక్ష పార్టీ లీడర్ అనుకోవడానికి సిగ్గుగా ఉందన్నారు. శనివారం ఎంపీ మాట్లాడుతూ.. రేవంత్‌రెడ్డి సీఎం అయ్యాక చేసిందేమీ లేదని విమర్శించారు. కుటుంబ సభ్యుల ఆస్తులు పెంచుకోవడంపైనే రేవంత్‌కు శ్రద్ధ అంటూ వ్యాఖ్యానించారు. ఉత్తమ్ కుమార్ రెడ్డి.. కేసీఆర్ కోవర్ట్ అని ఎంపీ ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో ఒక్క సివిల్ సప్లై శాఖలోనే అత్యంత అవినీతి జరుగుతోందని అన్నారు. ఇరిగేషన్ శాఖలో కేసీఆర్ కోవర్టులనే ఉద్యోగులుగా పెట్టుకున్నారని మండిపడ్డారు. కాళేశ్వరం కంటే భారీ అవినీతి.. ఉత్తమ్ శాఖలో జరుగుతోందని అన్నారు. కాళేశ్వరం అవినీతిలో కేసీఆర్ కుటుంబాన్ని కాపాడుతోంది రేవంత్‌రెడ్డి, ఉత్తమ్ కుమార్ రెడ్డి అంటూ ఎంపీ ధర్మపురి అర్వింద్ సంచలన వ్యాఖ్యలు చేశారు.

# కర్మన్ ఘాట్ ఆంజనేయుడి సేవలో అభిశేక్ శర్మ

- దర్శనం కల్పించిన ఆలయ అధికారులు



హైదరాబాద్, మే 2 (జనంసాక్షి) : సన్‌రైజర్స్ హైదరాబాద్ స్టార్ ప్లేయర్ అభిషేక్ శర్మ హైదరాబాద్‌లోని కర్మన్‌ఘాట్ ఆంజనేయస్వామి ఆలయాన్ని సందర్శించాడు. శనివారం స్వామి వారి సన్నిధిలో ప్రత్యేక పూజలు చేశాడు. అతడికి ఆలయ అధికారులు స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. దీనికి సంబంధించిన ఫొటోలను అభిషేక్ శర్మ.. తన ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్ చేశాడు. దీంతో అవి సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. గతంలో కూడా అతడు నగరంలోని బల్కంపేట ఎల్లమ్మ, జూబ్లీహిల్స్ పెద్దమ్మ తల్లి దేవాలయాలను దర్శించుకున్నాడు. ఆదివారం సన్‌రైజర్స్ హైదరాబాద్ జట్టు కోల్‌కతా నైట్ రైడర్స్‌తో ఉప్పల్ వేదికగా తలపడనుంది. ఈ నేపథ్యంలో నగరానికి వచ్చిన అభిషేక్ శర్మ.. ప్రముఖ ఆలయాలను దర్శించుకుంటున్నాడు. ఇదిలా ఉండగా, ఐపీఎల్ 2026లో సన్‌రైజర్స్ హైదరాబాద్ అద్భుత ప్రదర్శనలు చేస్తోంది. ఆడిన తొమ్మిది మ్యాచుల్లో ఆరు గెలిచి పాయింట్ల పట్టికలో మూడో స్థానంలో ఉంది. టోర్నీ ఆరంభంలో కాస్త తడబడినప్పటికీ.. తిరిగి పుంజుకుని గత ఐదు మ్యాచుల్లో వరుసగా విజయాలు సాధించింది. కాగా అభిషేక్ శర్మ 9 మ్యాచుల్లో 425 పరుగులు చేశాడు. ఇందులో 40 ఫోర్లు, 31 సిక్స్‌లు ఉన్నాయి. ఈ సీజన్‌లో అభిషేక్.. ఒక సెంచరీ, రెండు హాఫ్ సెంచరీలు బాది అద్భుతమైన ఫామ్‌ను కనబరుస్తున్నాడు.

## ఆయుర్వేద కళాశాలలో లైంగిక వేధింపుల కేసు

# ప్రొఫెసర్, ల్యాబ్ టెక్నీషిన్ సస్పెన్షన్

అమరావతి, మే2 (జనంసాక్షి) : విజయవాడలోని డాక్టర్ నోరి రామశాస్త్రి ప్రభుత్వ ఆయుర్వేద వైద్య కళాశాలలో లైంగిక వేధింపుల వ్యవహారంలో ప్రభుత్వం చర్యలు తీసుకుంది. ఈ ఘటనపై విచారణ అనంతరం ప్రొఫెసర్ దేవదత్ మౌళీనాయక్, ల్యాబ్ టెక్నీషియన్ సుబ్రహ్మణ్యంను సస్పెండ్ చేసింది. విద్యార్థినుల ఫిర్యాదుపై నిర్లక్ష్యంగా వ్యవహరించిన కళాశాల ప్రిన్సిపల్, మరో అధ్యాపకురాలిని ప్రభుత్వానికి సరెండర్ చేస్తూ ఆయుష్ విభాగం కమిషనర్ రోణంకి గోపాలకృష్ణ ఆదేశాలు జారీ చేశారు. ఇప్పటికే ఈ ఘటనలో ప్రొఫెసర్, ల్యాబ్ టెక్నీషియన్‌ను సస్పెండ్ చేయాలని రాష్ట్ర మహిళా కమిషన్ ప్రభుత్వానికి సిఫార్సు చేసిన విషయం తెలిసిందే.

# ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

- అటవీ పర్యావరణ దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ
- సాయి కన్వెన్షన్ హాల్లో కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ



వరంగల్ బ్యూరో, మే 02 (జనం సాక్షి) : ప్రజల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలో ప్రజా పాలన కొనసాగుతుందని రాష్ట్ర అటవీ పర్యావరణ దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ అన్నారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా నియోజకవర్గ అభివృద్ధిని లక్ష్యంగా పెట్టుకుని రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న కార్యక్రమాల్లో భాగంగా శనివారం సాయి కన్వెన్షన్ హాల్లో నియోజకవర్గ స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా పర్యావరణ, అటవీ, దేవాదాయ శాఖ మంత్రివర్యులు కొండా సురేఖ హాజరయ్యారు. కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద, అదనపు కలెక్టర్ (రెవెన్యూ) జి. సంధ్యారాణి, సంబంధిత వార్డుల కార్పొరేటర్లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక ద్వారా జిల్లాలో వచ్చిన మార్పులను ప్రజలకు తెలియజేయడం లక్ష్యంగా ఈ నియోజకవర్గ సమావేశాన్ని నిర్వహించామని తెలిపారు. ప్రజల సంక్షేమమే ప్రభుత్వ పరిపాలనలో ప్రధాన ధ్యేయమని పేర్కొన్నారు. ఈ సందర్భంగా వరంగల్, ఖిలా వరంగల్ మండలాల ప్రజలకు రూ.4,21,48,836 మొత్తాన్ని 421 మంది లబ్ధిదారులకు చెక్కుల రూపంలో పంపిణీ చేశారు. మైనార్టీ మహిళలకు రెండో విడతలో భాగంగా 248 కుట్టుమిషన్లను పంపిణీ చేశారు. నేతన్న భరోసా పథకం ద్వారా చేనేత కార్మికులకు సంవత్సరానికి రూ.18,000 చొప్పున (త్రైమాసికంగా రూ.4,500), అనుబంధ కార్మికులకు సంవత్సరానికి రూ.6,000 (త్రైమాసికంగా రూ.1,500) చొప్పున మొదటి విడతగా రూ.78,52,500 మొత్తాన్ని 252 మంది లబ్ధిదారులకు అందజేశారు. అదనంగా 64,339 ఇందిరమ్మ చీరలను పంపిణీ చేశారు. సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా కూడా పలువురు లబ్ధిదారులకు ఆర్థిక సహాయం అందజేశారు. ఈ సందర్భంగా నగర మేయర్ గుండు సుధారాణి మాట్లా డుతూ ప్రజారోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సన్నబియ్యం పంపిణీ ద్వారా పేదల ఆకలి తీర్చారని అన్నారు. అధికారులు ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య వారధిగా పని చేస్తూ ప్రజా సమస్యలను పరిష్కరించడంలో కీలక పాత్ర పోషిస్తున్నారని పేర్కొన్నారు. మంత్రి చొరవతో జిల్లాలోని ఆలయాల అభివృద్ధికి నిధులు అందుతున్నాయని తెలిపారు. జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద మాట్లాడుతూ ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా ఇప్పటివరకు 10 అంశాల్లో 5 అంశాలు పూర్తయ్యాయని, మే 4 నుంచి జూన్ 12 వరకు వ్యవసాయం, విద్య, యువజన-క్రీడలు, మహిళా, పర్యావరణ రంగాలకు సంబంధించిన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రతి అంశానికి నోడల్ అధికారులను నియమించి బృందాలుగా పనులు చేపడుతున్నామని, ఈ కార్యక్రమం ద్వారా జిల్లాలో స్పష్టమైన మార్పు తీసుకురావాలని పిలుపునిచ్చారు. అంతకు ముందు ఆయా శాఖలకు చెందిన అధికారులు 99 రోజుల కార్యాచరణలో భాగంగా చేపట్టిన కార్యక్రమాల వివరాలను వివరించారు. ఈ కార్యక్రమంలో డిఆర్ఓ విజయలక్ష్మి, డిబిసిడిఓ పుష్పలత, డి డబ్ల్యు ఓ రాజమణి, డిఎంహెచ్వో సాంబార్ శివరావు, ఇండస్ట్రియల్ జిఎం నరసింహమూర్తి, ఖిలా వరంగల్ మండల తాసిల్దార్ ఇక్బాల్, వరంగల్ మండల తాసిల్దార్ శ్రీకాంత్, కార్పొరేటర్లు పాల్గొన్నారు.

# కూకట్‌పల్లిలో నవదంపతుల ఆత్మహత్య



కూకట్‌పల్లి, మే2 (జనంసాక్షి) : హైదరాబాద్ కూకట్ పల్లిలో విషాదం చోటుచేసుకుంది. కార్తీక్(28), మంజుల(27) అనే నవదంపతులు ఆత్మహత్యకు పాల్పడిన ఘటన స్థానికంగా తీవ్ర కలకలం రేపింది. కార్తీక్ ఉరివేసుకోగా భార్య మంజుల పాయిజన్ తీసుకొన్నట్లు సమాచారం. గమనించిన కుటుంబసభ్యులు వెంటనే స్థానిక ఆసుపత్రికి తరలించారు. మార్చి 8న పెళ్లి జరగగా రెండు నెలలైనా గడవకముందే ఆత్మహత్యకు పాల్పడడంతో కుటుంబసభ్యులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. నవదంపతుల మృతితో ఇరు కుటుంబాల్లో తీవ్ర విషాదం నెలకొంది. కార్తీక్ మార్కెటింగ్ లో పనిచేస్తున్నట్లు గుర్తించారు. మంజుల హౌస్ వైఫ్. మృతుడు సోదరుడు మాట్లాడుతూ.. ఇద్దరు సూసైడ్ చేసుకోవడం మమ్మల్ని కలిచి వేసింది.. మేము షాక్ లో ఉన్నామని తెలిపారు. కార్తీక్ మంజుల సూసైడ్ ఎందుకు చేసుకున్నారో తెలియదు. కార్తీక్ ఎంత ఫోన్ చేసిన ఫోన్ లిఫ్ట్ చేయలేదన్నారు. తనకు అరగంట క్రితం పోలీసు నుండి మా సోదరుడు సూసైడ్ చేసుకున్నాడని కాల్స్ వచ్చినట్లు తెలిపాడు. దీంతో ఇంటికి చేరుకుని వెంటనే ప్రైవేట్ హాస్పిటల్ షిఫ్ట్ చేశాం.. బెడ్ రూంలో కార్తిక్ హ్యాంగ్ చేసుకున్నాడు.. మంజుల పాయిజన్ తీసుకుందని తెలిపాడు. కార్తీక్ మంజుల ఇద్దరు మంచిగా ఉండేవారన్నారు. నిన్న సాయంత్రం వారి ఇద్దరితో మాట్లాడాను వారు మంచిగా మాట్లాడారని చెప్పారు. ఎందుకు సుసైడ్ నిర్ణయం తీసుకున్నారో మాకు తెలియదన్నారు. కారణం ఏంటో అసలు తెలియదు.. పోలీసులు ఇన్వెస్టిగేషన్లో తెలుస్తుందని చెప్పుకొచ్చారు. కూకట్‌పల్లి సీఐ శోభన్ మాట్లాడుతూ.. మధ్యాహ్నం 12 గంటలకు సమాచారం అందింది.. ప్రైవేట్ హాస్పిటల్ వారు మాకు కాల్ చేసి ఇద్దరు సూసైడ్ చేసుకున్న కేస్ వచ్చిందని తెలిపారు. దీంతో మా టీమ్ తో ఆసుపత్రికి చేరుకున్నామన్నారు. ఇద్దరు నవ దంపతులు మృతి చెందారు.. కార్తీక్ బెడ్ రూమ్ లో హ్యాంగ్ చేసుకున్నాడు మంజుల పాయిజన్ తీసుకున్నట్లు ఉందని తెలిపారు. మంజుల తల్లి ఫిర్యాదు మేరకు అనుమానాదస్పద మృతిగా కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామన్నారు. ఇద్దరు నవ దంపతులు ఎందుకు సూసైడ్ చేసుకున్నారో కారణాలు తెలియరాలేదని అన్నారు. ఘటనపై అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తున్నామన్నారు. కార్తీక్ ఇంట్లో క్లూస్ టీం తో ఆధారాల సేకరిస్తున్నాం.. సూసైడ్ నోట్ లభించలేదని సీఐ శోభన్ తెలిపారు.

# అర్ధరాత్రి యువకుడిపై దాడి

- ప్రాణాలు పోయేలా కొట్టి పడేసిన దుండగులు
- ఆస్పత్రిలో ప్రాణాపాయ స్థితిలో యువకుడికి చికిత్స

వనపర్తి, మే2 (జనంసాక్షి) : వనపర్తి మండలం పెద్దగూడెం గ్రామంలో శుక్రవారం అర్ధరాత్రి దారుణ ఘటన జరిగింది. శివ (27 ) అనే యువకుడిపై గుర్తు తెలియని దుండగులు దాడి చేసి, ఆయన కాళ్లు, చేతులను విరగొట్టి, తల పగలగొట్టి ఇంటి ముందు పడవేశారు. ఈ సంఘటన గ్రామంలో కలకలం రేపింది. స్థానికుల సమాచారం మేరకు.. అర్ధరాత్రి సమయంలో కొందరు వ్యక్తులు యువకుడిని బయటకు తీసుకెళ్లి తీవ్రంగా కొట్టినట్లు సమాచారం. అనంతరం గాయాలతో ఉన్న శివను ఇంటి ముందు వదిలి వెళ్లిపోయారు. విషయం గమనించిన కుటుంబ సభ్యులు, గ్రామస్తులు వెంటనే గాయపడిన యువకుడిని చికిత్స కోసం ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం శివ ఆరోగ్య పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలుస్తోంది. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని దుండగుల కోసం గాలింపు చర్యలు చేపట్టారు. యువకుడిపై దాడికి గల కారణాలపై అన్ని కోణాల్లో పోలీసులు విచారణ జరుపుతున్నారు. గ్రామంలో ఈ ఘటనతో భయాందోళనలు నెలకొన్నాయి. పోలీసులు త్వరగా నిందితులను పట్టుకుని కఠిన చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు డిమాండ్ చేశారు.



# పవన్‌కు సీఎం చంద్రబాబు పరామర్శ

హైదరాబాద్, మే2 (జనంసాక్షి) : ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్‌ను పరామర్శించారు. ఇటీవల పవన్ కళ్యాణ్‌కు సర్జరీ జరగడంతో ప్రస్తుతం ఆయన విశ్రాంతి తీసుకుంటున్నారు. ఈ నేపథ్యంలో శనివారం హైదరాబాద్‌లోని పవన్ కళ్యాణ్ నివాసానికి సీఎం చంద్రబాబు వెళ్లి ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. పవన్ కళ్యాణ్ త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించిన సీఎం చంద్రబాబు, తగినంత విశ్రాంతి తీసుకోవాలని సూచించారు. అలాగే వైద్యుల సలహాలను పాటించాలని కూడా చెప్పారు. తనను పలకరించడానికి వచ్చిన సిఎం చంద్రబాబుకు పవన్ కృతజ్ఞతు తెలిపారు.

# ప్రియుడి మోసంపై ఫిర్యాదు

- పోలీస్ స్టేషన్ భవనంపై నుంచి దూకిన యువతి




నిజామాబాద్, మే2 (జనంసాక్షి) : నిజామాబాద్ జిల్లా బాల్కొండ పోలీస్‌స్టేషన్‌లో యువతి ఆత్మహత్యకు యత్నించింది. పోలీస్‌స్టేషన్ భవనంపై నుంచి దూకేసింది. బాల్కొండకు చెందిన సాయికుమార్‌తో గత కొన్నాళ్లుగా ఆ యువతి ప్రేమలో ఉంది. అంతకుముందే సాయికుమార్‌కు పెళ్లయింది. కానీ, ఆ విషయాన్ని ఆమె వద్ద దాచిపెట్టాడు. పెళ్లి విషయం దాచిపెట్టి మోసం చేశాడని యువతి మనస్తాపానికి గురైంది. అతడిపై ఫిర్యాదు చేసేందుకు పోలీస్‌స్టేషన్‌కు వెళ్లింది. ఫిర్యాదు చేసిన అనంతరం.. స్టేషన్ భవనం నుంచి కిందికి దూకేసింది. తీవ్రంగా గాయపడిన యువతిని పోలీసులు నిజామాబాద్ ఆస్పత్రికి తరలించారు.

# ఢిల్లీలో యువ జడ్జి ఆత్మహత్య

న్యూఢిల్లీ, మే2 (జనంసాక్షి) : దక్షిణ ఢిల్లీలోని సప్దర్‌గంజ్ ప్రాంతంలో జడ్జి ఒకరు ఆత్మహత్య చేసుకున్నట్టు పోలీసులు వెల్లడించారు. జడ్జి అమన్ కుమార్ శర్మ (30) మృతదేహాన్ని ఆయన ఇంట్లో చూసిన బంధువు ఒకరు పోలీసులకు సమాచారం అందించారు. శనివారం మధ్యాహన్నం 1.45 గంటల సమయంలో తమకు కాల్ వచ్చిందని పోలీసులు తెలిపారు. మృతదేహాన్ని వారు పోస్టుమార్టం నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. అసలేం జరిగిందో తెలుసుకునేందుకు అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తున్నారు. జడ్జి అమన్ కుమార్ శర్మ 2018లో సింబయాసిస్ లా స్కూల్ నుంచి గ్రాడ్యుయేషన్ పూర్తి చేశారు. 2019 జూన్ 19న ఢిల్లీ జుడీషియల్ సర్వీసెస్‌లో చేరారు. తన కెరీర్‌లో ఆయన పలు కోర్టుల్లో వివిధ సివిల్, క్రిమినల్ కేసులను డీల్ చేశారు. గతేడాది అక్టోబర్‌లో ఆయన డిస్టిక్ట్ లీగల్ సర్వీసెస్ అథారిటీ సెక్రటరీగా బాధ్యతలు స్వీకరించారు.

# పొలాల్లో ఎండమావులు... ఊళ్లలో వలసల జాతర!





తెలుగు రాష్ట్రాల గుండె చప్పుడు వ్యవసాయం నేడు ఒక తీవ్రమైన సంక్షోభంలో కొట్టుమిట్టాడుతోంది. ఒకప్పుడు పచ్చని పంట పొలాలతో, రైతుల పండు వెన్నెల నవ్వులతో కళకళలాడిన ఆంధ్రప్రదేశ్, తెలంగాణ పల్లెలు నేడు వెలవెలబోతున్నాయి. ఊళ్లలో యువత కరువవుతోంది, ముసలివారు మాత్రమే మిగిలి పొలాన్ని చూస్తూ నిట్టూరుస్తున్నారు. యువ రైతులు పట్టణాలకు వలస బాట పడుతున్నారు. పండించిన పంటకు గిట్టుబాటు ధర రాక, పెరిగిన అప్పుల భారం భరించలేక, అవమానం తట్టుకోలేక రైతన్నలు ఆత్మహత్యలకు పాల్పడుతున్న దృశ్యాలు నిత్యకృత్యమయ్యాయి. ఈ విషాదానికి మూల కారణమేంటని ఆర్థిక నిపుణులు, వ్యవసాయ శాస్త్రవేత్తలు పరిశోధిస్తే, ఒక చేదు నిజం బయటపడుతుంది అది ప్రభుత్వాలు ఓటు బ్యాంకు రాజకీయాల కోసం ఇస్తున్న విచ్చలవిడి ఉచిత పథకాలే!జాతీయ నమూనా సర్వే సంస్థ (చీూఖూ) గణాంకాలు విస్తుగొలిపే నిజాలను చెబుతున్నాయి. 2001లో ఆంధ్రప్రదేశ్‌లో 1.23 కోట్ల వ్యవసాయ కుటుంబాలు ఉండగా, నేడు ఆ సంఖ్య 89 లక్షలకు పడిపోయింది. తెలంగాణలో 68 లక్షల రైతు కుటుంబాల లో కేవలం 52 లక్షలు మాత్రమే ఇప్పటికీ వ్యవసాయంలో కొనసాగుతున్నాయి. గత రెండు దశాబ్దాల్లో దాదాపు 50 లక్షల మంది రైతులు తమ వృత్తిని, భూమిని వదిలేశారు. ఇది కేవలం గణాంకం కాదు, ఒక జాతీయ విషాదం. తరతరాలుగా నమ్ముకున్న భూమిని వదిలి, నగరాల్లో అనామకులుగా బతుకుతున్న ఈ లక్షలాది మంది ఎక్కడికి వెళ్లారు? వారి ఆత్మగౌరవం ఏమైంది?2024-25 ఆర్థిక సంవత్సరంలో రెండు రాష్ట్రాల ఆర్థిక పరిస్థితిని పరిశీలిస్తే, భయంకరమైన వాస్తవాలు కనిపిస్తాయి.తెలుగు రాష్ట్రాల ప్రస్తుత ఆర్థిక స్థితిని పరిశీలిస్తే ఆందోళన కలిగించే వాస్తవాలు కళ్ళకు కడతాయి. ఆంధ్రప్రదేశ్ మొత్తం అప్పు రూ.4,56,000 కోట్లుగా ఉండగా, తెలంగాణ రాష్ట్ర అప్పు ఏకంగా రూ.7,00,000 కోట్లకు పైగా చేరుకుంది. ఈ అప్పుల కుంపటికి ప్రధాన కారణం ప్రభుత్వాలు అమలు చేస్తున్న విచ్చలవిడి ఉచిత పథకాలే. ప్రజాకర్షక పథకాల పేరుతో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఏటా రూ.72,000 కోట్లు, తెలంగాణ ప్రభుత్వం రూ.68,000 కోట్లు ఖర్చు చేస్తున్నాయి. ఈ ఆర్థిక నిర్వహణ లోపం వల్ల సామాన్య ప్రజలపై విపరీతమైన భారం పడుతోంది. తలసరి అప్పు భారాన్ని గమనిస్తే ఆంధ్రప్రదేశ్ పౌరుడిపై రూ.82,000 పైన, తెలంగాణ పౌరుడిపై ఏకంగా రూ.1,85,000కు పైగా అప్పు ఉంది.ఈ సంఖ్యలు మనస్సును కలచివేస్తాయి. ప్రతి తెలంగాణ పౌరుడు పుట్టిన శిశువు నుండి వృద్ధుడి వరకు సగటున రూ.1,85,000 అప్పును తన భుజాలపై మోస్తున్నాడు. ఆంధ్రప్రదేశ్‌లో పరిస్థితి కూడా భిన్నంగా లేదు. ఈ అప్పులు ఎందుకు పెరిగాయి? కేవలం ఉచితాల కోసం! సంక్షేమం పేరుతో ప్రభుత్వాలు చేస్తున్న తాయిలాలు రాష్ట్రాల పునాదులను దెబ్బతీస్తున్నాయి.ప్రస్తుతం అమలులో ఉన్న కొన్ని ముఖ్యమైన ఉచిత/పథకాలు.రైతులకు ఉచిత విద్యుత్ (9 గంటలు)రైతు భరోసా / రైతు బంధు రూ.10,000/ఎకరా,మహిళలకు ఉచిత బస్ ప్రయాణం (మహాలక్ష్మి పథకం)అమ్మ వడి / గసం రూ.15,000 ,నిరుద్యోగ భృతి రూ.3,000-4,000, సబ్సిడీ గ్యాస్ సిలిండర్లు ఉ ఉచిత బియ్యం పంపిణీఈ పథకాల ఉద్దేశం పేదలకు అండగా ఉండటమే కావొచ్చు, కానీ వీటి అమలు తీరు రైతన్నను నిరాశ్రయుడిని చేస్తోంది. ప్రభుత్వం ఓటు కోసం ఇచ్చే రూ.10,000 సాయం రైతుకు ఒక సీజన్ పెట్టుబడికి కూడా సరిపోదు, కానీ అదే ప్రభుత్వం మౌలిక సదుపాయాలకు నిధులు కేటాయించకపోవడం వల్ల రైతు పంటను అమ్ముకోలేక నష్టపోతున్నాడు.

పాల్కూరు మండలానికి చెందిన 28 ఏళ్ల రమేష్ కథే రెండు తెలుగు రాష్ట్రాల యువ రైతుల పరిస్థితికి అద్దం పడుతోంది. ఐదు ఎకరాల పొలం ఉన్నా, అందులో వచ్చే ఆదాయం కంటే నగరంలో ఆటో నడపడం మేలని అతను భావిస్తున్నాడు. నెల నెలా నిరుద్యోగ భృతి వస్తోంది, బస్సులో ఉచిత ప్రయాణం, రేషన్ బియ్యం దొరుకుతున్నాయి. మరి పొలంలో ఎండలో కష్టపడితే వచ్చేదేంటి? అని అతను అడుగుతున్నాడు. ఈ మాటలో ఉన్నది కేవలం సోమరితనం కాదు, ప్రభుత్వాలు సృష్టించిన ఉచితాల సంస్కృతి వల్ల పని పట్ల తగ్గిన గౌరవం. వ్యవసాయం చేయడం అంటే కష్టమని, దానికి బదులుగా ప్రభుత్వ సాయం మీద ఆధారపడటం సులభమని యువత భావించేలా పాలసీలు తయారయ్యాయి.

Reserve Bank of India (RBI) 2023 నివేదిక ప్రకారం, తెలంగాణ ప్రభుత్వం తన రాజస్వంలో 78% కేవలం జీతాలు, పెన్షన్లు, వడ్డీలు, మరియు ఉచిత పథకాలకే వెచ్చిస్తోంది. అంటే, రోడ్లు, విద్య, నీటి పారుదల వంటి మూలధన వ్యయం (ఝుజూఱ్ఖుశ్రీ జుఇజూవఅఉఙబతీవ) కోసం కేవలం 22% మాత్రమే మిగులుతోంది. ఆంధ్రప్రదేశ్‌లో పరిస్థితి మరీ దారుణం. రాష్ట్రం ఏటా రూ.1.1 లక్ష కోట్ల వడ్డీలు మాత్రమే చెల్లిస్తోంది. ఇది రాష్ట్ర వ్యవసాయ బడ్జెట్ కంటే ఐదు రెట్లు ఎక్కువ! గ్రామీణ యువతలో 61% మంది "ఉచిత పథకాలు అందుబాటులో ఉన్నాయి కదా, కష్టపడే పని ఎందుకు?" అని వ్యవసాయ కూలీ పనులను తిరస్కరిస్తున్నారు. ఉచిత విద్యుత్ భారాన్ని భరించలేక తెలంగాణ ఐ×ూజూవీం నష్టాలు రూ.12,000 కోట్లు దాటాయి. డెల్టా ప్రాంతాల్లో సాగు విస్తీర్ణం 18% తగ్గింది. 2015లో 45 లక్షల హెక్టార్లుగా ఉన్న వరి సాగు, నేడు 38 లక్షలకు పడిపోయింది.ఉచిత పథకాలు పూర్తిగా చెడ్డవి కావు. విద్య, వైద్యం, మరియు నిజమైన పేదరికంలో ఉన్నవారికి ఇచ్చే సహాయం అవసరమే. కానీ, ఓటు బ్యాంకు కోసం ఇచ్చే విచ్చలవిడి తాయిలాలు రాష్ట్రాలను దివాళా తీయిస్తున్నాయి.మనం చేయాల్సింది ఏంటి? ఉచిత డబ్బులు పంచడం కంటే, ఆ నిధులతో గ్రామీణ పరిశ్రమలు, ప్రాసెసింగ్ యూనిట్లు ఏర్పాటు చేయాలి. రైతుకు రూ.10,000 నగదు ఇచ్చే కంటే, అతని పంటకు రూ.10,000 అదనపు లాభం వచ్చేలా మార్కెట్ వ్యవస్థను బలోపేతం చేయాలి.వ్యవసాయాన్ని ఆధునీకరించడానికి, నీటి పారుదల సౌకర్యాలను కల్పించడానికి ప్రాధాన్యత ఇవ్వాలి. ప్రతి ఉచిత పథకం ప్రవేశపెట్టే ముందు, అది రాష్ట్ర ఆర్థిక వ్యవస్థపై చూపే ప్రభావాన్ని పారదర్శకంగా వెల్లడించాలి.రాష్ట్ర ప్రభుత్వాలు గుర్తుంచుకోవాల్సిన విషయం ఒకటి ఉంది అప్పు చేసి పప్పుకూడు పెట్టడం వల్ల ప్రజలు బతకరు, అప్పుల ఊబిలో కూరుకుపోతారు. నేడు తెలుగు రైతన్న ఆత్మహత్యలకు పరోక్ష కారణం ఈ ఆర్థిక విధానాలే. ఈ హెచ్చరికను ప్రభుత్వాలు, సమాజం ఇప్పుడు గుర్తించకపోతే, రేపటి తరం పంట పండించే చేతులే మిగలవు. ఆ రోజు ఎవ్వరికీ మంచిది కాదు. మార్పు మొదలు కావాలి ఓటు బ్యాంకు నుంచి అభివృద్ధి పథం వైపు!

**డా .సూర్యదేవర రామకృష్ణ,**
**9490754169**

# బంధాల బౌండరీలు..



### అనుబంధాల ఆంతర్యం..!

వివాహ బంధమా..? ప్రేమ బంధమా..? ఏది కావాలి..? మానవ పరిణామ క్రమంలో 'కుటుంబం' అనే వ్యవస్థను నిలబెట్టడానికి ఏర్పడిన అత్యంత బలమైన సాధనం వివాహం. అయితే, ఆధునిక కాలంలో వివాహం అనే 'నిర్మాణం' పటిష్టంగానే కనిపిస్తున్నా, అందులో ఉండాల్సిన ప్రేమ, స్నేహం అనే 'నివాసం' మాత్రం శిథిలమవుతోంది. చట్టబద్ధమైన పత్రాలు, సామాజిక ఆమోదాల మధ్య కొట్టుమిట్టాడుతున్న నేటి సంబంధాలను తాత్విక కోణంలో పరిశీలించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది. వివాహ బంధంలో ప్రేమ, స్నేహం లేకపోవడాన్ని తాత్విక పరిభాషలో 'అస్తిత్వ సంక్షోభం' గా పరిగణించవచ్చు. శాస్త్రీయంగా చూస్తే, ఇది కేవలం రెండు శరీరాల మధ్య జరిగే ఒక 'లావాదేవీ' మాత్రమే. ఇక్కడ బాధ్యత ఉంటుంది కానీ ఆత్మీయత ఉండదు, అవసరం ఉంటుంది కానీ ఆరాధన ఉండదు. సూటిగా చెప్పాలంటే ఒక యంత్రానికి ఇంధనం లేకపోతే అది ఎలాగైతే మొద్దుబారిపోతుందో, స్నేహం లేని వివాహం కూడా అలాగే యాంత్రికంగా మారుతుంది. ఇక్కడ 'నిశ్శబ్దం' అనేది ప్రశాంతతకు చిహ్నం కాదు, అది మాటలు చచ్చిపోయిన స్థితికి సంకేతం. సైకాలజీ ప్రకారం, ఇటువంటి బంధాల్లో ఉన్న వ్యక్తులు 'ఒంటరితనం కంటే భయంకరమైన సామీప్యతను' అనుభవిస్తారు. ఇది మనిషిలోని సృజనాత్మకతను, జీవితేచ్ఛను నెమ్మదిగా హరించివేస్తుంది. మరోవైపు, వివాహం అనే సామాజిక ముద్ర లేకపోయినా, కేవలం ప్రేమ, స్నేహాల పునాదులపై నిలబడే బంధం అత్యంత శక్తివంతమైనదిగా ఉంటుంది. ఎటువంటి చట్టబద్ధమైన కట్టుబాట్లు లేని చోట, ఒక వ్యక్తి మరొకరితో కలిసి ఉంటున్నారంటే, అది కేవలం వారి ఆత్మల మధ్య ఉన్న సామరస్యం వల్లే సాధ్యమవుతుంది.

ఇక్కడ మానసిక స్వేచ్ఛ ఎక్కువగా ఉంటుంది. ఒకరిని ఒకరు నియంత్రించాలనే కోరిక కంటే, ఒకరి ఎదుగుదలలో మరొకరు భాగస్వాములు కావాలనే తపన ఉంటుంది. అరిస్టాటిల్ చెప్పినట్లు, "స్నేహం అనేది రెండు శరీరాల్లో నివసించే ఒకే ఆత్మ". అటువంటి స్నేహం ఉన్నచోట వివాహ పత్రం లేకపోయినా, ఆ బంధం కాలాతీతంగా నిలుస్తుంది. వివాహం అనేది ఒక 'అద్దం' లాంటిదని చెప్పొచ్చు. అది సంబంధానికి ఒక రూపాన్ని ఇస్తుంది. కానీ అందులో కనిపించే 'ప్రతిబింబం' మాత్రం ప్రేమ, స్నేహాలే. అద్దం ఉండి ప్రతిబింబం లేకపోతే అది శూన్యం. అద్దం లేకపోయినా ప్రతిబింబం (అనుభూతి) ఉంటే, అది కంటికి కనిపించని సత్యం. అందుకే కావాల్సింది కేవలం 'వివాహాలు' కాదు, పరస్పర గౌరవం, స్నేహం ప్రాతిపదికన ఏర్పడే 'సుదృఢ అనుబంధాలు'. బంధం బాధ్యతగా కాకుండా, ఒక మధురమైన ప్రయాణంగా మారినప్పుడే మనిషి అస్తిత్వానికి పరిపూర్ణత లభిస్తుంది. వ్యవస్థల కంటే విలువలకే పెద్దపీట వేయాల్సిన సమయం ఇది. స్నేహం, ప్రేమ కలిగిన బంధంలో వివాహం లేకపోయినా, వివాహ బంధంలో మాత్రం ఖచ్చితంగా ప్రేమ, స్నేహం ఉండాలి. అలా ఉంటేనే ఆ వివాహ బంధం నిలబడుతుందనేది సత్యం.



**- కస్తూరిదారా**



## శ్రీ కాళ హస్తి!

గుడికొచ్చిన వాళ్ళు
అంతా శివభక్తులే!
శ్రీ -కాళ -హస్తి
ప్రదర్శన భక్తి
కావలసింది ముక్తి!
సాధనలే వేరు!
మనుషులూ అంతే!
లోకోభిన్నరుచి!
అంతా శ్రీకాళహస్తి!
ఎవరిమార్గం వారిది!
ఒకరికి నచ్చింది
మరొకరికినచ్చదు!
సంసారంలోనూ ఇంతే!
ఈ కథ సార్వజనీనం!

**-తమ్మినేని అక్కిరాజు**
హైదరాబాద్

## భగత్ సింగ్ కలల స్ఫూర్తితో ఏఐవైఎఫ్ ఆవిర్భావ చరిత్ర

భారత యువజన ఉద్యమ చరిత్రలో All India Youth Federation (AIYF) స్థాపన ఒక కీలక మైలురాయి. 1959 సంవత్సరానికి ముందు దేశవ్యాప్తంగా యువజన సంఘాలు రాష్ట్ర, జిల్లా, ప్రాంతీయ స్థాయిల్లో వేరువేరుగా పనిచేస్తున్నాయి. ఈ సంస్థల మధ్య కొంత సమన్వయం ఉన్నప్పటికీ, ఒక సమగ్ర జాతీయ వేదిక అవసరం బలంగా అనిపించింది. సామాన్య లక్ష్యాలు, సమాన ఆశయాలు పెరుగుతున్న కొద్దీ దేశవ్యాప్తంగా యువతను ఒకే జెండా కింద సమీకరించే అవసరం ఏర్పడింది.
ఈ అవసరాన్ని ముందుగా గుర్తించిన విప్లవాత్మక కమ్యూనిస్ట్ నాయకుడు, ఢిల్లీ ఎంసీడీకి అతి పిన్న వయసులోనే కౌన్సిలర్‌గా నిలిచిన Guru Radha Kishan మొదటి సమావేశాన్ని నిర్వహించేందుకు ముందడుగు వేశారు. అదే ఆలోచన తర్వాత మహత్తర ఉద్యమంగా మారింది.
1959 ఏప్రిల్ 28 నుండి మే 3 వరకు, న్యూ ఢిల్లీలో జరిగిన ఆవిర్భావ మహాసభలో 11 రాష్ట్రాల నుండి 250కి పైగా ప్రతినిధులు, పరిశీలకులు పాల్గొన్నారు. ఆరు రోజుల పాటు జరిగిన ఈ చారిత్రాత్మక సమావేశంలో అధికారికంగా ఏఐవైఎఫ్ ఏర్పాటును ప్రకటించారు. ఈ మహాసభలో సామ్యవాద ఆలోచనలను వ్యాప్తి చేయడం, యువతను సామాజిక మార్పు దిశగా నడిపించడం ప్రధాన లక్ష్యాలుగా నిర్ణయించారు. అంతేకాకుండా, అంతర్జాతీయ యువజన ఐక్యతకు ప్రతీక అయిన ఔశీతీశ్రీ౧ Federation of Democratic Youth (WFDY)తో అనుబంధం ఏర్పరచుకోవాలని నిర్ణయించి, ప్రపంచ యువజన ఉద్యమంలో భాగస్వామ్యం అయ్యింది.
ఈ మహాసభలో ప్రముఖ సినీ నటుడు, కళాకారుడు Balraj Sahaniని మొదటి అధ్యక్షుడిగా ఎన్నుకున్నారు. శారదా మిత్రను ప్రధాన కార్యదర్శిగా, ౯ా. ఖ. ఋుంబఒవఋుఅ చీుఱతీ గారిని కార్యవర్గ కమిటీ చైర్మన్‌గా ఎన్నుకోవడం జరిగింది. 121 మంది సభ్యులతో కూడిన కౌన్సిల్‌ను ఏర్పరచి, అందులో నుంచి 37 మంది సభ్యులతో కార్యవర్గాన్ని ఎంపిక చేశారు.

**భగత్ సింగ్ కలల స్ఫూర్తి - ఏఐవైఎఫ్ దారి**

ఈ ఆవిర్భావం వెనుక ఉన్న స్ఫూర్తి సాధారణం కాదు – అది విప్లవ వీరుడు దీష్ఘుఙ్ర్తుఫ్ ఽాఱఅవ్తష్ట కలల స్ఫూర్తి. భగత్ సింగ్ యువతను కేవలం దేశభక్తులుగా కాకుండా, సామాజిక మార్పుకు నాయకులుగా చూడాలని ఆశించాడు. ఆయన కలలు కనిన సమాజం – అన్యాయం లేని, అసమానతలు లేని, శోషణ రహిత భారతం. ఏఐవైఎఫ్ ఆవిర్భావం ఆ కలలనే కార్యరూపంలోకి తీసుకురావడానికి ప్రారంభమైన ఒక గొప్ప ప్రయత్నం. యువతను చైతన్యవంతం చేసి, వారి శక్తిని సమాజ నిర్మాణానికి వినియోగించడం ఈ సంస్థ యొక్క ప్రధాన లక్ష్యం.

**ఏఐవైఎఫ్ 67వ ఆవిర్భావ దినోత్సవం - యువజన పోరాటాలకు కొత్త దిశ**

రేపు ఏఐవైఎఫ్ 67వ ఆవిర్భావ దినోత్సవాన్ని జరుపుకుంటున్న ఈ సందర్భం కేవలం ఒక ఉత్సవం మాత్రమే కాదు – భారత యువజన చరిత్రలో పోరాటాల పథాన్ని గుర్తు చేసుకునే, భవిష్యత్ బాధ్యతలను మరింత స్పష్టంగా స్వీకరించే చారిత్రాత్మక ఘట్టం. దేశ స్వాతంత్ర్యానంతరం యువత ఎదుర్కొన్న సమస్యలకు సమాధానం చూపుతూ, ప్రజాస్వామ్య విలువల పరిరక్షణకు అంకితభావంతో ముందుకు సాగిన సంస్థే ఏఐవైఎఫ్. గత ఆరు దశాబ్దాలుగా ఏఐవైఎఫ్ యువత హక్కుల కోసం నిరంతరం పోరాడుతూ వచ్చింది. నిరుద్యోగం, విద్యలో అసమానతలు, ఆరోగ్య సేవల లోపాలు, సామాజిక అన్యాయాలు-ఇవన్నీ యువతను తీవ్రంగా ప్రభావితం చేస్తున్నాయి. ఈ పరిస్థితుల్లో ఏఐవైఎఫ్ ఉద్యమా లు కేవలం ప్రతిఘటనకే పరిమితం కాకుండా, ప్రత్యామ్నాయ విధానాల కోసం కూడా పోరాడుతున్నాయి. ప్రస్తుత కాలంలో దేశం తీవ్రమైన ఆర్థిక, సామాజిక సంక్షోభాలను ఎదుర్కొంటోంది. నిరుద్యోగం పెరుగుతూ ఉండగా, విద్యా రంగంలో ప్రైవేటీకరణ పెరిగిపోతోంది. పేద మరియు మధ్యతరగతి యువతకు ఉన్న అవకాశాలు క్షీణిస్తున్నాయి. ప్రజాస్వామ్య హక్కులపై దాడులు, మత విద్వేషాల పెరుగుదల, అసమానతల విస్తరణ-ఇవన్నీ యువత భవిష్యత్తును ప్రమాదంలోకి నెడుతున్నాయి.
తెలంగాణ రాష్ట్రంలో కూడా యువత అనేక సమస్యలను ఎదుర్కొంటోంది. ప్రభుత్వ నియామకాల్లో ఆలస్యం, విద్యార్థులపై పెరుగుతున్న ఆర్థిక భారాలు, గ్రామీణ యువతకు అవకాశాల కొరత---ఇవి అన్నీ తక్షణ పరిష్కారం కోరుతున్న అంశాలు. ఈ నేపథ్యంలో ఏఐవైఎఫ్ తెలంగాణ రాష్ట్ర కమిటీ యువత సమస్యలపై నిరంతరం పోరాటాలు నిర్వహిస్తూ, ప్రజల మధ్య చైతన్యం పెంచుతోంది.
ఏఐవైఎఫ్ కేవలం ఒక సంస్థ కాదు-ఇది ఒక ఉద్యమం, ఒక ఆలోచన, ఒక మార్పు శక్తి. యువతను సంఘటితం చేసి, వారి శక్తిని సమాజ మార్పు దిశగా మలచడం మా లక్ష్యం. గ్రామ స్థాయి నుండి జాతీయ స్థాయి వరకు యువజన శక్తిని ఒకటిగా కట్టిపడేసి, సమానత్వం, న్యాయం, ప్రజాస్వామ్యం కోసం పోరాటాన్ని బలోపేతం చేయాలి.
ఈ 67వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ప్రతి యువకుడు ఒక బాధ్యతను స్వీకరించాలి.
ప్రతి గ్రామంలో, ప్రతి కాలనీలో, ప్రతి విద్యాసంస్థలో యువజన సంఘటనలను నిర్మించాలి.
ప్రజా సమస్యలపై నిరంతరం స్పందిస్తూ, ప్రజల పక్షాన నిలబడాలి.
రాబోయే రోజుల్లో ఉపాధి హక్కు, ఉచిత మరియు నాణ్యమైన విద్య, అందరికీ అందుబాటులో ఉన్న ఆరోగ్య సేవలు-ఈ ప్రధాన అంశాలపై దేశవ్యాప్తంగా పెద్ద ఎత్తున ఉద్యమాలను చేపట్టాల్సిన అవసరం ఉంది. యువత భవిష్యత్తు కోసం ఈ పోరాటం తప్పనిసరి.
ఈ సందర్భంలో అన్ని స్థాయిల్లో ఏఐవైఎఫ్ యూనిట్లు ర్యాలీలు, సభలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించి ప్రజల్లో చైతన్యం పెంచాలి. యువతను పెద్ద ఎత్తున ఈ కార్యక్రమాలలో భాగస్వామ్యం చేయాలి.

**మన నినాదం స్పష్టం:**

ఉపాధి హక్కు సాధించాలి!
ప్రజా విద్యను కాపాడాలి!
ప్రజాస్వామ్యాన్ని రక్షించాలి!
బలమైన ఏఐవైఎఫ్ -- బలమైన భారత్!
యువజన ఐక్యత జిందాబాద్! ఏఐవైఎఫ్ జిందాబాద్!

ఈరోజు మన బాధ్యత.. ఈ చారిత్రాత్మక నేపథ్యం మనకు ఒక స్పష్టమైన సందేశాన్ని ఇస్తోంది - యువత ఐక్యమైతేనే దేశం మారుతుంది. పోరాటం కొనసాగితేనే హక్కులు సాధ్యమవుతాయి. భగత్ సింగ్ చూపించిన మార్గంలో, ఏఐవైఎఫ్ జెండా కింద యువతను సంఘటితం చేసి, న్యాయం, సమానత్వం, ప్రజాస్వామ్యం కోసం పోరాటాన్ని మరింత బలోపేతం చేద్దాం.
భగత్ సింగ్ కలలు – మన పోరాటాలు!
ఏఐవైఎఫ్ జిందాబాద్! యువజన ఐక్యత జిందాబాద్!



**డా. సయ్యద్ వలీ ఉల్లాహ్ ఖాద్రీ**
రాష్ట్ర అధ్యక్షుడు, తెలంగాణ
జాతీయ కార్యదర్శి,
All India Youth Federation (AIYF) advocate

# ప్రభుత్వ బడికి అరుదైన సన్మానం.. నూతన అధ్యాయానికి శ్రీకారం

**విద్య అనేది కేవలం వ్యక్తిగత అభివృద్ధికే పరిమితం కాదు; అది కుటుంబం, సమాజం, దేశ ప్రగతికి ప్రాణవాయువులాంటిది. అందుకే ఈ ఆధునిక సాంకేతిక నాగరిక సమాజంలో విద్యకు అపూర్వమైన ప్రాధాన్యం, విలువ, తీవ్రమైన పోటీ ఏర్పడింది. ఈ పరిస్థితిని ఆసరాగా తీసుకుని కొన్ని కార్పొరేట్ విద్యాసంస్థలు విద్యను ఒక వ్యాపారంగా మలచి, ఫీజుల రూపంలో కోట్ల రూపాయల సంపదను ఆర్జిస్తున్నాయి. ఈ కార్పొరేట్ విద్యాసంస్థల ప్రభంజ నం కారణంగా ప్రభుత్వ పాఠశాలల ప్రాధాన్యం క్రమంగా తగ్గిపోతోంది. తల్లిదండ్రుల్లో "కార్పొరేట్ పాఠశాలల్లో చదివితేనే పిల్లలు ప్రతిభావంతులవు తారు"అనే నమ్మకం బలపడేలా ఈ సంస్థల ప్రకటనలు రూపుదిద్దు కుంటున్నాయి.**



**కార్పొరేట్ ర్యాంకుల ప్రచార మాయాజాలం**

వాస్తవాన్ని పరిశీలిస్తే ఈ సంస్థల్లో చదివే విద్యార్థుల సంఖ్య ఎంత? వారిలో నిజంగా ఎంతమందికి ఉత్తమ ఫలితాలు వస్తున్నాయి? అనే ప్రశ్నలకు స్పష్టమైన సమాధానం లేకపోయినా, సాధించిన కొద్దిమంది ర్యాంకులను మాత్రమే పెద్ద ఎత్తున ప్రచారం చేయడం ద్వారా ఇవి సమాజాన్ని ప్రభావితం చేస్తున్నాయి. కొద్దిమందికి వచ్చిన విజయాలను గొప్పగా చూపించే కార్పొరేట్ ప్రకటనలు, ఆ సంస్థల్లో పెద్ద సంఖ్యలో విఫలమవుతున్న విద్యార్థుల శాతాన్ని మరుగున పడేస్తున్నాయి. అదే సమయంలో ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థుల ప్రతిభకు ఎలాంటి గుర్తింపు, ప్రోత్సాహం లభించడం లేదు. ఫలితంగా, "ప్రభుత్వ పాఠశాల అంటే చదువు కాదు, మధ్యాహ్న భోజనం మాత్రమే"అనే అపోహ సమాజంలో బలంగా పాతుకుపోయింది. ఈ దృక్పథం కారణంగా ప్రభుత్వ పాఠశాలల్లో చేరికల సంఖ్య గణనీయంగా తగ్గుతూ వచ్చింది.

**ప్రభుత్వ విద్యపై అపనమ్మకం - సమాజంలో పెరుగుతున్న చిన్నచూపు**

కార్పొరేట్ విద్యాసంస్థల ప్రకటనల మాయాజాల ప్రభావంతో తల్లిదండ్రులు, విద్యార్థులు కార్పొరేట్ విద్యాసంస్థల వైపు ఆకర్షితులవుతుండగా, ప్రభుత్వ పాఠశాలలపై చిన్నచూపు పెరుగుతోంది. పరిస్థితి ఎంత దారుణంగా మారిందంటే-ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేసే ఉపాధ్యాయులు కూడా తమ పిల్లలను అదే పాఠశాలల్లో చేర్పించడానికి వెనుకంజ వేస్తున్నారు. రోజువారీ కూలి చేసి జీవించే తల్లిదండ్రులు సైతం అప్పులు చేసి, తమ పిల్లలను ప్రైవేట్ పాఠశాలల్లో చదివించడానికి సిద్ధపడుతున్నారు. ఆశ్చర్యకరమైన విషయం ఏమిటంటే, ప్రభుత్వ పాఠశాలల్లో బాగా శిక్షణ పొందిన అర్హత కలిగిన ఉపాధ్యాయులు ఉన్నప్పటికీ, తల్లిదండ్రులు తమ పిల్లలను అక్కడ చేర్పించడానికి భయపడుతున్నారంటే ప్రభుత్వ పాఠశాలల పరిస్థితి ఎంతగా దిగజారిందో అర్థం చేసుకోవచ్చు.

**మౌలిక సదుపాయాలపై దృష్టి - బడికి సరికొత్త రూపురేఖలు**

ఈ మధ్యకాలంలో వస్తున్న ప్రభుత్వాలు, ప్రభుత్వ పాఠశాలల మౌలిక సదుపాయాల అభివృద్ధిపై కొంత దృష్టి సారించాయని చెప్పాలి. నాడు -నేడు కార్యక్రమం ద్వారా శిథిలావస్థలో ఉన్న బడుల భవనాలను అభివృద్ధి చేసి సుందరీకరించడం, డిజిటల్ తరగతులను ఏర్పాటు చేయడం, విద్యార్థులకు పుస్తకాలు, యూనిఫార్ములు, స్కూల్ బ్యాగులు అందించడం వంటి చర్యలను తీసుకోవడంలో సఫలమయ్యాయని కచ్చితంగా చెప్పవచ్చు.

**చరిత్ర సృష్టించిన పత్రికా ప్రకటన - నూతన అధ్యాయానికి శ్రీకారం**

తాజాగా పదో తరగతి పరీక్షా ఫలితాల విడుదల అనంతరం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తీసుకున్న ఒక అరుదైన, విశిష్టమైన కీలక నిర్ణయం అందరిని సంబరాశ్చర్యాలకు గురిచేసింది. ఇది రాష్ట్ర విద్యా చరిత్రలో అరుదైన, ఆహ్వానించదగ్గ పరిణామం. సాధారణంగా పదో తరగతి ఫలితాలు రాగానే పత్రికల మొదటి పేజీలు కార్పొరేట్ విద్యా సంస్థల అట్టహాసపు ప్రకటనలతో నిండిపోయేవి. అయితే, ఆ గత అనుభవానికి విరుద్ధంగా ఈసారి ఓ కొత్త దృశ్యం కనిపించింది. అగ్రశ్రేణి దినపత్రికల మొదటి పేజీలలో ప్రభుత్వ పాఠశాల విద్యార్థినుల చిరునవ్వులు, వారు సాధించిన అసాధారణ మార్కులు మెరిశాయి. దీనిని కేవలం ఒక పత్రికా ప్రకటనగా చూడకూడదు; ఇది ప్రభుత్వ బడి ఒడిలో సామాన్యుడి చదువు సాధించిన ఘన విజయం. ప్రభుత్వ బడుల పట్ల సమాజంలో నెలకొన్న అపోహలను పటాపంచలు చేసిన వాస్తవం.

**గణాంకాల సాక్ష్యం - ప్రభుత్వ విద్యలో పెరుగుతున్న నాణ్యత**

తాజా ఫలితాలను పరిశీలిస్తే, ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల ఉత్తీర్ణత శాతం గణనీయంగా పెరిగింది. కొన్ని జిల్లాల్లో ఇది 90% పైగా నమోదవడం విశేషం. అంతేకాకుండా, టాప్ ర్యాంకుల్లో కూడా ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు నిలవడం గమనార్హం. గతంతో పోలిస్తే ఉత్తీర్ణత శాతం 10-15% వరకు పెరగడం, మెరిట్ జాబితాల్లో ప్రభుత్వ పాఠశాలల వాటా పెరగడం, బాలికల ఉత్తీర్ణత శాతం బాలుర కంటే అధికంగా ఉండడం విశేషంగా చెప్పుకోవాలి. ఈ గణాంకాలు ఒక విషయం స్పష్టం చేస్తున్నాయి-సరైన వనరులు, ప్రోత్సాహం, పర్యవేక్షణ ఉంటే ప్రభుత్వ పాఠశాలలు అద్భుతాలు సృష్టించగలవు. ప్రభుత్వ పాఠశాలలు అంటే కేవలం పేదరికం, వసతుల లేమికి నిలయమనే భావన క్రమక్రమంగా మారుతోంది. మౌలిక సదుపాయాలతో పాటు విద్యా నాణ్యతా ప్రమాణాలు కూడా మెరుగుపడుతున్నాయి. 600కు 596, 595 మార్కులు సాధించిన విద్యార్థినుల చిరునవ్వుల ఫోటోలను పత్రికా ప్రకటనల్లో చూస్తుంటే, ప్రభుత్వ పాఠశాలలు కార్పొరేట్ సంస్థలకు ఏమాత్రం తీసిపోవనే వాస్తవం వెలుగు చూస్తుంది. 590 కంటే ఎక్కువ మార్కులు సాధించిన విద్యార్థుల సంఖ్య ప్రభుత్వ బడుల్లో పెరుగుతుండటం, నాణ్యమైన విద్యా బోధనకు నిదర్శనం.

**ఫలితాల పత్రికా ప్రకటన - సామాజిక ప్రభావం**

ప్రభుత్వమే స్వయంగా ఈ ఫలితాలను పత్రికల్లో ప్రకటించడం వెనుక లోతైన సామాజిక కోణం ఉంది. పత్రికల్లో తమ ఫోటోలు చూసుకునే విద్యార్థులకు, వారి తల్లిదండ్రులకు కలిగే సంతోషం, గౌరవం, అంతకుమించి ఆత్మవిశ్వాసం వెలకట్టలేనివి. ఇది వారిని భవిష్యత్తులో మరిన్ని గొప్ప విజయాల వైపు నడిపిస్తుంది. ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం విద్యార్థుల ఆత్మవిశ్వాసాన్ని ఆకాశమంత ఎత్తుకు తీసుకెళుతుంది. అలాగే, "మా పిల్లలను ప్రభుత్వ బడిలో చేర్పిస్తే చదువు వస్తుందా?" అని సందేహించే తల్లిదండ్రులకు ఈ ఫలితాల ప్రకటన ఒక గొప్ప సమాధానం. ఇది రాబోయే విద్యా సంవత్సరంలో ప్రభుత్వ పాఠశాలల్లో ప్రవేశాల శాతాన్ని గణనీయంగా పెంచుతుంది. ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం ప్రజల్లో ప్రభుత్వ బడులపై నమ్మకాన్ని పెంచుతుంది.

**ఉపాధ్యాయుల కృషికి గుర్తింపు - ప్రభుత్వ విద్య వైపు దృష్టి మళ్లింపు**

కార్పొరేట్ విద్యా సంస్థల దోపిడీకి అడ్డుకట్ట వేయాలంటే ప్రభుత్వ విద్యారంగం బలోపేతం కావాలి. ఈ ఫలితాల ప్రకటనలు ప్రభుత్వ బడులు కూడా పోటీలో ఉన్నాయని చాటిచెప్పాయి. ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం విద్యార్థుల్లో పోటీ తత్వాన్ని నిస్సందేహంగా పెంపొందిస్తుంది. ప్రభుత్వం ఇలా ఫలితాలను పత్రికల ద్వారా ప్రకటించడం వల్ల ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేసే ఉపాధ్యాయుల కృషి, ప్రతిభ కూడా సమాజానికి తెలియజేయబడుతుంది. ఇది ఉపాధ్యాయులు మరింత నిబద్ధతతో పనిచేయడానికి ప్రేరణగా ఉంటుంది. తద్వారా ప్రభుత్వ పాఠశాలల్లో తమ పిల్లలను నమ్మకంగా చేర్పించేందుకు తల్లిదండ్రులు ముందుకు వస్తారు. అంతేకాక, ఫలితాలను ఈ విధంగా ప్రకటించడం వల్ల చిన్న గ్రామాల్లో చదివే విద్యార్థుల్లో "మన స్కూల్ నుంచే మనం కూడా టాప్ ర్యాంకులు సాధించవచ్చు" అనే నమ్మకం పెరుగుతుంది. ఈ ఒక్క భావన వందలాది పిల్లల జీవితాలను మార్చగలదు.
ముగింపు మాటగా... ప్రభుత్వ బడుల ప్రతిభకు దక్కిన ఈ "ప్రకటనా సన్మానం" ఒక చారిత్రక అవసరం. విద్యార్థుల శ్రమను, ఉపాధ్యాయుల కృషిని గుర్తించి, సమాజం ముందు గౌరవప్రదంగా నిలబెట్టడం ద్వారా ప్రభుత్వం విద్యా వ్యవస్థలో ఒక నూతన అధ్యాయానికి శ్రీకారం చుట్టింది. ఈ ఒరవడి ఇలాగే కొనసాగితే, రాబోయే రోజుల్లో ప్రభుత్వ పాఠశాలలే జ్ఞాన గనులుగా, పేదోడి ఇంటి వెలుగులుగా మారుతాయనడంలో ఎటువంటి సందేహం లేదు. "అమ్మలా శిక్షణ... నాన్నలా రక్షణ... స్నేహపూర్వక బోధన..." అనే నినాదంతో, మౌలిక సదుపాయాల అభివృద్ధితో ప్రభుత్వ పాఠశాలలు ముందుకు సాగితే, ప్రభుత్వ బడుల వైపు సమాజం ధైర్యంగా అడుగులు వేస్తుంది. ప్రభుత్వ విద్యా వ్యవస్థను ప్రభావితం చేయగల విశిష్టమైన, చారిత్రాత్మక నిర్ణయం తీసుకున్న ప్రస్తుత ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వాన్ని మనం అందరం అభినందిద్దాం!

**నునుబోలు రాజశేఖర్,**
హెచ్.ఓ.డి, అసోసియేట్ ప్రొఫెసర్,
ఎన్.ఎస్.ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్,
శ్రీ వాసవి ఇంజనీరింగ్ కళాశాల,
తాడేపల్లిగూడెం,పశ్చిమగోదావరి జిల్లా,
ఫోన్ నెంబర్స్: 9885739808, 8330969808



# ప్రజలకు నాణ్యమైన విద్య, ఉచిత వైద్యం అందించడమే లక్ష్యం

- ఎమర్జెన్సీ సేవలను మరింత బలోపేతం చేస్తాం
- ఎడ్యుకేషన్ హబ్‌గా అందోల్ నియోజక వర్గం
- సింగూర్ ప్రాంతాన్ని పర్యాటక కేంద్రంగా అభివృద్ధి
- మంత్రి దామోదర్ రాజ నరసింహ



**సంగారెడ్డి ప్రతినిధి, మే 2 (జనం సాక్షి) :** ప్రజలకు నాణ్యమైన విద్య, ఉచిత వైద్యం అందించడమే ప్రభుత్వ లక్ష్యమని వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ పేర్కొన్నారు. ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా ఆందోల్ నియోజకవర్గ స్థాయి సమావేశం శనివారం జోగిపేటలోని శ్రీరామ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించగా, రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజ నరసింహ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ... ప్రతి పౌరుడికి నాణ్యమైన విద్యతో పాటు సమగ్ర వైద్య సేవలను అందించడమే రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. ప్రజలు ఆరోగ్య సమస్యల వల్ల ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కోకుండా ప్రభుత్వ ఆసుపత్రుల్లో అన్ని వైద్య సేవలను ఉచితంగా అందిస్తున్నామని తెలిపారు. జిల్లా స్థాయిలోనే 90 శాతం వైద్య సేవలు అందించే దిశగా ఆధునిక సదుపాయాలను విస్తరిస్తున్నామని చెప్పారు. అత్యవసర పరిస్థితుల్లో వేగవంతమైన సేవలందించేందుకు ట్రామా, ఎమర్జెన్సీ సేవలను మరింత బలోపేతం చేస్తున్నామని, అన్ని ప్రభుత్వ ఆసుపత్రుల్లో పూర్తి స్థాయిలో వైద్య సేవలు అందించేలా చర్యలు చేపడుతున్నామని వెల్లడించారు. మహిళల సాధికారతకు ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తోందని మంత్రి పేర్కొన్నారు. మహిళా సంఘాలను ఆర్థికంగా బలోపేతం చేసే దిశగా గతంలో పావలా వడ్డీ పథకం, అనంతరం వడ్డీ లేని రుణాల పథకాలను అమలు చేసినట్లు గుర్తుచేశారు. ప్రస్తుతం ఇందిరమ్మ క్యాంటీన్లు, సోలార్ యూనిట్లు, పెట్రోల్ బంకులు వంటి వనరులను మహిళలకు కేటాయిస్తూ వారి ఆర్థిక స్వావలంబనకు ప్రభుత్వం తోడ్పడుతున్నదన్నారు. విద్యారంగ అభివృద్ధిలో భాగంగా ప్రతి పాఠశాల, కళాశాలలో ప్రమాణాలతో కూడిన విద్యతో పాటు పౌష్టికాహారం, మౌలిక వసతులను అందిస్తున్నామని తెలిపారు. అందోల్ ప్రాంతంలో త్వరలో ఫార్మసీ కళాశాల ఏర్పాటు చేయనున్నట్లు ప్రకటించారు. అందోల్ నియోజకవర్గాన్ని ఎడ్యుకేషన్ హబ్‌గా అభివృద్ధి చేసేందుకు సమగ్ర ప్రణాళికతో ముందుకు సాగుతున్నామని తెలిపారు. రూ. 200 కోట్ల వ్యయంతో సింగూర్ లైన్ పనులు చేపట్టామని మంత్రి తెలిపారు. సింగూర్ ప్రాంతాన్ని పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేసేందుకు ప్రత్యేక కార్యాచరణ రూపొందిస్తున్నామని, పర్యాటక రంగ అభివృద్ధి ద్వారా స్థానికులకు ఉపాధి అవకాశాలు పెరుగుతాయని పేర్కొన్నారు. జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ మాట్లాడుతూ.. జిల్లా విద్య, వైద్య రంగాల్లో అన్ని విధాలుగా అభివృద్ధి సాధిస్తున్నదని తెలిపారు. మహిళలు, విద్యార్థులు, అంగన్వాడీ పిల్లలకు ప్రభుత్వం అందిస్తున్న సౌకర్యాలను వివరించారు. ప్రభుత్వం అన్ని వర్గాల ప్రజల సమగ్ర అభివృద్ధికి కృషి చేస్తుందన్నారు. జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్ మాట్లాడుతూ ప్రజా పాలన – ప్రగతి ప్రణాళికలో భాగంగా పోలీస్ శాఖ ద్వారా రోడ్డు భద్రత, సైబర్ క్రైమ్, మహిళల భద్రతపై విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ పాండు, స్థానిక ప్రజాప్రతినిధులు, జిల్లా అధికారులు, వివిధ శాఖల అధికారులు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ బడులను ప్రైవేటుకు ధీటుగా తీర్చిదిద్దుతాం

- ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి



**జడ్చర్ల, మే 2 (జనంసాక్షి) :** విద్యా రంగంలో జడ్చర్ల నియోజకవర్గాన్ని అగ్రగామిగా నిలపడమే తన లక్ష్యమని ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్ రెడ్డి స్పష్టం చేశారు. శనివారం నిర్వహించిన ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలను ప్రైవేటుకు దీటుగా అభివృద్ధి చేస్తామన్నారు. ఇందుకోసం రాబోయే రెండేళ్లలో కంపెనీల నుండి సీఎస్ఆర్ కింద రూ. 70 కోట్లు సమీకరిస్తామని వెల్లడించారు. ఇప్పటికే అరబిందో ఫార్మా రూ. 4 కోట్లు అందించిందని, వాటితో పలు పాఠశాలలను ఆధునీకరిస్తామని తెలిపారు. టెన్త్ ఫలితాల్లో జడ్చర్ల, రాజాపూర్, నవాబుపేట మండలాలు సాధించిన ఉత్తీర్ణత పట్ల ఆయన హర్షం వ్యక్తం చేశారు. నియోజకవర్గంలో విద్యుత్ సమస్యల పరిష్కారానికి 22 కొత్త సబ్ స్టేషన్లు మంజూరు చేయించామని, ఉదండాపూర్ నిర్వాసితులకు ఈ నెలలోనే రూ. 200 కోట్ల పరిహారం అందుతుందని భరోసా ఇచ్చారు. అనంతరం విద్యార్థులను సన్మానించి, మహిళా సంఘాలకు రూ. 5.90 కోట్ల చెక్కులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో పలువురు అధికారులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

## గాంధీ ట్రస్ట్ భూముల్లో అక్రమ లేఅవుట్లు

- అరికట్టాలని ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డికి వినతి



జడ్చర్ల, మే 2 (జనంసాక్షి) : జడ్చర్ల పట్టణంలోని గాంధీ ట్రస్ట్ పరిధిలో జరుగుతున్న అక్రమ లేఅవుట్లు, అనుమతుల్లేని నిర్మాణాలపై స్థానిక ప్రజలు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పట్టణాభివృద్ధి నిబంధనలను పక్కన పెట్టి, కొందరు వ్యక్తులు లాభాపేక్షతో భూములను విక్రయిస్తున్నారని ఆరోపిస్తూ అక్రమ లేఅవుట్లను నిర్మాణాలను అరికట్టాలని నాయకులు యంబి బాలకృష్ణ శనివారం జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. ప్రధానంగా ట్రస్ట్ పరిధిలో ప్రజా అవసరాల కోసం కేటాయించాల్సిన 10 శాతం భూమి ఆక్రమణకు గురవుతోందని, పార్కులు, ఆట స్థలాల కోసం ఉద్దేశించిన స్థలంపై స్పష్టత లేదని వారు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. ప్రణాళిక లేని నిర్మాణాల వల్ల భవిష్యత్తులో డ్రైనేజీ, నీటి సరఫరా వంటి మౌలిక సదుపాయాలకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతాయని వారు వాపోయారు. సమస్యపై స్పందించిన ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి, సంబంధిత శాఖలతో చర్చించి తక్షణ విచారణ జరిపిస్తామని, అక్రమాలకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే హామీ ఇచ్చినట్లు బాలకృష్ణ తెలిపారు. కార్యక్రమంలో యంబి ప్రణవ్, శ్రీనివాసులు, షకీల్, అరుణ, నవీన్, లింగం గౌడ్, శిరీష తదితరులు పాల్గొన్నారు.

## మే 10న జరిగే బహిరంగ సభను జయప్రదం చేయండి



**హయత్‌నగర్, మే 2 (జనం సాక్షి) :** నాగోల్‌లోని శుభం కన్వెన్షన్ హాల్‌లో నిర్వహించిన బిజెపి కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశంలో హయత్ నగర్ తాజా మాజీ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి పాల్గొన్నారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ మూడవసారి దేశ ప్రధానిగా బాధ్యతలు స్వీకరించిన తర్వాత తొలి సారిగా తెలంగాణ రాష్ట్ర పర్యటనకు రానున్న సందర్భంగా మే 10వ తేదీన నిర్వహించే భారీ బహిరంగ సభను విజయవంతం చేయుటకు రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు వనిపల్లి శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో నాగోల్ శుభం కన్వెన్షన్ హాల్‌లో బూత్ స్థాయి కార్యకర్తల విస్తృత సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో కేంద్ర మంత్రివర్యులు గంగాపురం కిషన్ రెడ్డి, మల్కాజ్గిరి పార్లమెంట్ సభ్యులు ఈటెల రాజేందర్ ముఖ్య అతిథులుగా పాల్గొని, కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి గంగాపురం కిషన్ రెడ్డి మాట్లాడుతూ మే 10న జరగబోయే ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సభను చారిత్రాత్మకంగా నిలిపేందుకు, ప్రతి కార్యకర్త కృషి చేయాలని పిలుపునిచ్చారు. ప్రతి బూత్ స్థాయిలో కార్యకర్తలు చురుకుగా పనిచేసి, పెద్ద ఎత్తున ప్రజలను సభకు తరలించాలని సూచించారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు తెలియజేసి, బీజేపీ పట్ల విశ్వాసాన్ని పెంపొందించాలని తెలిపారు. ఈ సందర్భంగా ఈటల రాజేందర్ మాట్లాడుతూ మే 10న జరిగే సభ తెలంగాణ రాజకీయాల్లో కీలక మలుపుగా నిలుస్తుందని అన్నారు. దేశంలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో అభివృద్ధి వేగంగా కొనసాగుతోందని, అభివృద్ధిని తెలంగాణలోనూ తీసుకురావాలంటే బీజేపీకి మద్దతు అవసరమని పేర్కొన్నారు. ప్రతి కార్యకర్త బాధ్యతగా భావించి యువత, మహిళలు, కొత్త ఓటర్లను సభకు భారీగా తరలించాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో హయత్ నగర్ బీజేపీ సీనియర్ నాయకులు కార్యకర్తలు పెద్ద సంఖ్య లో పాల్గొన్నారు.

## రైతులు మోతాదుకు మించిన యూరియా వాడొద్దు



**బొంరాస్‌పేట, మే 2 (జనం సాక్షి) :** మండల పరిధిలోని తుంకిమెట్ల రైతు వేదిక భవనంలో శనివారం రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు.. అన్నదాతలకు అవగాహన కార్యక్రమంలో భాగంగా కరపత్రాన్ని పాలెం వ్యవసాయ శాస్త్రవేత్తలు డాక్టర్ సత్యనారాయణ, పరమేష్ విడుదల చేశారు. అనంతరం నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడుతూ రైతులు మోతాదుకు మించిన యూరియా వాడొద్దని ,రెండు సంవత్సరాలకు ఒకసారి తప్పనిసరిగా భూసార పరీక్షలు చేయించుకోవాలన్నారు. సిఫారసు చేసిన మేరకు ఎరువులను మోతాదు ప్రకారం వాడాలన్నారు. సేంద్రియ పద్ధతుల్లో వ్యవసాయం గురించి వివరిస్తూ పంటల మార్పిడి చేసుకోవాలని రైతులను శాస్త్రవేత్తలు కోరారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి పోలప్ప, ఏఈఓ శైలజ, గ్రామ సర్పంచ్ ఎల్లమ్మ ఆయా గ్రామాల రైతులు పాల్గొన్నారు.

## ఆత్మశుద్ధి, పవిత్ర సంకల్పం కోసమే హజ్ యాత్ర



**వీపనగండ్ల, మే 3 (జనం సాక్షి) :** షాద్ నగర్ ఏఎస్ఐ (రిటైర్మెంట్) ఏఎస్ఐఖాదర్ హజ్ యాత్రకు వెళ్తున్న సందర్భంగా కుటుంబ సభ్యులను, హజ్ యాత్రికులను కల్వరాల బిఆర్ఎస్ సీనియర్ నాయకులు సర్దార్ ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా సర్దార్ మాట్లాడుతూ ఆత్మశుద్ధి మరియు పవిత్ర జీవిత సంకల్పం కోసమే ముస్లిం సోదరులు హజ్ యాత్ర చేస్తారని అన్నారు. హజ్ యాత్రతో శక్తివంతమైన ఆత్మస్థైర్యం కలిగి లోక కళ్యాణం కోసం కృషి చేస్తారని పవిత్ర లక్ష్యంతో సాగే యాత్ర విజయవంతం కావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో సర్దార్,జావిద్, గఫార్, ముజీబ్,ఆమీర్ పాల్గొన్నారు.

## వరి ధాన్యం చివరి గింజ వరకు ప్రభుత్వమే కొనుగోలు చేస్తుంది

- ఎమ్మెల్యే సతీమణి బండ్ల జ్యోతి



**ధరూర్, మే 2 (జనం సాక్షి) :** ధరూర్ మండలం పరిధిలోని బూరెడ్డిపల్లి గ్రామం రైతులు పండించిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను గద్వాల ఎమ్మెల్యే సతీమణి బండ్ల జ్యోతి ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యము కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఎమ్మెల్యే సతీమణి మాట్లాడుతూ గతంలో ఈ ప్రాంతంలో కరువు కాటకా లకు నిలయంగా ఉండేది కానీ గత పది సంవత్సరాల నుండి ఇప్పుడిప్పుడే రైతులు అభివృద్ధి చెందడం జరుగుతుంది. గతంలో కూడా రైతులు పండించిన వరి ధాన్యమును ప్రభుత్వమే కొనుగోలు చేసేది. ప్రభుత్వాలు వచ్చిన రైతుల సంక్షేమమే కోసంమే ప్రభుత్వ ధ్యేయమని, ప్రభుత్వం ఏర్పాటు చేసిన వరి కొనుగోలు కేంద్రాల్లో నే మద్దతు ధర 2386 రూపాయలు కొనుగోలు చేయడం జరిగింది తెలిపారు. మహిళలకు ఉపాధి కల్పించాలని మహిళా సంఘాల ద్వారా వరి కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి మహిళలకు కూడా ఆర్థికంగా ఎదగాలని ప్రభుత్వం కృషి చేయడం జరుగుతుంది. అదేవిధంగా ధాన్యము కొనుగోలు చేసిన వెంటనే రెండు మూడు రోజుల్లో రైతుల ఖాతాలో డబ్బులు నమోదు కావడం జరుగుతుంది. రైతులకు రైతులకు వరి కొనుగోలు కేంద్రం వద్ద ఎలాంటి ఇబ్బందులు లేకుండా గన్ని బ్యాగుల కొరత లేకుండా అన్ని విధాలుగా ఏర్పాటు చేయడం జరిగింది. వరి ధాన్యం కొనుగోలు కేంద్రం వద్ద రైతులు ఎలాంటి ఇబ్బందు లేకుండా నిదానంగా తమ పండించిన పంటను ధాన్యము కొనుగోలు కేంద్రంలో అమ్మి కొనుగోలు కేంద్రానికి వారికి సహకరించాలని కోరారు. రైతులకు ఎమ్మెల్యే గారి సహాయ సహకారాలు ఎల్లప్పుడూ ఉంటాయని ఎమ్మెల్యే సతీమణి తెలిపారు. అనంతరం బూరెడ్డిపల్లి గ్రామంలో రిసెప్షన్లో పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించడం జరిగింది. కార్యక్రమంలో సర్పంచ్ విజయ్ , జమ్ములమ్మ ఆలయ కమిటీ డైరెక్టర్ రాధారెడ్డి, నాయకులు విజయ రెడ్డి మధుసూదన్ రెడ్డి నాయకులు కార్యకర్తలు, రైతులు అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## అయిజ పట్టణంలో నకిలీ ధ్రువపత్రాల తయారీ



**అయిజ, మే 2 (జనం సాక్షి) :** జోగులాంబ గద్వాల జిల్లా అయిజ మున్సిపాలిటీ కేంద్రంలో నకిలీ ధ్రువపత్రాలు తయారు చేస్తున్న లక్ష్మీ నరసింహ ప్రింటింగ్ ప్రెస్ పై రెవిన్యూ అధికారులు దాడి చేసి గుట్టురట్టు చేశారు. మండల తహసిల్దార్ ఎన్. జ్యోతి ఆదేశాల మేరకు ఆర్. ఐ రజినీకాంత్ రెడ్డి మరియు జీపీవోలు లక్ష్మీనరసింహ ప్రింటింగ్ ప్రెస్ పై దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో వివిధ శాఖలకు సంబంధించిన గవర్నమెంట్ డాక్టర్స్, సర్పంచులు, హెడ్మాస్టర్లు, మ్యారేజ్ సర్టిఫికెట్స్ ఆధార్ కార్డులు, ఎస్ఎస్సి మెమోలు, తదితర నకిలీ ధ్రువ పత్రాలకు సంబంధించిన ముద్రలు రాయలసీమలోని వివిధ జిల్లాలకు సంబంధించిన ముద్రలు, గట్టు మండలం కు ముద్రలు పెద్ద ఎత్తున సుమారు 18 దొరికాయి. అలాగే కంప్యూటర్ ని ఓపెన్ చేయగా సుమారు 150 పైగా వివిధ పత్రాలు నకిలీవి తయారు చేసినట్టు గుర్తించారు. అనంతరం సిపిఓ కంప్యూటర్ తదితర వాటిని స్వాధీనం చేసుకొని దర్యాప్తు నిమిత్తం పోలీస్ డిపార్ట్మెంట్కు అప్పచెప్పినట్లు తెలిపారు. ఈ విషయమై తాసిల్దార్ మాట్లాడుతూ మాకు వచ్చిన నమ్మదగిన సమాచారం, కంప్లైంట్ మేరకు దాడులు నిర్వహించినట్లు తెలిపారు. ఎవరైనా ఇలాంటి కార్యక్రమాలకు పాల్పడితే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని ఆమె హెచ్చరించారు. ఈ దాడుల్లో రెవెన్యూ ఇన్స్పెక్టర్ తో పాటు జిపిఓ లు జ్యోతి, రహమతుల్లా, బాలు పాల్గొన్నారు.

## రైతులు ఆధునిక వ్యవసాయ పద్ధతులు పాటించాలి



**యాచారం, మే 2 (జనం సాక్షి) :** రైతులు ఆధునిక వ్యవసాయ పద్ధతులను పాటించి అధిక లాభాలు పొందాలని ప్రొఫెసర్ జయశంకర్ విశ్వవిద్యాలయం శాస్త్రవేత్తలు డాక్టర్ జగన్మోహన్ రెడ్డి, డాక్టర్ వరప్రసాద్ అన్నారు. శనివారం యాచారం మండల పరిధిలోని గున్గల్ గ్రామంలో రైతు ముంగిట్లో వ్యవసాయ శాస్త్రవేత్తల కార్యక్రమం ద్వారా రైతులకు అవగాహన కార్యక్రమం జరిగింది ఈ కార్యక్రమానికి వారు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు రైతులు వ్యవసాయ అధికారుల సూచనలు సలహాలు పాటించాలని తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులు వచ్చే పంటను రైతులు సాగు చేసుకోవాలన్నారు. మారుతున్న కాలానికి అనుగుణంగా రైతులు వ్యవసాయ రంగంలో మెలకువలు పాటించాలని సేంద్రియ ఎరువులను వాడి యూరియా వాడకాన్ని తగ్గించి నేల ఆరోగ్యాన్ని కాపాడాలని పంట మార్పిడి విధానాన్ని రైతులు అలవర్చుకోవాలన్నారు. రసాయన ఎరువుల వాడకాన్ని తగ్గించాలని సుస్థిర ఆదాయాన్ని పొందడం మార్కెట్లో అధిక ధరలు ఉన్న వరి రకాలను పండించాలని సాగునీటిని ఆదా చేసి భావితరాలకు అందించాలని సేంద్రియ ఎరువులను అందించిన పంటలు ఆరోగ్యానికి ఎంతగానో మేలు చేస్తాయని అన్నారు ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ బాసాన్ని బుచ్చిరెడ్డి వ్యవసాధికారి రవినాథ్ ఏఈఓ శ్వేత, రైతులు పాల్గొన్నారు.

# అభివృద్ధి పనులు వేగవంతం చేయాలి

- ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి ఆదేశం



**ఉప్పల్, మే 2 (జనం సాక్షి) :** ఉప్పల్ మున్సిపల్ కార్యాలయంలో ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా చేపట్టిన 99 రోజుల కార్యాచరణ ప్రణాళిక అమలుపై కీలక సమీక్ష సమావేశం నిర్వహించారు. ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న ఈ కార్యక్రమం పురోగతిని సమగ్రంగా పరిశీలించేందుకు నిర్వహించిన ఈ సమావేశానికి ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. మున్సిపల్ పరిధిలో జరుగుతున్న అభివృద్ధి పనులు, ప్రజలకు అందుతున్న సేవలు, పెండింగ్‌లో ఉన్న సమస్యలు, వివిధ శాఖల సమన్వయం వంటి అంశాలపై ఎమ్మెల్యే అధికారులతో విస్తృతంగా చర్చించారు. ప్రజా సమస్యల పరిష్కారమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని పేర్కొంటూ, 99 రోజుల కార్యాచరణ ప్రణాళికను అధికారులు అత్యంత బాధ్యతాయుతంగా అమలు చేయాలని ఆయన సూచించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, ప్రజలకు నేరుగా ఉపయోగపడే పనులపై ప్రత్యేక దృష్టి పెట్టాలని అధికారులను ఆదేశించారు. ముఖ్యంగా మౌలిక వసతుల అభివృద్ధి, పారిశుద్ధ్య నిర్వహణ, తాగునీటి సరఫరా, రహదారుల మరమ్మతులు, డ్రైనేజ్ వ్యవస్థ బలోపేతం, వీధి దీపాల నిర్వహణ వంటి సమస్యల పరిష్కారంలో ఎలాంటి నిర్లక్ష్యం ఉండకూడదన్నారు. ప్రజలకు ఇబ్బందులు కలిగించే అంశాలను వెంటనే గుర్తించి తక్షణ చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రతి శాఖ తమకు అప్పగించిన పనులను సమయపాలనతో పూర్తి చేయాలని, పనుల నాణ్యత విషయంలో రాజీ పడకూడదని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. ప్రజలు ప్రభుత్వంపై విశ్వాసం ఉంచేలా సేవలు అందించాలని, కార్యాలయాలకు వచ్చే ప్రతి పౌరుడితో మర్యాదపూర్వకంగా వ్యవహరించాలని అధికారులకు సూచించారు. ప్రజల ఫిర్యాదులపై ఆలస్యం చేయకుండా స్పందించి, సమస్యలను వేగంగా పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. అభివృద్ధి కార్యక్రమాలు కేవలం కాగితాలకే పరిమితం కాకుండా ప్రజలకు ప్రత్యక్ష ప్రయోజనం కలిగేలా ఉండాలని ఆయన పేర్కొన్నారు. ప్రతి ప్రాంతంలో జరుగుతున్న పనులను అధికారులు క్రమం తప్పకుండా పరిశీలించి, అవసరమైన చోట ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ సమావేశంలో జోనల్ కమిషనర్ రాధిక గుప్త, డిప్యూటీ కమిషనర్ మరియు మున్సిపల్ శాఖలకు చెందిన వివిధ విభాగాల అధికారులు పాల్గొని తమ శాఖల పనితీరుపై వివరాలు వెల్లడించారు. ప్రణాళికలో భాగంగా చేపట్టాల్సిన పనుల పురోగతి, ఎదురవుతున్న సమస్యలు, వాటి పరిష్కార మార్గాలపై చర్చించారు. ఉప్పల్ ప్రాంత అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని, ప్రజలకు మెరుగైన సౌకర్యాలు అందించడమే లక్ష్యంగా అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి పిలుపునిచ్చారు.

జనంసాక్షి
www.janamsakshi.org
ఆదివారం
03 మే 2026

# నాణ్యతతో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం పూర్తి చేయాలి

- జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్



**నాగర్ కర్నూల్ జిల్లా బ్యూరో, మే 2 (జనంసాక్షి) :** నాగర్‌కర్నూల్ జిల్లా, తాడూరు మండలంలో అమలు అవుతున్న ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను లబ్ధిదారులు మరింత వేగవంతం చేసి, నిర్దేశిత గడువులో పూర్తి చేసుకోవాలని జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్ పిలుపునిచ్చారు. శనివారం ఆయన నాగర్‌కర్నూల్ నియోజకవర్గ పరిధిలోని తాడూరు మండల కేంద్రంలో ఇందిరమ్మ గృహ నిర్మాణాలను ప్రత్యక్షంగా పరిశీలించారు. ఇటీవల గృహప్రవేశం చేసిన లక్ష్మి లబ్ధిదారులు, గృహప్రవేశానికి సిద్ధం చేస్తున్న కమలమ్మ లబ్ధిదారులు ఇందిరమ్మ ఇండ్లను జిల్లా సందర్శించి, నిర్మాణ నాణ్యత, సదుపాయాలు, ప్రభుత్వ సహాయం వినియోగం తదితర అంశాలపై సమగ్రంగా కలెక్టర్ ఆరా తీశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పేదల స్వగృహ కలను సాకారం చేసేందుకు ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని అత్యంత ప్రాధాన్యంతో అమలు చేస్తోందని తెలిపారు. లబ్ధిదారులు ప్రభుత్వం అందిస్తున్న ఆర్థిక సహాయాన్ని సమర్థవంతంగా వినియోగించుకొని, నిర్మాణ పనులను మధ్యలో ఆపకుండా నిరంతరంగా కొనసాగించాలని, నిర్మాణాల నాణ్యతపై ప్రత్యేక దృష్టి పెట్టి, భవిష్యత్తులో ఎలాంటి ఇబ్బందులు రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని చెప్పారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి సంబంధించిన బిల్లుల చెల్లింపుల్లో ఎలాంటి జాప్యం లేకుండా ప్రభుత్వం ప్రతి సోమవారం నిధులను జమ చేస్తున్నదని, ఈ అవకాశాన్ని వినియోగించుకొని, లబ్ధిదారులు పనులను వేగవంతం చేసి, త్వరితగతిన పూర్తి చేసి గృహప్రవేశాలకు సిద్ధం కావాలని సూచించారు. నిర్మాణ ప్రక్రియలో ఎలాంటి సాంకేతిక సమస్యలు, భూసంబంధిత సమస్యలు లేదా ఇతర ఇబ్బందులు ఎదురైతే వెంటనే సంబంధిత అధికారులకు తెలియజేయాలని కోరారు. అధికారులు కూడా క్షేత్ర స్థాయిలో తరచూ పర్యటిస్తూ, పనుల పురోగతిని పర్యవేక్షించి, సమస్యలను తక్షణమే పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.
తాడూరు మండల పరిధిలో మొత్తం 515 ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయగా, 419 ఇండ్లకు భూమి పూజ పూర్తి చేయడం జరిగిందని, 97 ఇండ్లు బేస్మెంట్ లెవెల్, 43 ఇండ్లు రూఫ్ లెవెల్, 135 ఇండ్లు స్లాప్ లేవల్, 65 ఇండ్లు పూర్తి చేసినట్లు, ఇంకా 1079 ఇండ్లు నిర్మాణానికి ప్రారంభం కాలేదని పిడి హౌసింగ్ కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. తాడూరు మండలంలోని పలు గ్రామాల్లో జరుగుతున్న గృహ నిర్మాణాల వివరాలను పరిశీలించిన కలెక్టర్, కొంతమంది లబ్ధిదారులు పనులను ఆలస్యం చేస్తున్నారని గమనించి, అలాంటి వారు వెంటనే పనులను పునఃప్రారంభించి వేగవంతం చేయాలని కలెక్టర్ అధికారులకు ఆదేశించారు. ప్రభుత్వం అందిస్తున్న సహకారాన్ని సద్వినియోగం చేసుకొని, సమయానికి ఇళ్లు పూర్తి చేయడం ద్వారా కుటుంబ స్థిరత్వాన్ని సాధించుకోవాలని అన్నారు. అంతకుముందు తాడూరు గ్రామ పరిధిలో నిర్మాణం మధ్యలో ఆగిపోయిన 104 డబల్ బెడ్ రూమ్ ఇండ్ల నిర్మాణాలను కలెక్టర్ పరిశీలించారు. లబ్ధిదారులతో సమావేశం నిర్వహించి, ఈ ప్రాంతంలో ఇల్లు నిర్మించుకునేందుకు వారు సమ్మతంగా ఉన్నారా లేదా అనే వివరాలను తెలుసుకోవాలని కలెక్టర్ ఎంపీడీవోను ఆదేశించారు. గ్రామానికి దూరంగా ఉండటం గ్రామస్తులు ఇక్కడ ఇండ్లు నిర్మించుకోవడానికి ముందుకు రావడం లేదని ఈ నిర్మాణాలను ఏదైనా గురుకుల పాఠశాలలకు కేటాయించాలని సర్పంచ్ కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. ఈ కార్యక్రమంలో పిడి హౌసింగ్ సంగప్ప, స్థానిక తహసీల్దార్, ఎంపీడీవో, ఇంజినీరింగ్ సిబ్బంది, గ్రామ సర్పంచ్, గ్రామస్థాయి అధికారులు మరియు లబ్ధిదారులు పాల్గొన్నారు.

## విద్యార్థులు ఉన్నత భవిష్యత్తును నిర్మించుకోవాలి

- పదిలో పేయిల్ అయితే తప్పుడు నిర్ణయం తీసుకోవద్దు
- పది విద్యార్థులకు ఘనంగా సన్మానం
- కోహీర్ ఎస్ఐ నరేష్



**కోహిర్, మే 2 (జనం సాక్షి) :** పదో తరగతి పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులు ఉన్నతమైన భవిష్యత్తు నిర్మాణానికి అడుగులు వేయాలని కోహిర్ ఎస్ ఐ నరేష్ అన్నారు. గత రెండు రోజుల క్రితం వెలుబడిన 10వ తరగతి ఫలితాలలో కోహీర్ మండలంలో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను ఎస్ఐ నరేష్ పోలీస్ స్టేషన్‌లో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎస్ఐ నరేష్ మాట్లాడుతూ ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులు భవిష్యత్తులో ఉన్నత శిఖరాలకు వెళ్లాలని, మంచి స్థానాల్లో ఉండాలని ఆకాంక్షించారు. అదేవిధంగా ఎవరైతే తక్కువ మార్కులు వచ్చి కొంతమంది విద్యార్థులు ఫలితాల్లో ఫెయిల్ అయ్యి అకస్మాత్తు నిర్ణయాలు తీసుకోవడం వల్ల తల్లిదండ్రులకు తీవ్ర శోకాన్ని మిగిల్చడం జరుగుతుంది కావున విద్యార్థులు ఎవరూ కూడా అలాంటి నిర్ణయాలు తీసుకోకుండా మంచిగా చదివి ముందుకు వెళ్లాలని చెప్పేసి ఆ కోరడం జరుగుతుంది ఫెలైన విద్యార్థులు కూడా మంచి మంచి పొజిషన్లో ఇప్పుడు జాబ్లు చేసుకుంటూ జీవితాన్ని స్థిరపడ్డారు అదే విధంగా ఎవరూ కూడా అకస్మాత నిర్ణయాలు తీసుకొని కుటుంబాలకి శోకాని మిగిల్చకూడదు అని విజ్ఞప్తి చేశారు.

## ఉన్నత చదువులతోనే ఉత్తమ గుర్తింపు



**వనపర్తి బ్యూరో, మే 2 (జనంసాక్షి) :** ఉన్నతమైన చదువులతోనే విద్యార్థులకు ఉత్తమ గుర్తింపు లభిస్తుందని, ప్రతి ఒక్కరు క్రమశిక్షణతో ఉంటూ అత్యున్నత శిఖరాలను అధిరోహించాలంటూ వనపర్తి శాసనసభ్యులు తూడి మేఘారెడ్డి పేర్కొన్నారు. శనివారం వనపర్తి పట్టణంలోని శ్రీ చైతన్య పాఠశాలలకు సంబంధించి పదవ తరగతి పరీక్షలలో ఉన్నతమైన మార్కులు సాధించిన జి. అద్విక ను ఆయన శాలువాలతో సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థి దశలోనే క్రమశిక్షణ అలవర్చుకోవాలని, తల్లిదండ్రులకు మంచి గుర్తింపు తీసుకురావాలని, ఉన్నతమైన భవిష్యత్తు మార్గాలను ఎంచుకోని పట్టుదలతో సాధించాలని ఆయన సూచించారు.

# 51 శాతం ఫిట్‌మెంట్‌తో పీఆర్సీ వెంటనే ప్రకటించాలి



**నారాయణపేట, మే 2 (జనం సాక్షి) :** ఉద్యోగులకు 51 శాతం ఫిట్మెంట్ తో పీఆర్సీ వెంటనే ప్రకటించాలని తెలంగాణ రాష్ట్ర ఉద్యోగ జేఏసి నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం నారాయణపేట జిల్లా కేంద్రం లోని ఒక ప్రైవేటు విద్యా సంస్థలో నారాయణపేట జిల్లా ఉద్యోగ, ఉపాధ్యాయ,కార్మిక, పెన్షనర్ల జేఏసీ సమావేశం అధ్యక్షులు చైర్మన్ ఎం నరసింహారెడ్డి అధ్య క్షతన జరిగింది. ఈ సమావే శంలో జేఏసీ రాష్ట్ర శాఖ ఈనెల 5వ తేదీన తలపెట్టిన నిరాహార దీక్ష సన్నాక సమా వేశమును నిర్వహించడం జరిగింది. ఈ సమావేశంలో శుక్రవారం ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క ఈరోజు రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి ఉద్యోగ సంఘాలను చర్చల కు ఆహ్వానించడం స్వాగతి స్తూనే ప్రధాన డిమాండ్లు పరిష్కారమయ్యే వరకు ఉద్యమ బాట తప్పదని స్పష్టం చేశారు. ప్రభుత్వం వెంటనే 51 శాతం తో పిఆర్సీ ప్రకటించాలని డిమాండ్తో జరిగే నిరాహార దీక్షను విజ యవంతం చేయాలని సమావేశం తీర్మానించింది. ప్రభుత్వము చర్చల పేరిట కాలయాపన చేయకుండా నిర్ణయం తీసుకోవాలని అభిప్రాయం వ్యక్తం చేశారు. ఇప్పటికే 30 నెలల ఆర్థిక ప్రయోజనాలు కోల్పోవడం వలన ఉద్యోగ ఉపాధ్యా యులు, కార్మికులు పెన్షనర్లు తీవ్రమైన ఒత్తిడికి లోనవు తున్నారని సమావేశం ఆవేదన వ్యక్తం చేసింది. ఎవరికి ఎన్ని ఇబ్బందులు ఉన్నా ఐదవ తేదీ నాటి నిరాహార దీక్షను విజయ వంతం చేయుటకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని కోరారు. నారాయణపేట జిల్లా కేంద్రంలో స్థానిక వివేకానంద పార్కు వద్ద గల ధర్నా చౌక్ నందు ఈ నిరసన దీక్ష ఉంటుందనీ తెలిపారు. ఈ కార్యక్రమంలో జేఏసీ అడిషనల్ సెక్రటరీ జనరల్ పిఆర్టియు జిల్లా అధ్యక్షులు వై జనార్దన్ రెడ్డి, పెన్షనర్ల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి వి సంతోష్ కుమార్ ,జేఏసీ కో చైర్మన్లు టి పి టి ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి రెడ్డప్ప, యుటిఎఫ్ ఉపాధ్యక్షులు బాలాజీ, ప్రభుత్వ లెక్చరర్ ల సంఘం తరపున నరసింహారెడ్డి,రామ్ రెడ్డి, డిఆర్డిఏ ఉద్యోగుల అధ్యక్షులు నారాయణ, పెట టిఏస్ జిల్లా అధ్యక్షులు బాలరాజ్ పి అర్ టి యు నారాయణ పేట మండలం అధ్యక్షులు ఎం రఘువీర్, భాగస్వామ సంఘల నాయకులు,తదితరులు పాల్గొన్నారు.

## ఇందిరమ్మ క్యాంటీన్ ఆకస్మిక తనిఖీ

- మహిళల ఆర్థిక అభ్యున్నతికి ఇందిరా మహిళా శక్తి
- జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్



**నాగర్‌కర్నూల్ జిల్లా బ్యూరో, మే 2 (జనంసాక్షి) :** నాగర్ కర్నూల్ జిల్లా కలెక్టరేట్‌లో మహిళా సంఘాల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మహిళా శక్తి ఇందిరమ్మ క్యాంటీన్‌ను శనివారం జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్ ఆకస్మికంగా పరిశీలించారు. ప్రజలకు తక్కువ ధరలో నాణ్యమైన ఆహారం అందించాలన్న ప్రభుత్వ లక్ష్యాన్ని దృష్టిలో ఉంచుకుని క్యాంటీన్ పనితీరును ఆయన ప్రత్యక్షంగా సమీక్షించారు. సందర్శన సందర్భంగా క్యాంటీన్‌లో వంటకాలు తయారు చేసే విధానం, పరిశుభ్రత ప్రమాణాలు, ఆహార పదార్థాల నాణ్యతను కలెక్టర్ సమగ్రంగా పరిశీలించారు. క్యాంటీన్ సిబ్బందితో మాట్లాడి, ప్రతిరోజూ భోజనం సమయానికి అందుతున్నదా, సరఫరాలో ఎలాంటి ఇబ్బందులు ఉన్నాయా అనే అంశాలపై వివరాలు తెలుసుకున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఇందిరా మహిళా శక్తి వంటి కార్యక్రమాల ద్వారా మహిళల ఆర్థిక అభ్యున్నతికి కృషి చేస్తోందని జిల్లా కలెక్టర్ తెలిపారు. ఈ పథకాల ద్వారా మహిళలకు ఆర్థిక స్వావలంబనతో పాటు స్వయం ఉపాధి అవకాశాలు విస్తరిస్తున్నాయని, వివిధ రంగాల్లో మహిళల భాగస్వామ్యాన్ని పెంచేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటోందని కూడా ఈ సందర్భంగా కలెక్టర్ తెలిపారు. అదేవిధంగా కలెక్టరేట్‌కు వివిధ పనుల కోసం వచ్చే ప్రజలతో మాట్లాడి, భోజనం రుచి, నాణ్యతపై వారి అభిప్రాయాలను సేకరించారు. ఆహారం రుచికరంగా, నాణ్యతతో అందించేందుకు చర్యలు తీసుకోవాలని నిర్వాహకులకు సూచించారు. ఆహారంలో పరిశుభ్రత అత్యంత ముఖ్యమని, ఎట్టి పరిస్థితుల్లోనూ నాణ్యతలో రాజీ పడకూడదని కలెక్టర్ స్పష్టం చేశారు. క్యాంటీన్ నిర్వహణలో పారదర్శకత పాటించడంతో పాటు, వంటగది నుండి పంపిణీ వరకు ప్రతి దశలో శుభ్రతను కచ్చితంగా అమలు చేయాలని ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందేలా అవసరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు.

## రైతు వారోత్సవాలను సమర్థవంతంగా నిర్వహించాలి

- జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్



**నాగర్‌కర్నూల్ జిల్లా బ్యూరో, మే 2 (జనంసాక్షి) :** ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా అమలు చేస్తున్న 99 రోజుల కార్యాచరణ ప్రణాళికను విజయవంతంగా కొనసాగించేందుకు జిల్లాలో అన్ని కార్యక్రమాలను పకడ్బందీగా నిర్వహించాలని నాగర్ కర్నూల్ జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్ అధికారులను ఆదేశించారు. శనివారం కలెక్టరేట్‌లోని కలెక్టర్ చాంబర్‌లో వ్యవసాయ, హార్టికల్చర్, తాగునీటి పారుదల శాఖల అధికారులతో జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్ రైతు వారోత్సవాల నిర్వహణపై సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మే 4 నుంచి 9 వరకు వ్యవసాయ ప్రత్యేక కార్యక్రమాలు విజయవంతంగా నిర్వహించాలి,మే 4వ తేదీ నుంచి ప్రారంభం కానున్న రైతు వారోత్సవాలను జిల్లావ్యాప్తంగా సమర్థవంతంగా నిర్వహించేందుకు ముందస్తు ఏర్పాట్లు చేపట్టాలని స్పష్టం చేశారు. రైతుల సంక్షేమం, వ్యవసాయ రంగ అభివృద్ధి, ప్రభుత్వ పథకాలపై అవగాహన పెంపొందించడం లక్ష్యంగా ఈ కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రైతు వారోత్సవాలు కేవలం కార్యక్రమాలుగా కాకుండా రైతులకు ప్రత్యక్ష ప్రయోజనం కలిగించేలా ఉండాలని, రైతు వేదికల్లో సహజ వ్యవసాయం, నానో యూరియా వినియోగం, మట్టి పరీక్షలు, వివిధ పంటల సాగుపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని అధికారులకు సూచించారు. వ్యవసాయ శాఖతో పాటు అనుబంధ శాఖలైన ఉద్యానవన, పశుసంవర్ధక, నీటి వనరుల శాఖలు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. రైతులకు ఆధునిక సాగు పద్ధతులు, సాంకేతిక పరిజ్ఞానం, ప్రభుత్వ పథకాల వివరాలు సమగ్రంగా అందించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. గ్రామ స్థాయిలో రైతుల భాగస్వామ్యాన్ని పెంచేలా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని, ప్రతి మండలంలో రైతు సదస్సులు, ప్రదర్శనలు, శిక్షణ శిబిరాలు ఏర్పాటు చేయాలని సూచించారు. అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ కార్యక్రమాల అమలును పర్యవేక్షించాలని, రైతు వారోత్సవాల ద్వారా ప్రభుత్వ సంక్షేమ పథకాలు, సబ్సిడీలు, సాంకేతిక సహాయం గురించి రైతులకు విస్తృత అవగాహన కల్పించాలని కలెక్టర్ పేర్కొన్నారు. కార్యక్రమం విజయవంతం కావడానికి అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఆయా శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజలు ఎండల పట్ల అప్రమత్తంగా ఉండాలి

- జిల్లా ఎస్పీ వినీత్



**నారాయణపేట జిల్లా బ్యూరో, మే 2 (జనం సాక్షి) :** నారాయణపేట జిల్లా ప్రజలు ప్రస్తుతం తీవ్ర ఎండల పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని అప్రమత్తంగా ఉండి తగిన జాగ్రత్తలు పాటించాలని జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ ఒక ప్రకటనలో సూచించారు. రాష్ట్రవ్యాప్తంగా ఉష్ణోగ్రతలు గణనీయంగా పెరుగుతున్న నేపథ్యంలో ప్రజల ఆరోగ్యం, భద్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని తెలిపారు. ఇటీవల అధిక ఎండల కారణంగా ఒక ద్విచక్ర వాహనం అగ్నికి ఆహుతి అయిన సంఘటనను ప్రస్తావిస్తూ, వాహనాల ను నేరుగా ఎండలో పార్క్ చేయకుండా చెట్ల నీడలో లేదా షెడ్లలో ఉంచాలని సూచించారు. వాహనాల్లో ఇంధనం, బ్యాటరీలు వంటి భాగాలు అధిక వేడికి గురై ప్రమాదాలకుదారితీయవచ్చని హెచ్చరించారు. ప్రజలు ముఖ్యంగా మధ్యాహ్నం 12 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు అత్యవసర పరిస్థితులు తప్ప బయటకు వెళ్లకుండా ఉండాలని విజ్ఞప్తి చేశారు. బయటకు వెళ్లాల్సి వస్తే తలకు గుడ్డ లేదా టోపీ ధరించడం, చల్లని నీరు తర చుగా తాగడం, ఎలక్ట్రోలైట్ పానీయాలు సేవించడం ద్వారా డీహైడ్రేషన్ నుంచి రక్షించుకోవాలనిసూచించారు. వృద్ధులు, చిన్నపిల్లలు, గర్భిణీలు, అనారోగ్యంతో బాధపడుతున్న వారు మరిం త జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. ఎండల వల్ల అల సట, తలనొప్పి, తల తిర గడం, వాంతులు వంటి లక్షణాలు కనిపిస్తే వెంటనే సమీప ఆసుపత్రిని సంప్రదిం చాలని సూచించారు. ఎండల్లో ట్రాఫిక్ నియంత్రణ విధులు నిర్వహించే పోలీసు లు, చెక్‌పోస్టలలో విధులు నిర్వర్తించే సిబ్బంది, ఇతర ఫీల్డ్ డ్యూటీలో ఉన్న వారు ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవా లని ఎస్పీ ఆదేశించారు. వీరు తరచుగా నీరు తాగుతూ, అవసరమైతే నీడలో విశ్రాంతి తీసుకుంటూ, తలకు క్యాప్ లు, గుడ్డలు ఉపయోగించ డం ద్వారా తమ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని తెలిపారు. అదేవిధంగా, గ్రామీణ ప్రాం తాల్లో పొలాల్లో, చెత్త గుట్టల వద్ద అజాగ్రత్తగా మంటలు వేయకుండా ఉండాలని సూచించారు. ఎలాంటి అత్య వసర పరిస్థితులు ఎదురైనా వెంటనే పోలీసులకు లేదా డయల్ 100 కి సమాచారం అందించాలని, ప్రజల భద్రతే తమ ప్రధాన లక్ష్యమని జిల్లా ఎస్పీ స్పష్టం చేశారు.

## మొక్కజొన్న ధాన్యం కొనుగోలు ప్రారంభించాలి



**తెలకపల్లి, మే 2 (జనం సాక్షి) :** రైతులకు ఎటువంటి ఇబ్బంది జరగకుండా మొక్కజొన్న కొనుగోలును వెంటనే ప్రారంభించాలని తెలంగాణ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి సూర్య శంకర్ గౌడ్ అన్నారు. శనివారం మండల కేంద్రంలో తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం ఇచ్చిన పిలుపులో భాగంగా తెలకపల్లి తాసిల్దార్ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్ భారతికి తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి సూర్య శంకర్ వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతులు పండించిన మొక్కజొన్న మరియు వరి పంటను కొనుగోలు విషయంలో ప్రభుత్వం నిర్లక్ష్యం వ్యవహరిస్తుందని అనేకచోట్ల మొక్కజొన్న వరి ఇతర పంటలు కొనుగోలు ఆలస్యం కావడం వలన రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అదేవిధంగా గిన్ని బ్యాగుల( గోన సంచుల) కొరత మరియు రవాణా సమస్యలు ఇతర కారణాల వలన కొనుగోలు సక్రమంగా జరగడం లేదని విమర్శించారు. సరిపోను గిడ్డంగులు లేవని మరియు లారీలు లేవని ధాన్యాన్ని కొనుగోలు నిలిపివేశారని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం కొనుగోలు ప్రారంభించాలని రైతులు ఎలాంటి ఇబ్బంది పడకుండా ధాన్యాన్ని కొనుగోలు చేసి ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు. అదేవిధంగా రాష్ట్ర ప్రభుత్వం సహకార సంఘాలకు నామినేటెడ్ పద్ధతిలో కమిటీలు, ఎన్నికలు నిర్వహించాలని డిమాండు చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి వేనేపల్లి రవీందర్, యువజన సంఘం జిల్లా అధ్యక్షులుదేశామోని ఆంజనేయులు, రైతు సంఘం మండల కార్యదర్శి నరేందర్ రెడ్డి, రైతు సంఘం నాయకులు బుగ్గ స్వామి, లక్ష్మణ్, శివ, కేశవ, వెంకటేష్ ,నిరంజన్, వి.నరేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# డబుల్ ఇంజన్‌తోనే తెలంగాణ అభివృద్ధి

- ఎంపీ డీకే అరుణ




**మహబూబ్‌నగర్, మే 2 (జనంసాక్షి) :** ఈ నెల 10వ తేదీన సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్స్‌లో నిర్వహించనున్న బీజేపీ 'జనాగ్రహ సభ'ను జయప్రదం చేయాలని మహబూబ్‌నగర్ గద్వాలలో పట్టణంలోని డికె. బంగ్లా లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎంపీ డికె. అరుణ మాట్లాడుతూ అబద్ధపు హామీలతో ప్రజలు నమ్మించి మోసం చేసిన కాంగ్రెస్ ప్రభుత్వం, నరేంద్రమోదీ తెలంగాణ అభివృద్ధికి నిబద్ధతతో కృషి చేస్తారని, మూడవ సారి ప్రధాని బాధ్యతలు తీసుకున్న తర్వాత మొదటి సారి తెలంగాణకి వస్తున్నారని, ఈ సందర్భంగా రాష్ట్రంలో పలు అభివృద్ధి పనులకు ప్రధాని మోడీ శంకుస్థాపన చేయనున్నట్లు పేర్కొన్నారు. ఎన్నికల వేళ ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారంటీల అమలులో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని, అధికారం కోసం అబద్ధపు హామీలిచ్చి అన్ని వర్గాల ప్రజలను మోసం చేసిందని మండిపడ్డారు. కాంగ్రెస్ వైఫల్యాలను ఎండగట్టేందుకే 'జనాగ్రహ సభ' నిర్వహిస్తున్నామని, ప్రజలు, కార్యకర్తలు స్వచ్ఛందంగా పాల్గొని ప్రభుత్వానికి తగిన గుణపాఠం చెప్పాలని కోరారు. ఇటీవల జరిగిన ఐదు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల్లో పశ్చిమ బెంగాల్‌లో బీజేపీ జెండా ఎగురవేస్తుందని, దక్షిణాది రాష్ట్రాలైన తమిళనాడు, కేరళలోనూ పార్టీ బలపడుతోందని, అస్సాం, పుదుచ్చేరిలో సానుకూల వాతావరణం ఉందని అన్నారు. గ్రామాలలో అభివృద్ధి కేంద్ర ప్రభుత్వా నిధులతోనే అభివృద్ధి జరుగుతుందని, పీఎంశ్రీ కింద సైన్స్ ల్యాబ్ లు, లైబ్రరీ భవనాలు, డిజిటల్ క్లాసులు ఏర్పాటు చేయడం జరిగిందని, కొన్ని రాష్ట్రాలలో భారతీయ జనతా పార్టీ మళ్లీ మళ్లీ అధికారంలోకి రావడానికి ముఖ్య కారణం ప్రధానమంత్రి నరేంద్ర మోడీ అందిస్తున్న సుపరిపాలన అని మరియు సంక్షేమ పథకాలు, ప్రజలకు అందటమే ప్రధాన కారణమని అన్నారు. బీజేపీ పాలిత రాష్ట్రాల్లో ఇచ్చిన మాటకు కట్టుబడి పని చేస్తుంది కాబట్టే, పదేపదే ప్రజలు అధికారం కట్టబెడుతున్నారుని, పదేళ్లు పాలించిన బిఆరెస్ ప్రజలను మోసం చేసి, ఆశలు అడియాశలు చేసి, రాష్ట్రాన్ని అప్పుల పాలు చేశారని, మహిళలకు ఇచ్చిన హామీలు అన్ని తుంగలో కాంగ్రెస్ తొక్కిందని, బీసీ, ఎస్సీ, ఎస్టీలను అన్ని వర్గాలను మోసం చేసింది కాంగ్రెస్ పార్టీ అని, బిఆరెస్, కాంగ్రెస్ రెండు పార్టీలను నమ్మి మోసపోయిన ప్రజలు బీజేపీ వైపు చూస్తున్నారన్నారు. తెలంగాణలో 7,823 కోట్ల విలువైన అభివృద్ధి పనులకు ప్రధాని నరేంద్ర మోదీ శంకుస్థాపన చేయబోతున్నారని, కాంగ్రెస్ మహిళ రిజర్వేషన్ బిల్లు, డీలిమిటేషన్ బిల్లు వ్యతిరేకించడం చూశామని, మహిళా రిజర్వేషన్ బిల్లు మూడు దశాబ్దాల నుంచి పెండింగ్ లోఉన్న బిల్లు, వాజపేయి హయాంలో అడ్డుకుంది కాంగ్రెస్ అని 2004లో మాట ఇచ్చి తప్పారని, మహిళా రిజర్వేషన్ బిల్లుకు కాంగ్రెస్ చిత్తశుద్ధి లోపించిందని ఆమె ఆరోపించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కోశాధికారి దేవకి వాసుదేవ రావు , జిల్లా అధ్యక్షుడు రామాంజనేయులు, రామచంద్ర రెడ్డి, రాష్ట్ర కౌన్సిల్ మేంబర్ బండల వెంకట రాములు ,జిల్లా ప్రధాన కార్యదర్శి రవి కుమార్ ఎక్బోటే, శివా రెడ్డి ,రాజగోపాల్, ఓబీసీ జిల్లా అధ్యక్షుడు దాస్ తదితరులున్నారు.

# వ్యవసాయం పండగ చేస్తున్నాం

- రైతులకు అండగా నిలబడుతున్నాం
- ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు
- ఐడిఓసిలో ప్రగతి ప్రణాళికపై సమావేశం



**జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, (జనంసాక్షి):** వ్యవసాయం దండుగ కాదని నిరూపిస్తూ, పండుగ చేస్తున్నామని, రైతులకు అండగా నిలబడుతున్నామని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు అన్నారు. శనివారం జయశంకర్ భూపాలపల్లి జిల్లాకేంద్రంలోని ఐడిఓసి కార్యాలయ సమావేశపు హాలులో ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా నియోజకవర్గ స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ జిల్లాలో 30 వేల ఎకరాలకు భూమి హక్కులు లేక రైతులు ఇబ్బందులు పడుతున్నారని, ఆ భూములకు సర్వే నిర్వహించి అర్హులైన ప్రతి ఒక్కరికి భూ హక్కు పట్టాలిస్తామని తెలిపారు. సాదా బైనామా భూములకు కూడా పట్టాలు ఇవ్వనున్నట్లు తెలిపారు. రైతులకు పట్టాలిస్తే రైతు కంట ఆనందం వెల్లివిరుస్తుందని, పేదలు దున్నుకునే భూములకు పట్టాలు ఇచ్చేందుకు సీఎం అంగీకరించారని తెలిపారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణంలో వేగం పెంచాలని సూచించారు. ప్రభుత్వ కార్యాలయాలు ప్రైవేట్ భవనాల్లో నిర్వహిస్తున్నట్లయితే వాటికి శాశ్వత భవనాలు నిర్మించడానికి ప్రతిపాదనలు అందజేయాలని సూచించారు. ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా గ్రామ, మండల, జిల్లా స్థాయిలో కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని అట్టి కార్యక్రమాలను విజయవంతం చేయాలని సూచించారు. ప్రతి ఒక్కరు ఆరోగ్యంగా ఉండాలన్న లక్ష్యంతో ఆరోగ్య కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని ప్రతి ఒక్కరూ వైద్య పరీక్షలు నిర్వహించుకొని ఉచిత వైద్య సేవలు పొందాలని తెలిపారు. వ్యాధులు వచ్చిన తర్వాత మందులు వాడే దానికంటే ముందుగానే ఆరోగ్య పరీక్షలు నిర్వహించుకొని జాగ్రత్త పడటం మంచిదని సూచించారు. జిల్లా ప్రధాన ఆసుపత్రిలో రూ.12 కోట్లతో ఎమ్మారై, రూ.3.40 కోట్లతో సిటీ స్కాన్, రూ.40 లక్షలతో వెంటి లేటర్లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. 165 రకాల పరీక్షలు చేసే పరికరాలు అందుబాటులో ఉన్నాయని, నూతనంగా క్యాజువాలిటీ నిర్మాణానికి, అలాగే రూ.1.90 కోట్లతో డ్రైనేజీ నిర్మాణం చేపట్టనున్నట్లు తెలిపారు. గ్రామాలు, మున్సిపాలిటీ అభివృద్ధికి ఆదాయాన్ని సమకూర్చుకొని ప్రజలకు మౌలిక సౌకర్యాలు కల్పన పనులు చేపట్టాలని తెలిపారు. అభివృద్ధికి ప్రణాళికలు రూపొందించాలని సూచించారు. రూ.26 కోట్లతో నర్సింగ్ కళాశాల నిర్మిస్తున్నామని, అలాగే రూ.50 కోట్లతో ఏటీసీ భవనం నిర్మించినట్లు తెలిపారు. రాష్ట్రంలో 600 ఏటిసి కేంద్రాలు నిర్మించినట్లు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ఏర్పడిన నాటి నుండి 70 వేల మందికి ఉద్యోగ అవకాశాలు కల్పించినట్లు తెలిపారు. జిల్లా కేంద్రంలో జాబ్ మేళా నిర్వహించి 2,700 మందికి ఉపాధి అవకాశాలు కల్పించామని, రానున్న రోజుల్లో జాబ్ మేళా నిర్వహించి మరి కొంతమంది నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు కల్పిస్తామన్నారు. జిల్లా కేంద్రంలో సింగరేణి సౌజన్యంతో 36 కోర్సుల్లో వృత్తి నైపుణ్యం శిక్షణ కేంద్రం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జూన్ 12న పాఠశాలల పున ప్రారంభం రోజున విద్యార్థులకు యూనిఫామ్స్, పుస్తకాలు పంపిణీ చేసేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. పాఠశాల విద్యార్థులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహిస్తున్నామని అన్ని సంక్షేమ వసతి గృహాల విద్యార్థులకు 200 శాతం డైట్ చార్జీలు, 40శాతం కాస్మొటిక్ చార్జీలు పెంచినట్లు తెలిపారు. రూ. 200 కోట్లతో యంగ్ ఇండియా ఇంటర్నేషనల్ మోడల్ రెసిడెన్షియల్ పాఠశాల నిర్మాణం పనులు చేపట్టామని, 18 నెలల్లో పూర్తి చేస్తామని తెలిపారు. కొడవటంచ దేవాలయాన్ని మరో యాదగిరిగుట్ట లాగా అభివృద్ధి చేయనున్నట్లు తెలిపారు. భూపాలపల్లి నియోజకవర్గాన్ని రాష్ట్రంలోనే ఆదర్శ నియోజకవర్గంగా, మోడల్ నియోజకవర్గంగా తీర్చిదిద్దేందుకు జిల్లా యంత్రాంగం, ప్రజాప్రతినిధులు కలిసికట్టుగా పని చేయాలని స్పష్టం చేశారు. పార్టీలు కచ్చితంగా జిల్లాను అభివృద్ధి చేయాలని అభివృద్ధిలో మనందరం పోటీ పడాలని ఆయన స్పష్టం చేశారు.

జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమం జిల్లాలో దిగ్విజయంగా జరుగుతున్నట్లు తెలిపారు. రాష్ట్రస్థాయి నుండి గ్రామీణ ప్రాంతం వరకు ఈ కార్యక్రమాలు అమలు జరుగుతున్నట్లు తెలిపారు. వార్డు సభ్యులు, సర్పంచులు, కౌన్సిలర్లు, మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్లకు ప్రజా పాలన, ప్రగతి ప్రణాళిక కార్యక్రమంపై అవగాహన కల్పించామని అన్నారు. చేపట్టిన కార్యక్రమాలను అన్ని శాఖలలో అమలు చేశామన్నారు. ప్రతి గ్రామం, మున్సిపాలిటీల్లో గ్రామసభలు నిర్వహించి, శాఖల వారీగా చేపట్టాల్సిన కార్యక్రమాలపై దిశా నిర్దేశం చేసి అమలు చేస్తున్నామన్నారు. అనంతరం నేతన్న భద్రత భీమా క్రింద ఇద్దరికి రూ.10 లక్షలు పంపిణీ చేశారు. అలాగే దత్తత సహాయ కేంద్రం హెల్ప్ డెస్క్ ప్రారంభించారు. ఈ సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విజయలక్ష్మి, ఏఎస్పి నరేష్ కుమార్, ఆర్డిఓ హరికృష్ణ, మున్సిపల్ చైర్మన్ బుర్ర కొమురయ్య, వైస్ చైర్మన్ అంబాల శ్రీనివాస్, భూపాలపల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ కిష్టయ్య , అన్ని శాఖల జిల్లా ధికారులు, తహసీల్దార్లు, ఎంపిడిఓలు, కౌన్సిలర్లు సర్పంచులు పాల్గొన్నారు.




## స్వచ్ఛంద సంస్థల సమన్వయంతో భారీ అవగాహన ర్యాలీ

- ర్యాలీని ప్రారంభించిన హనుమకొండ జిల్లా కలెక్టర్

**హనుమకొండ ప్రతినిధి మే 2 (జనం సాక్షి) :** ప్రజా పాలన-ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా శనివారం హనుమకొండ అదాలత్ సెంటర్ నుండి ఐడీఓసీ కార్యాలయం వరకు పోలీస్, ఎక్సైజ్ శాఖలు మరియు స్వచ్ఛంద సంస్థల సమన్వయంతో భారీ అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వరంగల్ సిటీ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్ మాట్లాడుతూ, యువత సోషల్ మీడియా, సినీ ప్రభావాల వల్ల తప్పుదారి పట్టే ప్రమాదం ఉన్నందున, గ్రామ స్థాయి నుండి జిల్లా స్థాయి వరకు ప్రజల్లో అవగాహన పెంచేందుకు పోలీస్ శాఖ పలు కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. అత్యవసర పరిస్థితుల్లో 100 లేదా 1098 నంబర్లకు సమాచారం అందిస్తే వెంటనే స్పందించి సహాయం అందిస్తామని పేర్కొన్నారు. జిల్లా కలెక్టర్ ఛాహత్ బాజ్‌పాయ్ మాట్లాడుతూలి జిల్లాను డ్రగ్స్ రహిత జిల్లాగా మార్చేందుకు ప్రతి ఒక్కరూ భాగస్వామ్యం కావాలని కోరారు. మాదకద్రవ్యాల దుష్పరిణామాలపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించేందుకు అధికారులు కృషి చేయాలని సూచించారు. యువత తప్పుదారి పడకుండా తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు బాధ్యతతో మార్గనిర్దేశనం చేయాలని అన్నారు. అనంతరం ఐడీఓసీ కార్యాలయం వద్ద మానవహారం నిర్వహించి, డ్రగ్స్‌కు దూరంగా ఉండాలని ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో డీసీపీ ధార కవిత, అడిషనల్ డీసీపీ ప్రభాకర్, ఎక్సైజ్ సూపరింటెండెంట్ చంద్రశేఖర్, డీడబ్ల్యుఓ విశ్వజ, పోలీస్, ఎక్సైజ్ శాఖల అధికారులు, ఆశా వర్కర్లు, అంగన్వాడీ కార్యకర్తలు, స్వచ్ఛంద సంస్థల సభ్యులు పాల్గొన్నారు.

## తక్కువ యూరియా వాడి సాగు ఖర్చు తగ్గించండి

- వ్యవసాయ కళాశాల శాస్త్రవేత్తలు



**శాయంపేట, మే 2 (జనంసాక్షి) :** శాయంపేట మండలం పెద్దకొడేపాక గ్రామంలో రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమం ఘనంగా నిర్వహించబడింది. ఈ కార్యక్రమంలో వరంగల్ వ్యవసాయ కళాశాల శాస్త్రవేత్తలు, విద్యాధర్, సిద్ధార్థ నాయక్ , టీచింగ్ అసోసియేట్ రైతులను ఉద్దేశించి మాట్లాడుతూ, యూరియాను అవసరానికి మించి వినియోగించడం వల్ల నేలలో నత్రజని అసమతుల్యత ఏర్పడి భూసార శక్తి క్రమంగా తగ్గిపోతుందని వివరించారు. అధిక యూరియా వినియోగం వల్ల సూక్ష్మ ధాతు పోషకాల లోపం, నేల ఆమ్లత్వం పెరగడం, పంటల పెరుగుదలలో అసమానతలు, దిగుబడి నాణ్యత తగ్గుదల వంటి సమస్యలు ఉత్పన్నమవుతాయని తెలిపారు. శాస్త్రీయ నిర్వహణలో భాగంగా నానో యూరియా వినియోగం ద్వారా నత్రజని సమర్థవంతంగా మొక్కలకు అందుతుందని, నీమ్ కోటెడ్ యూరియా వల్ల నత్రజని నష్టాలు తగ్గి దీర్ఘకాలం మొక్కలకు అందుబాటులో ఉంటుందని వివరించారు. వర్మీ కంపోస్ట్ వాడకం ద్వారా నేలలో సేంద్రియ కార్బన్ పెరిగి, సూక్ష్మజీవుల క్రియాశీలత మెరుగుపడి భూసార శక్తి పెరుగుతుందని తెలిపారు. అలాగే లీఫ్ కలర్ చార్ట్ ఆధారంగా పంట ఆకుల రంగును పరిశీలించి అవసరమైనప్పుడు మాత్రమే యూరియా వినియోగించడం వల్ల ఎరువుల వృథా తగ్గి, సాగు ఖర్చు తగ్గి, పర్యావరణ పరిరక్షణ కూడా సాధ్యమవుతుందని రైతులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఈఓ అన్వేష్,వరంగల్ వ్యవసాయ కళాశాల విద్యార్థులు తేజస్విని, తయబ్బా ,రైతులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులకు అందజేయడమే లక్ష్యం

- జిల్లా జాయింట్ కలెక్టర్ రవి



**హనుమకొండ ప్రతినిధి మే 2 (జనం సాక్షి) :** ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అర్హులైన లబ్ధిదారులకు సక్రమంగా చేరి, వాటి ప్రయోజనాలను పొందినప్పుడే ప్రభుత్వ లక్ష్యం నెరవేరుతుందని జిల్లా జాయట్ కలెక్టర్ కే. రవి పేర్కొన్నారు. ఈ సమావేశం నియోజకవర్గ ప్రత్యేక అధికారి, ఆర్డీవో రమేష్ రాథోడ్ అధ్యక్షతన కార్యాలయ సమావేశ మందిరంలో నిర్వహించబడింది. కార్యక్రమాన్ని రాష్ట్ర గేయాలాపనతో ప్రారంభించారు. శనివారం ప్రజా పాలన-ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా సమావేశంలో జాయింట్ కలెక్టర్ రవి మాట్లాడుతూ. స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు ప్రజలతో మమేకమై సమగ్ర అభివృద్ధి సాధనకు కృషి చేయాలని, ప్రభుత్వ పథకాలను విస్తృతంగా ప్రజల్లోకి తీసుకువెళ్లాలని సూచించారు. అనంతరం సంబంధిత శాఖల అధికారులు 99 రోజుల యాక్షన్ ప్లాన్ కింద చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలు, సాధించిన పురోగతిని పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ, ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రస్తుత మరియు రాబోయే సంక్షేమ పథకాలపై ప్రజలకు సమగ్ర అవగాహన కల్పించాల్సిన బాధ్యత అధికారులపై ఉందని తెలిపారు. ప్రజా పాలన దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి అర్హులందరికీ ప్రయోజనాలు అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో రెవెన్యూ డివిజనల్ అధికారి రమేష్ రాథోడ్, డీసీఎస్ఓ వాజిద్ అలీ, ఏడి వ్యవసాయం రవి, మున్సిపల్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ రవికుమార్, జిల్లా పర్యాటక అధికారి శివాజీ, మండల రెవెన్యూ అధికారి రవీందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## బాలికలు స్నేహ వేసవి శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

- కొమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా కలెక్టర్ హరిత



**కొమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి, మే 02(జనంసాక్షి ):** జిల్లాలోని 15-18 సంవత్సరాల లోపు వయస్సు గల బాలికలు స్నేహ వేసవి శిభిరాలను సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ హరిత అన్నారు. శనివారం సమీకృత కలెక్టరేట్ భవనంలోని సమావేశ మందిరంలో మే 2 నుండి జూన్ 10 వరకు కౌమార బాలికలు 15-18 సంవత్సరాల లోపు వున్నా బాలికలకు స్నేహ వేసవి శిభిరాల నిర్వహణ పై జిల్లా స్థాయి సమన్వయం, క్షేత్ర స్థాయి సిబ్బందికి అవగాహన కల్పన నిర్మాణాత్మక శిక్షణ ప్రణాళిక అమలు పై ఏర్పాటు చేసిన సమావేశానికి అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు యువరాజ్ మార్మాట్ తో కలిసి కలెక్టర్, వివిధ శాఖల అధికారులతో సమీక్షా నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లడుతూ 15-18 సంవ్వత్సరాల లోపు బాలికలకు మండల స్థాయిలో స్నేహ వేసవి శిభిరాలు ఈ నెల 2 నుండి జూన్ 10 వరకు నిర్వహించాలన్నారు. సంబందిత అధికారులు సమన్వయశీతో పని చేసి వేసవి శిభిరాలను పకడ్బందిగా నిర్వహించాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ అధికారి దత్తారావు, జిల్లా గిరిజన సంక్షేమ శాఖ అధికారి రమాదేవి , జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి సీతారాం, డివిజనల్ పంచాయతి అధికారి ఉమర్ హుస్సేన్, సెర్ఫ్ డి. పి. ఎం, లు రామకృష్ణ ,యాదగిరి, సంక్షేమ శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## ప్రతి కుటుంబం ఆర్థికంగా ఎదగడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం

- ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి



**పరకాల, మే 2 (జనం సాక్షి):** ప్రతి కుటుంబం ఆర్థికంగా ఎదగడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని పరకాల శాసనసభ్యులు రేవూరి ప్రకాశ్ రెడ్డి అన్నారు. శనివారం పరకాల పట్టణ కేంద్రం లో నిర్వహించిన ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా పరకాల నియోజకవర్గ స్థాయి సమావేశం లో వరంగల్ ఎంపీ కడియం కావ్య ,జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్ లతో కలిసి పరకాల ఎమ్మెల్యే రేవూరి పాల్గొన్నారు. అంతకుముందు వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు ఆయా శాఖల ఆధ్వర్యంలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను వివరించారు. వివిధ శాఖల ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన స్టాల్స్ ను పరిశీలించి, వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం విద్యుత్ శాఖ, మహిళా శిశు సంక్షేమ శాఖకు సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో సహచర మంత్రివర్గ కృషితో రాష్ట్ర అభివృద్ధికి కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తుంది అన్నారు. ప్రజల భాగస్వామ్యంతో కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం అంశాల వారీగా చేసిన, చేయబోతున్న పనులను విస్తృతంగా ప్రచారం చేసేందుకు కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమం నిర్వహిస్తుందన్నారు. ప్రధానంగా విద్య, వైద్యం వంటి అంశాలపై ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. ప్రతి కుటుంబానికి ఉపాధి పెంపొందడంతో పాటు ఆర్థికంగా అభివృద్ధి చేయాలనే సంకల్పంతో కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. స్వయం ఉపాధి అవకాశాలు పెంపొందించే దిశగా అనేక సంక్షేమ పథకాల అమలు చేస్తున్నామని అన్నారు. గత బి ఆర్ ఎస్ ప్రభుత్వం వల్ల ప్రజలు మోసపోయారని, వాస్తవాలు తెలుసుకోండి, మాయమాటలు నమ్మకండి అని తెలిపారు. కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం వచ్చాక రైతులకు ఏకకాలంలో రైతు రుణమాఫీ చేశామని, రైతు భరోసా, రైతు బీమా ఇచ్చి రైతులను ఆదుకున్నామన్నమని, రైతులు ఆధునిక వ్యవసాయ పద్ధతులను అనుసరించాలని తెలిపారు. సన్న వడ్లకు 500 రూ బోనస్ చెల్లింపు, సబ్సిడీ విత్తనాలనుఅందిస్తున్నామన్నారు. దేశంలోనే సన్న బియ్యం పేదలకు అందించి వారి ఆరోగ్యాన్ని కాపాడుతున్నామని అన్నారు. 200 యూనిట్ల ఉచిత విద్యుత్,500 రూ గ్యాస్ సిలిండర్,చదువుకునే విద్యార్థులకు ఆరోగ్యంగా పౌష్టికాహారంఅందిస్తున్నామని తెలిపారు. ఇందిరమ్మ ఇండ్ల ద్వారా పేదల చిరకాల కోరిక నెరవేరిందని అన్నారు. ఇందిరమ్మ చీరల ద్వారా మహిళల ఆత్మగౌరవాన్ని పెంచామన్నారు. ప్రభుత్వ పాఠశాలలో పిల్లలను చేర్పించాలని, ప్రతి కుటుంబం ఆర్థికంగా అభివృద్ధి చెందేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తున్న అన్నారు. త్వరలో ప్రభుత్వ ఆసుపత్రిని ప్రారంభిస్తామని, పట్టణానికి ఏటీసీ సెంటర్, నూతన ప్రభుత్వ డిగ్రీ కళాశాల, యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్ పనులు చేపట్టామన్నారు. మహిళల ఆర్థిక అభివృద్ధి సాధించేందుకు ఉపాధి అవకాశాలుపెంపొందించడానికి పరకాల ఇందిర మహిళ డైరీ ని ఏర్పాటు చేస్తున్నామన్నారు. అంగన్వాడి చిన్నారులకు దుస్తులను పంపిణీ చేశారు.

## ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక ద్వారా ప్రజలకు మెరుగైన సేవలు

- ప్రజలతో మమేకమై అభివృద్ధి సాధించాలి
- ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలలోకి విస్తృతంగా తీసుకువెళ్లాలి
- జిల్లా అదనపు కలెక్టర్ రెవెన్యూ సిహెచ్ మహేందర్ జి.



**ములుగు ప్రతినిధి, మే 02(జనంసాక్షి) :** ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక ద్వారా ప్రజలకు మెరుగైన సేవలందిస్తున్నట్లు అదనపు కలెక్టర్ రెవెన్యూ సిహెచ్ మహేందర్ జి తెలిపారు. స్థానిక ప్రజాప్రతినిధులు అధికారులు ప్రజలతో మమేకమై సంపూర్ణ సమగ్ర అభివృద్ధి సాధించడానికి కృషి చేస్తూ, ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను విస్తృతంగా ప్రజలలోకి తీసుకువెళ్లాలని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్నా 99 రోజుల ప్రజాపాలన - ప్రగతి ప్రణాళికలి కార్యక్రమం లో భాగంగా శనివారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నియోజకవర్గ ప్రత్యేక అధికారి ఆర్డీవో వెంకటేష్ అధ్యక్షతన ఏర్పాటుచేసిన నియోజకవర్గ స్థాయి సమావేశాన్ని జిల్లా అదనపు కలెక్టర్ రెవెన్యూ సిహెచ్ మహేందర్ జి, అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు సంపత్ రావు తో కలిసి హాజరై రాష్ట్ర గేయాలాపనతో కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా సంబంధిత శాఖ అధికారులు 99 రోజుల ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక యాక్షన్ ప్లాన్ లో భాగంగా చేసిన అభివృద్ధి కార్యక్రమాలు, సాధించిన ప్రగతి వివరాలను పిపిటి ప్రజెంటేషన్ ద్వారా సమగ్రంగా వివరించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ సిహెచ్ మహేందర్ జి, మాట్లాడుతూ ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక యాక్షన్ ప్లాన్ లో భాగంగా ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, త్వరలో అమలు చేయబోయే మరిన్ని సంక్షేమ పథకాలకు గురించి ప్రజలకు పూర్తిస్థాయిలో సమగ్రంగా ప్రజలకు అవగాహన కల్పించాలని సంబంధిత శాఖ అధికారులకు దిశా నిర్దేశం చేశారు. ప్రజాపాలన దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ ఫలాలు అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. జనగణలో భాగంగా ప్రతి ఒక్కరూ ఏప్రిల్ 26వ తేదీ నుంచి, మే 10వ తేదీ వరకు జరుగుతున్న సెల్ఫ్ ఎన్యునరేషన్ లో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యం కావాలని కోరారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు సంపత్ రావు మాట్లాడుతూ అన్ని శాఖల అధికారులు రూపొందించిన యాక్షన్ ప్లాన్ తో ముందుకు సాగాలని ప్రజలు అధికారులు ప్రజా ప్రతినిధులు సమన్వయంతో ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలలోకి తీసుకువెళ్లాలి కోరారు. ఈ సందర్భంగా మున్సిపాలిటీ చైర్ పర్సన్ చింత నిప్పుల చంద్రకళ మాట్లాడుతూ మున్సిపాలిటీ నూతన పాలకవర్గం ఏర్పడిన అనంతరం ప్రభుత్వం ప్రత్యేకంగా ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమాన్ని తీసుకురావడం సంతోషకరంగా ఉందని తెలిపారు. మున్సిపాలిటీ పరిధిలో రెండు కొత్త బోర్ వెల్స్ ను వేయడం జరిగిందని, ఆరు పాత బోర్వెల్స్ ను పూర్తిస్థాయిలో మరమ్మతులు చేశామని, వేసవికాలం దృష్ట్యా ఐదు చలివేంద్రాలను ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. 20 వార్డులలోని సమస్యలను స్థానిక కౌన్సిలర్లతో పర్యవేక్షించి పరిశీలించడం జరుగుతుందని వాటిని త్వరితగతిన పరిష్కరించడానికి కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో డిఎస్పీ రవీందర్, మున్సిపాలిటీ వైస్ చైర్పర్సన్ ఆసియా షాహిన్, ఆత్మ కమిటీ చైర్మన్ రవీందర్ రెడ్డి, జిల్లా అధికారులు, కౌన్సిలర్లు, సర్పంచులు, ప్రజా ప్రతినిధులు సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.



## కొత్త బాధ్యతల్లో మరింత ప్రతిభ కనబరచాలి

- జిల్లా ఎస్పీ డా. శబరీష్

**మహబూబాబాద్ బ్యూరో,మే 02(జనం సాక్షి):** ఇటీవల ప్రభుత్వం ప్రకటించిన పదోన్నతులలో మహబూబాబాద్ సి ఐ గట్ల మహేందర్ రెడ్డికి డీఎస్పీగా పదోన్నతి లభించిన సందర్భంగా వారు జిల్లా ఎస్పీ డా. శబరీష్ ని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా సీఐ మహేందర్ రెడ్డి తన సేవా కాలంలో అందించిన మార్గదర్శకానికి ఎస్పీకి కృతజ్ఞతలు తెలియజేసారు. ఈ సందర్భంగా ఎస్పీ డా. శబరిష్ మాట్లాడుతూ మహేందర్ రెడ్డి ని అభినందించి, కొత్త బాధ్యతల్లో మరింత ప్రతిభ కనబరిచి శాఖకు మంచి పేరు తీసుకురావాలని ఆశాభావం వ్యక్తం చేశారు.

## ఏరియా బొగ్గు గనుల ఉత్పత్తి వివరాలను వెల్లడించిన జిఎం




**శ్రీరాంపూర్(జనంసాక్షి):** ఆర్థిక సంవత్సరం మొదటి నెల ఏప్రిల్ మాసంలో ఏరియా సింగరేణి బొగ్గు గనులు సాధించిన ఉత్పత్తి,ఉత్పాదకత వివరాలను శ్రీరాంపూర్ ఏరియా జీఎం మునిగంటి శ్రీనివాస్ శనివారం విలేకరుల సమావేశంలో వెల్లడించారు. ఉత్పత్తి లక్ష్యం 5,47,500 టన్నులకు గాను 3,07,200 టన్నులు సాధించినట్లు తెలిపారు. ఐకే 1ఏ గని మినహా ఏరియా పరిధిలోని మిగిలిన ఐదు భూగర్భ గనులు వందశాతం ఉత్పత్తితో మొత్తంగా భూగర్భ గనులు 99 % ఉత్పత్తి సాధించినట్లు తెలిపారు. ప్రైవేట్ కాంట్రాక్ట్ ఒప్పంద సమస్యలు,డీజీల్ కొరత కారణంగా ఓసీలలో ఆశించిన స్థాయిలో ఉత్పత్తి జరగలేదు అన్నారు. రానున్న రోజుల్లోనూ భూగర్భ గనుల్లో అదే ఒరవడి కొనసాగిస్తూ ఉపరితల గనుల్లోనూ సమస్యలు చక్కదిద్ది నూటికి నూరు శాతం ఉత్పత్తి సాధనకు కృషిచేస్తామన్నారు. ఉద్యోగ విరమణ పొందిన 9751 మంది ఉద్యోగులకు సిపిఆర్ఎంఎస్ క్రింద శ్రీరాంపూర్ ఏరియాలో మెడికల్ కార్డులు అందజేశామన్నారు. ఈ కార్యక్రమంలో డీజీఎంలు అనిల్ కుమార్,రాజన్న,సీనియర్ పిఓ సురేందర్ పాల్గొన్నారు.

జనంసాక్షి
www.janamsakshi.org
ఆదివారం
03 మే 2026

# ప్రజా పాలనలో తాగునీరు, విద్య, వైద్య రంగాలకు ప్రాధాన్యత

- జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవర్



**కోదాడ, మే 2 (జనం సాక్షి) :** ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో వివిధ అభివృద్ధి సంక్షేమ పథకాలను క్షేత్రస్థాయిలో తీసుకెళ్లడమే లక్ష్యంగా అధికారులు కృషి చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ తెలిపారు. శనివారం ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా కోదాడ నియోజకవర్గ స్థాయి సమావేశం కోదాడలో జిల్లా కలెక్టర్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ప్రజా పాలన లో గ్రామ స్థాయి నుండి జిల్లా స్థాయి వరకు శానిటేషన్, త్రాగు నీరు, విద్య, వైద్యంలపై అధిక ప్రాధాన్యత కల్పిస్తుందని తెలిపారు. ప్రభుత్వ ఆదేశాలతో వేసవిలో త్రాగునీటి సమస్య లేకుండా ప్రణాళికలు చేశామన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు క్షేత్ర స్థాయిలో అమలు అవుతున్నాయా లేదా అని అధికారులు మానిటరింగ్ చేస్తూ అర్హులైన వారికి ప్రభుత్వ పథకాలు చేరేలా కృషి చేస్తున్నట్లు తెలిపారు. ప్రజల సమస్యలను గుర్తించి ఏ విధంగా పరిష్కారం చేయాలనేది కార్యచరణ తో ముందుకు వెళ్లాలని సూచించారు. అభివృద్ధికి సంబంధించిన ఫైల్స్ పెండింగ్ పెట్టకుండా ఎప్పటికప్పుడు క్లియర్ చేయాలని ఆదేశించారు..గ్రామాల అభివృద్ధి కొరకు గ్రామ సభలు నిర్వహించి ప్రజల నుండి వినతులు స్వీకరించాలని తెలిపారు. పి హెచ్ సి లను బలోపేతం చేసే క్వాలిఫైడ్ డాక్టర్లు, సిబ్బందితో గ్రామాలలో వైద్య సేవలను అందిస్తున్నట్లు చెప్పారు. ప్రభుత్వ ఆసుపత్రిలో సాధారణ ప్రసవాలు పెంచేలా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. కోదాడ ఏరియా హాస్పిటల్ అప్ గ్రేడ్ చేయడం జరిగిందని, ప్రస్తుతం పనులు పురోగతిలో ఉన్నాయన్నారు. హెల్మెట్ లేని ప్రయాణం ప్రమాదకరమని, రోడ్డు ప్రమాదంలో కుటుంబ పెద్ద మరణిస్తే కుటుంబం రోడ్డున పడుతోందని. ఖచ్చితంగా ప్రతి ఒక్కరు హెల్మెట్ ధరించి ప్రయాణించాలని సూచించారు. ప్రజా ప్రభుత్వం ఏర్పడిన తర్వాత గృహ జ్యోతి పథకం ద్వారా పేదలకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్, కొత్త రేషన్ కార్డులు, డైట్ చార్జీల పెంపు, ఇందిరమ్మ ఇళ్లు, రూ.500 గ్యాస్ సిలిండర్, ఇందిరా మహిళా శక్తి వడ్డీరహిత రుణాలు, రేషన్‌లో సన్నబియ్యం, రైతు భరోసా, రైతు రుణమాఫీ, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం వంటి పథకాలు అమలులో ఉన్నాయని పేర్కొన్నారు. పోలీస్, రమణా శాఖ ద్వారా అరైవ్ .అలైవ్ కార్యక్రమం నిర్వహించి రోడ్డు భద్రతపై కార్యక్రమాలు నిర్వహించినట్లు తెలిపారు. గ్రామస్థాయిలో రోడ్డు భద్రత కమిటీలు ఏర్పాటు చేశామన్నారు. క్రైమ్ కంటే రహదారి ప్రమాదంలో చాలామంది మరణిస్తున్నారని ప్రమాదాల నివారణకు కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటున్నట్టు తెలిపారు. రానున్న రోజుల్లో జరగనున్న రైతు వారం, సంక్షేమ వారోత్సవాలు, చైల్డ్ సేఫ్టీ, నో డ్రగ్స్, వ్యవసాయం, యువజన సర్వీసులు, విద్య, మహిళలు పర్యావరణ పరిరక్షణ కార్యక్రమాలు ఉన్నాయని విజయవంతంగా నిర్వహించాలని తెలిపారు. క్షేత్రస్థాయి వరకు అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని అన్నారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక అభివృద్ధి కార్యక్రమాల్లో భాగస్వాములు కావాలని, అభివృద్ధి కోసం ఇన్నోవేషన్ ఐడియాలు అమలు చేయాలని తెలిపారు. అనంతరం పదవ తరగతి ఉత్తీర్ణత లో కోదాడ నియోజకవర్గంలో అత్యధిక మార్కులు సాధించిన మండలం వారి టాపర్ల మార్కుల ఫోటోతో కూడిన మెమొంటోలు అందజేశారు. తదుపరి అంగన్వాడి, వైద్యశాఖ, వ్యవసాయ శాఖ స్టాల్స్ ను పరిశీలించారు. ఈ సమావేశంలో మున్సిపల్ చైర్మన్ ఎర్నేని కుసుమ, వైస్ చైర్మన్ మల్లీశ్వరి, వ్యవసాయ మార్కెట్ చైర్మన్ ఏపూరి తిరుపతమ్మ, డీఎఫ్ ఓ సతీష్, ఆర్డీవో సూర్యనారాయణ ఎస్సీ డీడీ దయానందరాణి మున్సిపల్ కమిషనర్ రమాదేవి అడిషనల్ పిడి సురేష్, అన్ని శాఖల జిల్లా ధికారులు, తహసీల్దార్లు, ఎంపిడిఓలు, కౌన్సిలర్లు సర్పంచులు తదితరులు పాల్గొన్నారు.

## రోటరీ నగర్ కాలనీలో నిలిచిపోయిన డ్రైనేజీ పనులు

- మండుటెండల్లో కాలనీవాసుల నరకయాతన



**ఖమ్మం, మే 2 (జనంసాక్షి) :** ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్ 9వ వార్డు పరిధిలోని రోటరీ నగర్ కాలనీలో కాంట్రాక్టర్ మరియు అధికారుల నిర్లక్ష్యం స్థానికుల పాలిట శాపంగా మారింది. రోడ్ నంబర్ 4లోని ఇంటి నంబర్ 15-6-64/5 సమీపంలో డ్రైనేజీ నిర్మాణం కోసం రోడ్డును తవ్విన కాంట్రాక్టర్, పనులను అర్ధాంతరంగా నిలిపివేసి గాలికి వదిలేశారు. ఈ మండు వేసవిలో రోడ్డుపై పేరుకుపోయిన మట్టి దిబ్బల వల్ల దుమ్ము విపరీతంగా రేగుతూ కాలనీవాసులు శ్వాసకోశ ఇబ్బందులకు గురవుతున్నారు. అసంపూర్తిగా ఉన్న గుంతల వల్ల రహదారి పూర్తిగా మూసుకుపోవడంతో, కనీసం నడవడానికి కూడా వీలులేక స్థానికులు నరకయాతన అనుభవిస్తున్నారు. మున్సిపల్ అధికారుల పర్యవేక్షణ లోపం వల్లే ఈ పరిస్థితి దాపురించిందని కాలనీ వాసులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఎండ తీవ్రత అధికంగా ఉన్న తరుణంలో పనులు త్వరగా పూర్తి చేయాల్సింది పోయి, ఇలా రోడ్డును దిగ్బంధం చేయడంపై ఫిర్యాదులు వెల్లువెత్తుతున్నాయి. అత్యవసర సేవల వాహనాలు కూడా లోపలికి వచ్చే అవకాశం లేకపోవడంతో ఏదైనా ప్రమాదం జరిగితే బాధ్యత ఎవరిదని వారు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్ ఉన్నతాధికారులు స్పందించి, తక్షణమే కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకుని, ఈ వేసవి తాపం ముగిసేలోపు డ్రైనేజీ పనులు పూర్తి చేయాలని 9వ వార్డు ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

## ఏన్కూర్ ఎస్సైపై సీపీకి ఫిర్యాదు

**ఖమ్మం, మే 2 (జనంసాక్షి) :** ఖమ్మం జిల్లా ఏన్కూరు మండలంలో భూవివాదం నేపథ్యంలో పోలీసుల వ్యవహారంపై వివాదం చెలరేగింది. జన్నారం గ్రామానికి చెందిన సిపిఐ ఏన్కూరు మండల కార్యదర్శి జాగర్లమూడి రంజిత్ కుమార్, స్థానిక ఎస్సైపై చర్యలు తీసుకోవాలని పోలీస్ కమిషనర్ సునీల్ దత్తుకు ఫిర్యాదు చేశారు. రంజిత్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం, జన్నారం గ్రామ రెవెన్యూ పరిధిలోని సర్వే నంబర్ 283/అలో 1.28 ఎకరాల భూమి తన స్వాధీనంలో ఉండగా, దీనికి సంబంధించి రెవెన్యూ రికార్డులు మరియు భద్రాచలం మొబైల్ కోర్టు (రా సీశీ.395/2022) తీర్పు తనకు అనుకూలంగా ఉన్నాయని చెప్పారు. అయితే వేముల వెంకన్నతో పాటు మరికొందరు భూమిని ఆక్రమించేందుకు ప్రయత్నిస్తూ తరచూ ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆరోపించారు. ఇటీవల భూమిని దున్నుకుంటున్న సమయంలో జరిగిన వాగ్వివాదం అనంతరం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. విచారణ సందర్భంగా సంబంధిత రికార్డులు, కోర్టు ఉత్తర్వులు చూపించినప్పటికీ, ఎస్సై వాటిని పట్టించుకోకుండా తమపై తప్పుడు కేసులు నమోదు చేశారని ఆరోపించారు. కోర్టు ఆదేశాలను ధిక్కరించి నమోదు చేసిన కేసులను రద్దు చేయడంతో పాటు సంబంధిత ఎస్సైపై చర్యలు తీసుకోవాలని కమిషనర్‌కు విజ్ఞప్తి చేసినట్లు తెలిపారు. ఈ ఫిర్యాదుపై విచారణ జరిపిస్తామని పోలీస్ కమిషనర్ హామీ ఇచ్చినట్లు రంజిత్ కుమార్ వెల్లడించారు.

## అధికారుల నిర్లక్ష్యానికి రైతన్న బలి

- మాచనపల్లిలో విద్యుత్ శాఖ వికృత చేష్టలు



**మాడుగులపల్లి, మే 2 (జనం సాక్షి) :** రైతే రాజు అని పాలకులు చెబుతున్న మాటలు మాడుగులపల్లి మండలం మాచనపల్లి గ్రామంలో అపహాస్యమవుతున్నాయి విద్యుత్ శాఖాధికారుల మొద్దునిద్ర, నిర్లక్ష్య వైఖరి కారణంగా మాచనపల్లి రైతాంగం కన్నీరు పెడుతోంది నిరుపయోగంగా ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ల గురించి ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా, అధికారులు కనీసం అటువైపు కన్నెత్తి చూడకపోవడం వారి అహంకారానికి నిదర్శనమని గ్రామస్థులు నిప్పులు చెరుగుతున్నారు గ్రామంలో ట్రాన్స్‌ఫార్మర్లు మూలనపడి నెలలు గడుస్తున్నా, అధికారులు మాత్రం ఏసీ గదుల్లో కాలక్షేపం చేస్తున్నారు క్షేత్రస్థాయిలో రైతులు పడుతున్న ఇబ్బందులు వీరికి పట్టవా? అని గ్రామస్థులు సూటిగా ప్రశ్నిస్తున్నారు లో-వోల్టేజీ వల్ల మోటార్లు కాలిపోయి, రిపేర్లకే వేల రూపాయలు ఖర్చవుతుంటే, అప్పులు తెచ్చి సాగు చేస్తున్న రైతులకు ఈ నష్టాన్ని అధికారులు భరిస్తారా? అని నిలదీస్తున్నారు కొత్త ట్రాన్స్‌ఫార్మర్లు ఇస్తామని అధికారులు చెబుతున్న మాటలునీటి మూటలు గానే మిగిలిపోయాయి ప్రకటనలు తప్ప పనిలో వేగం కనిపించడం లేదని, అధికారుల తాత్సారం వల్ల పచ్చని పంటలు కళ్లముందే ఎండిపోతుంటే రైతులు తట్టుకోలేకపోతున్నారు ఇది కేవలం నిర్లక్ష్యం కాదు, రైతుల నోటికాడ కూడును లాగేయడమేనని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు స్పందించి, తక్షణమే మాచనపల్లికి కొత్త ట్రాన్స్‌ఫార్మర్లను పంపి పనులు ప్రారంభించకపోతే, పరిస్థితి తీవ్రంగా ఉంటుంది మాడుగులపల్లి సబ్‌స్టేషన్‌ను ముట్టడించడమే కాకుండా, మండల కేంద్రంలో అధికారులను నిలదీస్తామని గ్రామస్థులు హెచ్చరిస్తున్నారు రైతుల ఆగ్రహానికి అధికారులు బలికాకముందే మేల్కోవాలని హెచ్చరిస్తున్నారు.

# మత సామరస్యానికి అందరూ తోడ్పడాలి

- శాంతియుత వాతావరణంలో బక్రీద్ వేడుకలు జరుపుకోవాలి
- అదనపు ఎస్పీ విక్రాంత్ కుమార్ సింగ్



**మెదక్ జిల్లా బ్యూరో చీఫ్, మే 2 (జనం సాక్షి) :** బక్రీద్ పండుగను శాంతియుత వాతావరణంలో, పరస్పర గౌరవభావంతో జరుపుకోవాలని మెదక్ అదనపు ఎస్పీ విక్రాంత్ కుమార్ సింగ్ పిలుపునిచ్చారు. జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు ఆదేశాల మేరకు శనివారం సాయంత్రం మెదక్ పట్టణంలో శాంతి కమిటీ సమావేశం నిర్వహించారు. వివిధ మతాల పెద్దలు, ప్రజాప్రతినిధులు, స్థానిక ప్రముఖులు సమావేశానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా అదనపు ఎస్పీ మాట్లాడుతూ, మెదక్ జిల్లా మత సామరస్యానికి ప్రతీకగా నిలుస్తోందని, ప్రతి ఒక్కరూ సోదరభావంతో మెలగాలని సూచించారు. బక్రీద్ సందర్భంగా పోలీస్ శాఖ తరఫున అన్ని భద్రతా ఏర్పాట్లు చేపట్టినట్లు తెలిపారు. సామూహిక ప్రార్థనలు, ఇతర కార్యక్రమాల సమయంలో ప్రజలు అప్రమత్తంగా ఉండి పోలీసులకు సహకరించాలని కోరారు. సామాజిక మాధ్యమాల్లో తప్పుడు ప్రచారాలు, రెచ్చగొట్టే పోస్టులు చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వదంతులను నమ్మకుండా అనుమానాస్పద సమాచారాన్ని వెంటనే పోలీసులకు తెలియజేయాలని సూచించారు. పశువుల అక్రమ రవాణా, ఇతర చట్టవ్యతిరేక కార్యకలాపాలపై కఠిన చర్యలు ఉంటాయని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో పాల్గొన్న మత పెద్దలు, ప్రజాప్రతినిధులు బక్రీద్ పండుగను ప్రశాంతంగా నిర్వహించేందుకు పోలీసులకు సంపూర్ణ సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో డీఎస్పీ ప్రసన్నకుమార్, టౌన్ ఇన్‌స్పెక్టర్ మహేష్, ఎస్ఐలు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## ఆలేరులో ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమం



**ఆలేరు, మే 2 (జనం సాక్షి) :** యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు పట్టణంలోని ఇమ్మిడి గార్డెన్స్‌లో ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా ఆలేరు నియోజకవర్గ స్థాయి సమీక్షా సమావేశం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి లితెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సమావేశంలో భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి ఎమ్మెల్సీ శ్రీ తీన్మార్ మల్లన్న మహిక కార్పొరేట్ చైర్‌పర్సన్ బండ్రు శోభారాణి , యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి తదితర ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు. కార్యక్రమం ప్రారంభంలో ఏర్పాటు చేసిన పలు ప్రభుత్వ శాఖల స్టాల్స్‌ను ప్రజాప్రతినిధులు ప్రారంభించి, జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ఆరంభించారు. అనంతరం నిర్వహించిన సమావేశంలో వివిధ సంక్షేమ పథకాల ద్వారా లబ్ధి పొందిన లబ్ధిదారులు తమ అనుభవాలను స్వయంగా వివరించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాల వల్ల తమ జీవన ప్రమాణాలు మెరుగుపడ్డాయని వారు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శ్రీ బీర్ల అయిలయ్య గారు మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం ప్రజల సంక్షేమాన్ని ముఖ్యంగా భావించి అనేక అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తున్నదని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ప్రభుత్వం అమలు చేస్తున్న రైతు భరోసా, రైతు బీమా, రేషన్ కార్డులు, సన్న బియ్యం పంపిణీ, సన్న ఒడ్లకు బోనస్, ఉచిత బస్సు సేవలు వంటి పథకాలు ప్రజలకు చేరుతున్నాయా అనే విషయాన్ని సమీక్షించినట్లు పేర్కొన్నారు. మహిళలను ఆర్థికంగా బలపరచి కోటీశ్వరులుగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యమని వెల్లడించారు. గత పదేళ్లలో అందని నిధులను ఈ రెండేళ్లలో తీసుకువచ్చామని, సంక్షేమం అనేది ధనికుల కోసం కాకుండా పేదల కోసం ఉండాలని స్పష్టం చేశారు. పార్టీ భేదాలు పక్కనబెట్టి ఆలేరు నియోజకవర్గ అభివృద్ధికి అందరూ సూచనలు ఇవ్వాలని పిలుపునిచ్చారు.

# రాష్ట్ర ప్రజల సంక్షేమమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యం

- శాసనసభ్యులు మందుల సామేలు



**తుంగతుర్తి, మే 2 (జనం సాక్షి) :** రాష్ట్ర ప్రజల సంక్షేమమే లక్ష్యంగా ప్రజా పాలన-ప్రగతి ప్రణాళిక ను ప్రభుత్వం నిర్వహిస్తుందని తుంగతుర్తి శాసనసభ్యులు మందుల సామేలు అన్నారు,.తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా శనివారం తుంగతుర్తి మండల కేంద్రంలోని డిఆర్ ఫంక్షన్ హాల్లో నియోజకవర్గ స్థాయి సమావేశం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే మందుల సామెల్ ముఖ్య అతిథిగా తెలంగాణ రాష్ట్ర రైతు సంక్షేమ కమిషన్ సభ్యులు చెవిటి వెంకన్న యాదవ్ తో కలిసి పాల్గొన్నారు.తొలుత రాష్ట్ర గీతం (జయ జయహే తెలంగాణ) ఆలపించిన అనంతరం స్వాగతో పన్యాసం చేసి జిల్లా పంచాయతీ రాజ్ శాఖ అధికారి యాదగిరి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సందేశం చదివి వినిపించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్ర ప్రజల సంక్షేమం కోసం ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక చేపట్టిందని అన్నారు, ఈ ప్రణాళికలో 99 రోజుల కార్యకరణలో భాగంగా నియోజకవర్గంలో జరిగిన అభివృద్ధి పనులు సంక్షేమ పథకాలపై సమీక్షించడం జరిగిందని అన్నారు, నియోజకవర్గస్థాయిలో ప్రజా సమస్యలను నేరుగా పరిష్కరించి ప్రభుత్వ పథకాలను ప్రజలకు చేరువ చేయడం ఈ కార్యక్రమం యొక్క ముఖ్య ఉద్దేశం అన్నారు, నియోజకవర్గ అభివృద్ధి లక్ష్యంగా పనిచేస్తున్నారని తెలిపారు, తమ ప్రభుత్వంలో ఇంటిగ్రేటెడ్ స్కూలు, వంద పడకల ఆసుపత్రి, సిసి రోడ్లు, డ్రైనేజీల ఏర్పాటు, విద్య వైద్యం కు ప్రాధాన్యత ఇస్తున్నట్లు తెలిపారు ముఖ్యంగా ప్రతి గ్రామంలో పరిసరాలు పరిశుభ్రత వైద్యం రైతు సంక్షేమ ధాన్యం కొనుగోలు తాగునీటి సరఫరాపై ప్రత్యేక దృష్టి పెట్టినట్లు తెలిపారు, ఇట్టి సమావేశానికి గైర్హాజరైన అధికారులపై చర్యలు తీసుకోవాలంటూ ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపారు, విధుల్లో నిర్లక్ష్యం వహించిన వారిపై చర్యలు తప్పు అని అన్నారు.రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన ఆరు గ్యారంటీ లు,వివిధ ప్రభుత్వ పథకాల లబ్ధిదారుల వివరాలతో కరపత్రం రూపొందించి వాటిని ప్రజలకు అందించడంతోపాటు వివిధ శాఖల అధికారులు 99 రోజుల ప్రగతి ప్రణాళికలో చేసినటువంటి కార్యక్రమాలను వివరించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి పేద మరియు మధ్యతరగతి కుటుంబానికి నేరుగా చేరేలా అధికారులు కట్టుదిట్టంగా పనిచేయాలని స్పష్టం చేశారు. ప్రజల సమస్యల పట్ల ఎలాంటి నిర్లక్ష్యం ప్రదర్శించినా సహించబోమని, అఈ సమావేశానికి డీఎస్పీ ప్రసన్న కుమార్,డిఈఓ అశోక్ కుమార్, తుంగతుర్తి మార్కెట్ కమిటీ చైర్మన్ తీగల గిరిధర్ రెడ్డి, వైస్ చైర్మన్ చింతకుంట్ల వెంకన్న, తుంగతుర్తి తహసిల్దార్ దయానందం, ఎంపీడీవో శేష్ కుమార్,నియోజకవర్గ పరిధిలోని, తాహసిల్దార్ లు, ఎంపీడీవోలు, సర్పంచులు, మున్సిపల్ చైర్మన్ లు, మార్కెట్ కమిటీ చైర్మన్ లు, పిఎసిఎస్ చైర్మన్ లు, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ లు, సిడిపిఓ శ్రీజ, ఏడిఏ రమేష్ బాబు, మున్సిపల్ కౌన్సిలర్లు, తుంగతుర్తి సింగిల్ విండో మాజీ చైర్మన్ గుడిపాటి సైదులు, జిల్లా నాయకులు రేగటి రవి,వివిధ శాఖల జిల్లా అధికారులు, వీరితోపాటు అన్ని మండలాల, డివిజన్ స్థాయి, అధికారులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, గ్రామ సర్పంచులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలి




**మణుగూరు, మే 2 (జనంసాక్షి) :** ప్రభుత్వ పథకాలు ప్రజలకు అందుబాటులో తీసుకరవటంలో అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలని పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు అన్నారు.శనివారం మణుగూరు మండలంలోని డి వి పంక్షన్ హాల్ లో స్పెషల్ ఆఫీసర్ స్వర్ణలత లేనినా అధ్యక్షతన నియోజకవర్గస్థాయి సమావేశం నిర్వహించారు.రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజాపాలన ప్రగతి ప్రణాళికల 99 రోజుల కార్యచరణలో భాగంగా తొలుత జయ జయహే తెలంగాణ గేయాన్ని ఆలపించారు. అనంతరం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సందేశాన్ని చదివి వినిపించారు. అనంతరం పినపాక నియోజకవర్గం లోని ఏడు మండలాల అధికారులు చేపట్టిన అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలను వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...ప్రజా ప్రతినిధులు, అధికారులు ప్రజా సేవే లక్ష్యంగా నియోజకవర్గ ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు సమన్వయంతో ముందుకు సాగాలని అన్నారు. ప్రజా ప్రభుత్వం అంటేనే ప్రజల కోసం పనిచేసే ప్రభుత్వమని, ప్రభుత్వ పథకాలు ప్రజల చెంతకు చేరాలంటే అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పని చేస్తేనే ప్రజలకు అభివృద్ధి ఫలాలు అందుతాయన్నారు. ప్రతి కుటుంబంలో వెలుగులు నింపాలని, మహిళలలో ఆత్మస్థైర్యం, చిరునవ్వు చూడాలని కాంగ్రెస్ ప్రభుత్వం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆలోచన అన్నారు. అందులో భాగంగానే విద్య, వైద్య రంగాలకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తుందన్నారు. నిరుపేద కుటుంబాలకు 200 యూనిట్ల ఫ్రీ విద్యుత్, 44 వేల 153 కుటుంబాలకు జీరో బిల్లు ఆర్థిక వెసులుబాటు కల్పిస్తున్నామన్నారు. వేసవి కాలం నేపథ్యంలో నియోజకవర్గంలోని 373 గ్రామాలలో తాగునీటి సమస్య తలెత్తకుండా చూడాలని అధికారులకు, ప్రజాప్రతినిధులకు ఆదేశించారు. అదేవిధంగా స్వయం సహకార సంఘాలకు రూ.9 కోట్ల 47 లక్షల విలువగల చెక్కులను ఎమ్మెల్యే పాయం పంపిణీ చేశారు. అభివృద్ధి,సంక్షేమ కార్యక్రమాలు నియోజకవర్గంలో విజయవంతంగా అమలు చేసి నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తున్నామన్నారు. భద్రాద్రి జిల్లాలోని ఐదు నియోజకవర్గాలలో పినపాక నియోజకవర్గం ముందుండాలనీ అధికారులకు, ప్రజాప్రతినిధులకు సూచించారు.

### యువత యాంటీ డ్రగ్స్ సోల్జర్‌గా మారాలి

డ్రగ్స్ మహమ్మారిని నిర్మూలించి, భావితరాలకు మంచి భవిష్యత్తు అందిద్దామని 99 రోజుల ప్రజా ప్రణాళికలు భాగంగా యువత యాంటీ డ్రగ్స్ సోల్జర్ గా మారాలి అన్నారు. డ్రగ్స్ పై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఉక్కు పాదం మోపుతున్నారని, ప్రతి యువత, పౌరుడు డ్రగ్స్ ,గంజాయి మాదక ద్రవ్యాల వల్ల వచ్చే అనర్ధాలను విస్తృతంగా అవగాహన కల్పించాలని, ఎవరైనా డ్రగ్స్ అమ్మిన తీసుకున్న 1908కి సమాచారం ఇవ్వాలని ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచడం జరుగుతుందన్నారు. ఈ నియోజకవర్గ స్థాయి సమావేశంలో స్పెషల్ ఆఫీసర్ స్వర్ణలత లెనినా, ఎంపీడీవో పల్నాటి వెంకటేశ్వర్లు, తహసిల్దార్ అద్దంకి నరేష్, అన్ని శాఖల అధికారులు,నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక చివరి వరకూ పక్కాగా అమలు చేయాలి



**దేవరకొండ, మే 2 (జనం సాక్షి) :** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక' 99 రోజుల కార్యాచరణ ప్రణాళికలో భాగంగా నియోజకవర్గ స్థాయి సమీక్షా కార్యక్రమం శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో ఎస్.రమణారెడ్డి అధ్యక్షత వహించారు. ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా వివిధ ప్రభుత్వ శాఖల ఉన్నతాధికారులు నియోజకవర్గంలో గత రెండున్నర సంవత్సరాలలో జరిగిన అభివృద్ధి పనులు, అమలవుతున్న సంక్షేమ పథకాల పురోగతిపై సమగ్ర నివేదికను సమర్పించారు. వ్యవసాయం, విద్య, వైద్యం, మిషన్ భగీరథ, ఇందిరమ్మ ఇండ్లు, రైతు భరోసా, మహాలక్ష్మి, గృహజ్యోతి, చేయూత పథకాల అమలు తీరును అధికారులు వివరించారు. అనంతరం ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి సారథ్యంలో రాష్ట్రం అభివృద్ధి, సంక్షేమంలో దేశానికే ఆదర్శంగా నిలుస్తోందని తెలిపారు. ప్రజల వద్దకే పాలన అనే లక్ష్యంతో 99 రోజుల ప్రత్యేక కార్యాచరణ ద్వారా ప్రతి గడపకు సంక్షేమ ఫలాలు అందిస్తున్నామని తెలిపారు. దేవరకొండ నియోజకవర్గంలో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం, రోడ్లు, తాగునీరు, విద్యుత్ సౌకర్యాల కల్పన వేగంగా జరుగుతోందని వివరించారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాలు అందేలా అధికారులు పారదర్శకంగా పనిచేయాలని సూచించారు.ఈ కార్యక్రమంలో ఎంపీడీఓలు, తహసీల్దార్లు, వ్యవసాయ, వైద్య, విద్య, పంచాయతీరాజ్, ఆర్అండ్‌బి, మిషన్ భగీరథ శాఖల అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు, సర్పంచులు, ఎంపీటీసీలు, జడ్పీటీసీలు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.




# బీమా రంగంలోకి 100% ఎఫ్‌డీఐలు

### నోటిపై చేసిన కేంద్రం

దిల్లీ: కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. బీమా రంగంలో నూరు శాతం విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులకు అనుమతిస్తున్నట్లు నోటిఫికేషన్ జారీ చేసింది. విదేశీ పెట్టుబడిదారులను ఆకర్షించడమే లక్ష్యంగా ఈ నిర్ణయం తీసుకుంది. ఎఫ్‌డీఐల విషయంలో ఎల్‌ఐసీకి మినహాయింపు ఇచ్చింది. ఆ సంస్థలోకి గరిష్ఠంగా 20 శాతం మాత్రమే ఎఫ్‌డీఐలు అనుమతించేలా పరిమితి విధించింది.ప్రస్తుతం బీమా సంస్థల్లో 74 శాతం వరకు మాత్రమే విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులకు అవకాశం ఉంది. ఇకపై విదేశీ సంస్థలు భారతీయ భాగస్వామి లేకుండానే 100 శాతం పెట్టుబడితో బీమా వ్యాపారంలోకి అడుగుపెట్టొచ్చు. అయితే, ఈఆఎ పొందే కంపెనీలు బీమా, సంబంధిత కార్యకలాపాలను నిర్వహించడానికి భారతీయ బీమా నియంత్రణ, అభివృద్ధి సంస్థ (ఎఖీఆంఎ) నుంచి అవసరమైన లైసెన్స్ తప్పనిసరిగా పొందాలి అని కేంద్రం తన నోటిఫికేషన్‌లో పేర్కొంది. కంపెనీలో కీలక పదవులైన ఛైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ లేదా సీఈఓలో కనీసం ఒక్కరైనా భారతీయ పౌరుడై ఉండాలన్న నిబంధననూ పొందుపరిచారు.



# సరైన ప్రణాళికతో క్రెడిట్ కార్డు మేలే

న్యూఢిల్లీ:క్రెడిట్ కార్డులను ఉపయోగించే వారి సంఖ్య ఎప్పటికప్పుడు పెరుగుతూనే ఉంది. చాలా మందిని నగదు రహిత ఆర్థిక వ్యవస్థవైపు అడుగులు వేయించడంలో క్రెడిట్ కార్డులు కీలక పాత్ర పోషిస్తున్నాయి. అయితే, వీటిపై ఉన్న కొన్ని అపోహల కారణంగా చాలా మంది వీటికి దూరంగా ఉండి, కార్డు కోసం దరఖాస్తు చేసుకోవడానికి వెనుకాడుతున్నారు. కాబట్టి, క్రెడిట్ కార్డులకు సంబంధించిన కొన్ని కీలక విషయాలను అందరూ తెలుసుకోవడం వల్ల వీటిపై ఉన్న భయాలు తొలగించుకోవచ్చు. ఇంకా, ఈ కార్డులకు సంబంధించిన కొన్ని కీలక అపోహలను నివృత్తి చేసుకుంటే, కార్డు వినియోగదారులు తమ క్రెడిట్ స్కోరును మెరుగుపర్చుకునే అవకాశముంది. కొన్ని కీలకమైన క్రెడిట్ కార్డు అపోహల గురించి ఇక్కడ తెలుసుకుందాం.క్రెడిట్ కార్డును తీసుకుని వినియోగించడం అంటే రుణం తీసుకోవడమే కదా. ఇలా రుణాలు తీసుకోవడం వల్ల క్రెడిట్ స్కోరు తగ్గుతుందనేదొక సాధారణ అపోహ. ఇది నిజం కాదు. వ్యక్తులు తమ క్రెడిట్ స్కోరును పెంచుకోవడానికి వేసే మొదటి అడుగు క్రెడిట్ కార్డును తీసుకోవడం, దాన్ని వినియోగించడం. అయితే, కార్డును వినియోగించి రుణాలు తీసుకుని, దాన్ని గడువులోపు చెల్లించినప్పుడు స్కోరు పెరుగుతుంది గానీ, తగ్గదు. ఇంకా, భవిష్యత్తులో మరిన్ని రుణాలు పొందేలా కూడా కార్డు పరోక్షంగా ఉపయోగపడుతుంది.క్రెడిట్ కార్డు..మీ బకాయిలను సమయానికి చెల్లించనప్పుడు క్రెడిట్ స్కోర్‌ను దెబ్బతీస్తుంది. కొంత మంది తమ విపరీతమైన ఖర్చుల కారణంగా క్రెడిట్ కార్డులను ఎక్కువగా వినియోగించి, చెల్లింపులు సరిగ్గా చేయకుండా, ఆపై తమ దుస్థితికి కార్డును నిందిస్తారు. ఇది కొత్తగా



క్రెడిట్ కార్డ్ తీసుకునే వారిని భయపెట్టి, చివరికి వారు ఆ కార్డులకు దూరంగా ఉండేలా చేస్తుంది.ఆర్థిక క్రమశిక్షణ లేని కొంతమంది చేసే రుణాల కారణంగా క్రెడిట్ కార్డ్ తీసుకోవడానికి భయపడకండి. ఆర్థిక క్రమశిక్షణ ఉండాలే కానీ, క్రెడిట్ కార్డు పూర్తిగా మీ నియంత్రణలో ఉంటుంది. ఇది మీకు రివార్డ్ పాయింట్లు, ఖర్చు చేసినందుకు క్యాష్‌బ్యాక్‌ను సంపాదించిపెట్టే విలువైన సాధనం కూడా. వీటితో ఖరీదైన వస్తువులను సైతం కొనుగోలు చేసి సులభమైన ఇఓఎలలో తిరిగి చెల్లించవచ్చు. మీరు క్రెడిట్ కార్డును గరిష్ఠ పరిమితి వరకు వాడేస్తారని భయముంటే, తక్కువ పరిమితి ఉన్న కార్డును తీసుకోండి. ఇది మీ ఖర్చులను అదుపులో ఉంచుతుంది.క్రెడిట్ కార్డుల గురించి మరో ఆసక్తికరమైన అపోహ కూడా ఉంది. ఎక్కువ ఉపయోగించని పాత క్రెడిట్ కార్డులు మీ క్రెడిట్ స్కోరును దెబ్బతీస్తాయనేది ఒక సాధారణ అపోహ. ఇది అవాస్తవం. వాస్తవానికి, ఈ విషయంలో అవి ఉండడమే మంచిది. మీ క్రెడిట్ కార్డుపై చెల్లించని బకాయి ఉన్నప్పుడు మాత్రమే మీ క్రెడిట్ స్కోరుపై ప్రభావం పడుతుంది. మీ పాత క్రెడిట్ కార్డులను రద్దుచేయకపోవడమే మంచిది. మీ క్రెడిట్ ఖాతా ఎంత పాతదైతే, మీ క్రెడిట్ హిస్టరీకి అంత ఎక్కువ విలువ పెరుగుతుంది. ఉదాహరణకు, మీరు బ్యాంకులను రుణం గురించి అడిగినప్పుడు, వారు మీ క్రెడిట్ హిస్టరీని చూస్తారు. కొత్త ఖాతాల కంటే, దీర్ఘకాలంగా నడుస్తున్న, చక్కగా నిర్వహణలో ఉన్న క్రెడిట్ ఖాతాలు మీ రుణ అర్హత గురించి ఎక్కువగా

# ఐపీ హక్కుల పరిరక్షణకు ప్రాధాన్య పర్యవేక్షణ జాబితాలో భారత్

### వియత్నాంపై కఠిన నిఘా: యూఎస్‌టీఆర్

వాషింగ్టన్: మేధో సంపత్తి (ఐపీ) హక్కుల పరిరక్షణ, అమలు విషయంలో తమకు తీవ్ర ఆందోళన కలిగిస్తున్న దేశాల్లో భారత్ ఒకటని యూఎస్ ట్రేడ్ రిప్రజెంటేటివ్ (యూఎస్‌టీఆర్) ప్రకటించింది. 6 దేశాలతో 'ప్రాధాన్య పర్యవేక్షణ జాబితా'ను యూఎస్‌టీఆర్ విడుదల చేసిన ప్రత్యేక నివేదికలో వెల్లడించింది. ఇందులో భారత్, చైనా, ఇండొనేషియా, చిలీ, రష్యా, వెనెజువెలా ఉన్నాయి. ప్రాధాన్య దేశం (పీఎఫ్‌సీ)గా వియత్నాంను పేర్కొంది. దీని ప్రకారం.. ఐపీల విషయంలో వియత్నాంపై కఠిన నిఘాను యూఎస్ పెట్టనుంది. పీఎఫ్‌సీ విభాగంలో గత 13 ఏళ్లలో ఒక దేశానికి చోటు దక్కడం ఇదే తొలిసారి. అమెరికా ఉత్పత్తులపై అత్యంత ప్రతికూల ప్రభావం చూపేలా ఐపీ సంబంధిత చర్యలు, విధానాలు, పద్ధతులు ఉన్న దేశాల కోసం పీఎఫ్‌సీ గుర్తింపు కేటాయించినట్లు యూఎస్‌టీఆర్ తెలిపింది. ఐపీ హక్కుల పరిరక్షణ విషయంలో చర్చలు జరిపేందుకు, చర్చల్లో గణనీయ పురోగతి సాధించేందుకు వియత్నాం నుంచి సరైన స్పందన ఉండటం లేదని వెల్లడించింది. కృత్రిమ మేధ పరిరక్షణ, అమలు విషయంలో అమెరికాలోని వ్యక్తులకు సమస్యలు ఎదురవుతున్న దేశాలను ప్రాధాన్య పర్యవేక్షణ జాబితాలో యూఎస్‌టీఆర్ చేరుస్తుంది. అనైతిక వాణిజ్య విధానాలకు అడ్డుకట్ట వేసేందుకు అన్ని రకాల ఆయుధాలను ఉపయోగించడమే తమకు అత్యంత ప్రాధాన్యమని యూఎస్‌టీఆర్ తెలిపింది.

## గుడ్ల ధరలు

| హైదరాబాద్ | వరంగల్ |
|---|---|
| ₹ 5.25 | ₹ 5.27 |

## బంగారం ధరలు (10 గ్రాములు)

హైదరాబాద్

| ₹ 1,37,900 | ₹ 1,50,440 |
|---|---|
| (22 క్యారెట్లు) | (24 క్యారెట్లు) |

## వెండి ధరలు (కేజీ)

హైదరాబాద్

₹ 2,65,000

# విమాన ఇంధన ధర పెరిగింది

- అంతర్జాతీయ సర్వీసులకు మాత్రమే
- దేశీయ విమానాలు /ప్రయాణికులకు ఊరట

న్యూఢిల్లీ:ముడిచమురు అంతర్జాతీయ ధరలకు అనుగుణంగా విమాన ఇంధన (ఏటీఎఫ్) ధరలను శుక్రవారం మళ్లీ సవరించారు. అయితే దేశీయ విమాన సర్వీసులకు మాత్రం ఈ పెరుగుదల వర్తించదు. దీనివల్ల దేశీయ విమాన మార్గాల్లో ప్రయాణించే వారికి టికెట్ ధరల పెంపు భారం నుంచి ఉపశమనం లభిస్తుంది. అంతర్జాతీయ విమాన సర్వీసులకు మాత్రమే ఏటీఎఫ్ ధరలను పెంచారు. ఇందువల్ల విదేశాలకు వెళ్లి, వచ్చే వారికి మాత్రం టికెట్ ధరలు మరింత భారమవుతాయి.అంతర్జాతీయ సర్వీసులకు ఏటీఎఫ్ కిలోలీటరు ధరను 1,435.31 డాలర్ల నుంచి 76.55 డాలర్లు (5.33%) పెంచి 1511.86 డాలర్లు (రూ.1,43,385) చేస్తున్నట్లు ప్రభుత్వరంగ చమురు మార్కెటింగ్ సంస్థలు శుక్రవారం ప్రకటించాయి. దేశీయ విమాన సర్వీసులకు మాత్రం కిలోలీటరు ఏటీఎఫ్ ధర మార్పు లేకుండా రూ.1,04,927.18గానే ఉంటుంది. 'దేశీయ విమానయాన సంస్థలు తీవ్ర ఆర్థిక ఒత్తిడిలో ఉన్నాయని, ఏటీఎఫ్ ధరల రూపేణ ఉపశమనం కల్పించాలని' ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఎయిర్‌లైన్స్ (ఎఫ్ఐఏ) ప్రభుత్వానికి ఇప్పటికే విజ్ఞప్తి చేసింది కూడా. ఏటీఎఫ్ ధర వ్యాట్ ఆధారంగా వేర్వేరు రాష్ట్రాల్లో భిన్నంగా ఉంటోంది. అంతర్జాతీయ విమాన సర్వీసులకు ఏటీఎఫ్ ధరను ఏప్రిల్ 1న రెట్టింపు చేసి 1435.31 డాలర్లుగా చమురు సంస్థలు ప్రకటించాయి. అప్పుడు కూడా దేశీయ సంస్థలకు మాత్రం ఈ పెంపును 25 శాతానికే పరిమితం చేశాయి. ఇందువల్ల దేశీయంగా సర్వీసులు నిర్వహించే ఇండిగో, ఎయిరిండియా, స్పైస్‌జెట్, ఆకాశ ఎయిర్ వంటి సంస్థలకు కాస్త ఊరట కలిగింది. విమానయాన సంస్థల నిర్వహణ వ్యయంలో దాదాపు 40% వాటా ఏటీఎఫ్‌దే కావడం ఇందుకు నేపథ్యం.

అంతర్జాతీయంగా సరఫరా సమస్యలూ

ప్రపంచవ్యాప్తంగా ఏటీఎఫ్ సరఫరా సమస్యను విమానయాన సంస్థలు ఎదుర్కొంటున్నాయి. అంతర్జాతీయ చమురు సరఫరాలో 20% జరిగే హర్మూజ్ జలసంధిలో, చమురు ట్యాంకర్ల రవాణాకు తీవ్ర ఆటంకాలు ఎదురవుతుండటం ఇందుకు నేపథ్యం. దేశీయంగా ఏటీఎఫ్ ధరలను రెండు దశాబ్దాల క్రితమే నియంత్రణ పరిధి నుంచి తప్పించి, అంతర్జాతీయ ముడిచమురు ధరలకు అనుగుణంగా నిర్ణయిస్తున్నారు. అయితే పశ్చిమాసియా యుద్ధం నేపథ్యంలో ముడిచమురు బ్యారెల్ ధర 70 డాలర్ల నుంచి 125 డాలర్లకు చేరడం, ఈ పెరుగుదల భారాన్ని ఏటీఎఫ్‌పైకి బదిలీ చేస్తే దేశీయ విమానయాన సంస్థలు - ప్రయాణికులు కూడా తీవ్రంగా ఇబ్బంది పడతారు కనుక.. తదనుగుణంగా ధరల పెంపులో జాగురూకతతో వ్యవహరించాలని ప్రభుత్వం, ప్రభుత్వరంగ చమురు మార్కెటింగ్ సంస్థలు నిర్ణయించాయి. టెలికాం సిగ్నల్ టవర్ల వంటి పారిశ్రామిక అవసరాలకు వినియోగించే బల్క్ డీజిల్ లీటరు ధరను రూ.137 నుంచి రూ.149 చేశారు. వాహన వినియోగదారులకు పెట్రోల్ బంకుల్లో రిటెయిల్‌గా లీటరు డీజిల్‌ను రూ.95కే విక్రయిస్తుండటం గమనార్హం. దేశంలోని డీజిల్ వినియోగంలో బల్క్ డీజిల్ వాటా 1% లోపే ఉంటుందని ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ తెలిపింది. డీజిల్ ఎగుమతిపై సుంకాన్ని లీటరుకు రూ.55.50 నుంచి రూ.23కు, ఏటీఎఫ్‌పై లీటరుకు రూ.42 నుంచి రూ.33కు తగ్గిస్తున్నట్లు ఆర్థిక శాఖ శుక్రవారం తెలిపింది. పెట్రోల్-డీజిల్ రిటెయిల్ ధరలతో పాటు దేశీయ విమాన ప్రయాణానికి ఏటీఎఫ్ ధరను సవరించనందున.. ప్రభుత్వరంగ ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ (ఐఓసీ), భారత్ పెట్రోలియం కార్పొరేషన్ (బీపీసీఎల్), హిందుస్థాన్ పెట్రోలియం కార్పొరేషన్ (హెచ్‌పీసీఎల్)కు నష్టాలు తప్పవు.

# ఆకలి యుద్ధం



## ప్రమాదంలో వెయ్యి కోట్ల భోజనాలు

## ప్రపంచాన్ని అతలాకుతలం చేయనున్న ఎరువుల సంక్షోభం

న్యూఢిల్లీ:హర్మూజ్ జలసంధి మూతపడటంతో చమురే కాకుండా ఎరువుల సరఫరాపైనా పెను ప్రభావం చూపుతోంది. ప్రపంచవ్యాప్తంగా జరిగే ఎరువుల వ్యాపారంలో (యూరియా, పొటాష్, అమ్మోనియా, ఫాస్ఫేట్) మూడింట ఒక వంతు ఈ మార్గం నుంచే జరుగుతోంది. ఇప్పుడు ఈ మార్గం మూసుకుపోవడంతో రానున్న రోజుల్లో ఆహార ఉత్పత్తి గణనీయంగా పడిపోనుందన్న ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి.ఇరాన్ యుద్ధం ప్రారంభమైన తర్వాత ఎరువుల ధరలు 80 శాతం వరకు పెరిగాయి. ప్రస్తుత ఉద్రిక్త పరిస్థితులిలానే కొనసాగితే రానున్న రోజుల్లో ప్రపంచ ఆహార భద్రతకు పెనుముప్పు వాటిల్లే అవకాశాలున్నాయి. తత్ఫలితంగా వారానికి దాదాపు 1000 కోట్ల భోజనాల(మీల్స్)కు ముప్పు తప్పదని, నిరుపేద దేశాలకు ఇది శరాఘాతమేనని ప్రపంచ ప్రఖ్యాత ఎరువుల కంపెనీల అధిపతుల్లో ఒకరైన స్వీన్ టోర్ హల్‌సెథర్ హెచ్చరిస్తున్నారు. ఎరువుల రవాణాను ఆపేయడమంటే ఒకరకంగా ఆహారంపై యుద్ధం ప్రకటించడమేనని, ధనిక, పేదల మధ్య మరింత అంతరాన్ని పెంచడమేనని 'యారా' ఎరువుల కంపెనీ చీఫ్ ఎగ్జిక్యూటివ్ అయిన స్వీన్ అభిప్రాయపడ్డారు. సంపన్న దేశాల్లోనూ ఆహార ధరలు మండిపోవచ్చునని ఆయన 'బీబీసీ' ఇంటర్వ్యూలో చెప్పారు.ప్రస్తుత సంక్షోభ పరిస్థితుల్లో దాదాపు 5 లక్షల టన్నుల నత్రజని ఎరువును ఉత్పత్తి చేయలేకపోతున్నామని స్వీన్ వివరించారు. నత్రజని వేయకపోతే పంటకాలం తొలిసీజన్‌లో దాదాపు 50 శాతం దిగుబడి తగ్గిపోతుందని విశ్లేషించారు. ఆసియా, ఆగ్నేయాసియా, లాటిన్ అమెరికా, ఆఫ్రికా దేశాలు దీనివల్ల తీవ్రంగా నష్టపోతాయని చెప్పారు. వారానికి వెయ్యికోట్ల భోజనాల్ని ఉత్పత్తిచేయలేకపోతే పేద దేశాల్లో ఆహార సంక్షోభం తప్పదన్నారు. ఎరువులు ఎక్కువగా నిల్వచేసుకున్న దేశాలకు తాత్కాలికంగా ఉపశమనం కలిగినా.. యుద్ధం దీర్ఘకాలం కొనసాగితే వాటికీ ముప్పు తప్పదని సింగపూర్‌లో ఆహార భద్రత సీనియర్ పరిశోధకులు ప్రొఫెసర్ పాల్ తేంగ్ అభిప్రాయపడ్డారు.



# తాంపా.. 107 ఏళ్లకు దొరికింది

న్యూఢిల్లీ:ఇక్కడ కనిపిస్తున్న నౌక మొదటి ప్రపంచ యుద్ధం నాటిది. 107 ఏళ్ల తర్వాత బ్రిటన్‌లోని కార్న్‌వాల్ తీరానికి 80 కిలోమీటర్ల దూరంలో.. అట్లాంటిక్ సముద్రం అడుగున 300 అడుగుల లోతులో బ్రిటిష్ గజ ఈతగాళ్లు ఈ నౌక శిథిలాలు గుర్తించారు. ఎవరిదీ నౌక? ఎలా మునిగింది అని ఒక్కసారి చరిత్రలోకి వెళ్తే.. మొదటి ప్రపంచ యుద్ధం జోరుగా సాగుతున్న 1918 సెప్టెంబరు 17న అమెరికా కోస్ట్‌గార్డ్ కట్టర్ నౌక 'తాంపా' అట్లాంటిక్ జలాల్లో ప్రయాణం ప్రారంభించింది. నౌక బాయిలర్లకు శక్తిని అందించే బొగ్గు 26వ తేదీ నాటికి దాదాపు అయిపోవచ్చింది. బొగ్గును మళ్లీ నింపుకోవడం కోసం నౌకను కాన్వాయ్ నుంచి బయటికి తీసుకువెళతానని కెప్టెన్ ఉన్నతాధికారులకు విజ్ఞప్తిచేశారు. అందుకు కమాండర్లు అనుమతించడంతో నౌకను వేల్స్‌లోని ఒక రేవు వైపు కెప్టెన్ వేగంగా నడుపుతున్నారు.దాన్ని అదేరోజు రాత్రి 8.15 గంటల సమయంలో జర్మనీ జలాంతర్గామి యూబీ-41 గమనించింది. జలాంతర్గామి కెప్టెన్ టార్పెడోతో పేల్చివేతకు మీట నొక్కారు. ఈ పేలుడుకు తోడు, బొగ్గు ధూళి కూడా మండటంతో నౌక మునిగింది. అందులోని 131 మంది సైనికులు, సిబ్బంది నీట మునిగిపోయారు. మొదటి ప్రపంచ యుద్ధంలో అమెరికాకు జరిగిన అతిపెద్ద నౌకాదళ నష్టం ఇది. నౌక శిథిలాల కోసం అన్వేషణ బృందాలు శోధిస్తూనే ఉన్నాయి.

# ఆస్కార్‌ను 'ఆయుధం'గా భావించి.. విమానం కార్గోలోకి ఎక్కిస్తే.. తీరా..!



మాస్కో:రష్యాకు చెందిన ఓ ఆస్కార్ విజేతకు చేదు అనుభవం ఎదురైంది. ఆయన ఆస్కార్ అవార్డును ఆయుధంగా భావించిన విమానాశ్రయ సెక్యూరిటీ సిబ్బంది.. దాన్ని ఆయనతోపాటు విమానం లోపలికి తీసుకెళ్లేందుకు అనుమతించలేదు. చివరకు విమాన కార్గోలో దాన్ని ఎక్కించగా.. తీరా గమ్యస్థానానికి చేరుకున్న తర్వాత అది కనిపించకుండా పోవడం గమనార్హం. ఎట్టకేలకు దాని ఆచూకీ కనిపెట్టినట్లు విమానయాన సంస్థ ప్రకటించింది .రష్యాకు చెందిన ఫిల్మ్‌మేకర్ పాషా తాలాన్కిన్.. అనే డాక్యుమెంటరీకి కో-డైరెక్టర్‌గా వ్యవహరించారు. ఈ ఏడాది ఈ డాక్యుమెంటరీకి ఆస్కార్ గెలుచుకున్నారు. ఇటీవల ఆయన లుఫ్తాన్సా విమానంలో జర్మనీలోని ఫ్రాంక్‌ఫర్ట్‌కు వెళ్లేందుకుగానూ న్యూయార్క్‌లోని జేఎఫ్‌కే ఎయిర్‌పోర్టుకు చేరుకున్నారు. అయితే, ఆయన ఆస్కార్ విగ్రహాన్ని ఆయుధంగా భావించి దాన్ని విమానంలోకి తనవెంట తీసుకెళ్లేందుకు సెక్యూరిటీ అనుమతించలేదు. దీంతో ఆ అవార్డును ఓ డబ్బాలో పెట్టి.. కార్గోలో ఎక్కించారు.అయితే, ఫ్రాంక్‌ఫర్ట్‌కు చేరుకున్న అనంతరం ఆ డబ్బా కనిపించకపోవడంతో ఆయన హతాశుడయ్యారు. తాను ఈ పురస్కారంతో అనేకసార్లు విమానంలో ప్రయాణించానని.. ఎప్పుడూ ఇలాంటి అనుభవం ఎదురుకాలేదని మీడియా ఎదుట వాపోయారు. అయితే రెండు రోజులకే ఆ అవార్డు దొరికిందని లుఫ్తాన్సా ఎయిర్‌లైన్స్ ప్రకటించింది. దాన్ని వీలైనంత త్వరగా ఆయనకు అప్పగిస్తామని తెలిపింది. ఈ ఘటనపై ఆయనకు క్షమాపణలు చెప్పినట్లు వెల్లడించింది. ఏం జరిగిందో తెలుసుకునేందుకు అంతర్గత విచారణను చేపట్టినట్లు పేర్కొంది.గతంలో ఉపాధ్యాయుడిగా పనిచేసిన తాలాన్కిన్.. ప్రస్తుతం ప్రవాస జీవనం గడుపుతున్నారు. ఉక్రెయిన్‌పై రష్యా దండయాత్ర అనంతరం స్థానిక పాఠశాలల్లో జాతీయవాద, సైనికపరమైన పాఠ్యప్రణాళికను అమలు చేయాలన్న క్రెమ్లిన్ ఆదేశాన్ని ఆయన ధిక్కరించడమే దీనికి కారణం. డేవిడ్ బోరెన్‌స్టైన్ దర్శకత్వంలో, తాలాన్కిన్ కో-డైరెక్టర్‌గా ఆ డాక్యుమెంటరీ రూపొందింది. సమాజంలో గుర్తింపుపొందిన ఉపాధ్యాయుడి నుంచి.. సొంత దేశంలోనే బహిష్కరణకు గురైన వ్యక్తిగా మారిన ఆయన ప్రయాణాన్ని అందులో తెరకెక్కించారు.

# నేడే 'నీట్'

ఉదయం 6గంటల నుంచి సాయంత్రం 6గంటల వరకు బీఎన్ఎస్ఎస్‌లోని 163 సెక్షన్ (గతంలో 144 సెక్షన్) అమలులో ఉంటుందని అధికారులు ప్రకటించారు. ఈ మేరకు ఓ పబ్లిక్ నోటీసును విడుదల చేశారు. పరీక్షా కేంద్రానికి 200 మీటర్ల పరిధిలో ఐదుగురు అంతకన్నా ఎక్కువ మంది గుమిగూడటం నిషిద్ధమని నోటీసుల్లో పేర్కొన్నారు. అలాగే, పరీక్ష కేంద్రానికి 100 మీటర్ల పరిధిలో జిరాక్స్, ఇంటర్నెట్ సెంటర్లు మూసి ఉంటాయని తెలిపారు. ఈ పరీక్ష సజావుగా జరిగేందుకు ప్రజలు సహకరించాలని సైబరాబాద్ పోలీస్ కమిషనర్ డా. ఎం. రమేశ్ విజ్ఞప్తి చేశారు. ఈ ఆదేశాలను ఎవరైనా ఉల్లంఘిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. వైద్య విద్యా కోర్సుల్లో ప్రవేశాల కోసం దేశ వ్యాప్తంగా జరిగే ఈ పరీక్షకు దాదాపు 22.79లక్షల మందికి పైగా విద్యార్థులు హాజరు కానున్నారు. ఆదివారం మధ్యాహ్నం 2గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు జరిగే ఈ పరీక్ష కోసం విద్యార్థులు అరగంట ముందుగానే పరీక్షా కేంద్రాల వద్దకు చేరుకోవాలని ఇప్పటికే ఎన్‌టీఏ అధికారులు సూచించారు. మధ్యాహ్నం 1.30గంటలు దాటితే పరీక్షా కేంద్రం గేట్లు మూసివేస్తారని తెలిపారు. అలాగే, ఆదివారం పలు చోట్ల వర్షం కురిసే అవకాశం ఉన్నందున తదనుగుణంగా విద్యార్థులు ఏర్పాట్లు చేసుకోవాలంటూ ఎన్‌టీఏ శనివారం ఓ అడ్వైజరీ జారీ చేసింది. అడ్మిట్ కార్డు, ఫొటో గ్రాఫ్‌లు తడిసిపోకుండా ఉండేందుకు ట్రాన్స్‌పరెంట్ పౌచ్‌లను వాడాలని సూచించింది. వాతావరణం, ట్రాఫిక్ పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని పరీక్షా కేంద్రం వద్ద గేటు మూసివేయడానికి ముందే చేరుకొనేలా ప్లాన్ చేసుకోవాలని తెలిపింది.

# గ్లోబల్ బిజినెస్ హబ్‌గా తెలంగాణ

ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. వ్యాపారులు, ఎగుమతిదారులు, విద్యార్థులు పెద్ద ఎత్తున ఈ కార్యక్రమంలో పాల్గొని అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమాన్ని రూపకల్పన చేసి ముందుకు తీసుకెళ్తున్న సందీప్ కుమార్ ను ఈ సందర్భంగా మంత్రి అభినందిస్తూ, తెలంగాణ ప్రతిభను ప్రపంచానికి చేర్చే మంచి ప్రయత్నమని ప్రశంసించారు. ఈ సిరీస్‌లో భాగంగా మొదటి అంతర్జాతీయ మిషన్ సింగపూర్‌లో మే 21 నుంచి 24 వరకు నిర్వహించనున్నారు. ఈ పర్యటనలో వ్యాపార అవకాశాలు, భాగస్వామ్యాలు, అంతర్జాతీయ నెట్‌వర్కింగ్, మార్కెట్ అవగాహనపై ప్రత్యేకంగా దృష్టి సారించనున్నారు. తదుపరి దశలో ఇతర దేశాల్లో కూడా ఇలాంటి మిషన్లు నిర్వహించి ఈ కార్యక్రమాన్ని గ్లోబల్ సిరీస్‌గా విస్తరించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఎక్స్‌ప్లోర్ టు ఎక్స్‌పాండ్ (ఇ2ఇ) అనేది అంతర్జాతీయ మార్కెట్లను పరిచయం చేసే ఒక సమగ్ర కార్యక్రమం. ఇందులో బిజినెస్ డెలిగేషన్లు, ఎగుమతి ప్రోత్సాహక పర్యటనలు, విద్యార్థుల గ్లోబల్ ఎక్స్‌పోజర్ ప్రోగ్రామ్‌లు, ఇంటర్న్‌షిప్ అవకాశాలు, వ్యూహాత్మక నెట్‌వర్కింగ్ కార్యక్రమాలు నిర్వహించబడతాయి. ఈ వేదిక స్థానిక ప్రతిభను అంతర్జాతీయ అవకాశాలతో అనుసంధానించే వంతెనగా పనిచేస్తుంది.

# ఆ నగరం కుంగిపోతోంది

మెక్సికో సిటీ :సరైన ప్రణాళిక లేని నగర విస్తరణ వల్ల కలిగే విపరిణామాలకు ఇది నిదర్శనం. మెక్సికో రాజధాని అయిన మెక్సికో సిటీ అసాధారణ స్థాయిలో కుంగుతోంది. ఇది ఎంత తీవ్రంగా ఉందంటే.. రోదసి నుంచి కూడా ఈ పరిణామం కనిపించింది. భూకక్ష్యలో పరిభ్రమిస్తున్న భారత్, అమెరికా సంయుక్త ఉపగ్రహం 'నైసార్' దీన్ని పసిగట్టింది. ఈ నగరం ఏటా 10 అంగుళాల మేర కుంగుతోందని అది పంపిన చిత్రం స్పష్టంచేస్తోంది. దీంతో ప్రపంచంలోనే అత్యంత వేగంగా కుంగిపోతున్న మహానగరాల్లో ఒకటిగా మెక్సికో సిటీ నిలిచింది. ఎక్కువ జనాభా కలిగిన నగరాల్లో మెక్సికో సిటీ కూడా ఒకటి. దీని విస్తీర్ణం 7,800 చదరపు కిలోమీటర్లు కాగా.. 2.2 కోట్ల మంది ఇక్కడ ఉంటున్నారు. ఈ నగరం, దాని చుట్టుపక్కల ప్రాంతాన్ని ఒక పురాతన సరస్సు గర్భంపై నిర్మించారు. ఇక్కడి ముఖ్యమైన వీధులు ఒకప్పటి కాలువలు. ఈ ప్రాంతంలో నగర విస్తరణ, భూగర్భజలాలను విపరీతంగా తోడేయడం వల్ల నేలలోని జలాశయ గర్భం కిందికి పోతోంది. దీంతో శతాబ్ద కాలంగా



నగరం కుంగుతోంది. ఫలితంగా పురాతన భవనాలు ఒకపక్కకు ఒరిగిపోయినట్లు కనిపిస్తున్నాయి. కుంగుదల వల్ల మెక్సికో సిటీలోని సబ్‌వేలు, మురుగునీటి పారుదల వ్యవస్థలు, ఇళ్లు, వీధులు దెబ్బతింటున్నాయి. శతాబ్ద కాలంలో 39 అడుగుల మేర నగరం కుంగినట్లు శాస్త్రవేత్తలు చెబుతున్నారు.

# ఛత్తీస్‌గఢ్‌లో పేలిన మందుపాతర..

శనివారం జవాన్లు మందుపాతరల తొలగింపు (డీ - మైనింగ్) చేపట్టారు. ఈ క్రమంలో రోడ్డుపై అమర్చిన మందుపాత ˊరను తొలగిస్తుం డగా.. ప్రమాదవశాత్తు అది పేలింది. ఈ ఘటనలో కాంకేర్ డీఆర్జీకి చెందిన ఇన్‌స్పెక్టర్ శుక్రామ్ వట్టి, కానిస్టేబుళ్లు కృష్ణ కొమర, సంజయ్ గట్పల్లి సంఘటన స్థలంలోనే మృతి చెందారు. గాయపడిన కానిస్టేబుల్ పరమానంద్ కుమార్‌ను ఆస్పత్రికి తరలించగా.. చికిత్స పొందుతూ ప్రాణాలు కోల్పోయాడు. ఈ మేరకు బస్తర్ ఐజి సుందర్ రాజ్ ఈ ఘటనను ధ్రువీకరించారు.

# ప్రజా పాలనతో సంక్షేమం-అభివృద్ధి రెండింటికీ వేగం

- వనపర్తిలో ఘనంగా నియోజకవర్గ స్థాయి సభ
- రైతులు, మహిళలకు భారీ లబ్ధి వివరాలు వెల్లడి
- ప్రతి కుటుంబానికి పథకాలు చేరాలనే లక్ష్యం
- యువత, విద్య, క్రీడలకు ప్రాధాన్యం



**వనపర్తి బ్యూరో మే2 జనంసాక్షి :**
ప్రజా ప్రభుత్వ లక్ష్యం సంక్షేమం, అభివృద్ధి రెండింటినీ సమానంగా ముందుకు తీసుకెళ్లడమేనని రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు డాక్టర్ జిల్లెల్ల చిన్నారెడ్డి పేర్కొన్నారు. శనివారం వనపర్తి పట్టణంలోని దాచా లక్ష్మయ్య ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక నియోజకవర్గ స్థాయి కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. కార్యక్రమానికి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి, రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ చైర్మన్ కొత్తకాపు శివసేనారెడ్డి హాజరయ్యారు. తెలంగాణ గీతంతో సభ ప్రారంభమై, ముఖ్యమంత్రి సందేశాన్ని చదివి వినిపించారు.
ప్రజా ప్రభుత్వం ఏర్పడిన తర్వాత వనపర్తి నియోజకవర్గంలో రైతులకు, మహిళలకు, పేదలకు విస్తృతంగా లబ్ధి చేకూరిందని అధికారులు వివరించారు. రైతు రుణమాఫీ కింద వేలాది మంది రైతులకు కోట్ల రూపాయలు మంజూరు చేయడంతో పాటు, రైతు భరోసా ద్వారా పెట్టుబడి సాయం అందించారని తెలిపారు. ఖరీఫ్ సీజన్‌లో ధాన్యం కొనుగోళ్లకు సంబంధించిన మొత్తాన్ని రైతుల ఖాతాల్లో జమ చేసినట్లు వెల్లడించారు. కొత్త రేషన్ కార్డుల జారీ, గృహజ్యోతి పథకం ద్వారా ఉచిత విద్యుత్తు, ఇందిరమ్మ ఇళ్ల మంజూరు వంటి పథకాల ద్వారా పేదల జీవనోపాధి మెరుగుపడింద న్నారు. డాక్టర్ చిన్నారెడ్డి మాట్లాడుతూ, ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక ద్వారా గ్రామ, మండల స్థాయి కార్యక్రమాలు ఇప్పటికే విజయవంతంగా నిర్వహిం చామని, తదుపరి జిల్లాస్థాయి, రాష్ట్రస్థాయి కార్యక్రమాలు కూడా నిర్వహించనున్నట్లు తెలిపారు. ఆరోగ్యం, రహదారి భద్రత, పరిశుభ్రత వంటి అంశాలపై ప్రజల్లో అవగాహన పెంచుతున్నామని చెప్పారు. సమాజంలో పెరుగుతున్న డ్రగ్స్ సమస్యపై అప్రమత్తంగా ఉండాలని, యువత క్రీడల వైపు దృష్టి సారించాలని సూచించారు. ప్రభుత్వ పాఠశాలల్లో సౌకర్యాలు మెరుగుప రుస్తున్నామని, విద్యార్థులకు బ్రేక్‌ఫాస్ట్ పథకాన్ని కూడా అందుబాటులోకి తీసుకురానున్నట్లు తెలిపారు.
ఎమ్మెల్యే మేఘారెడ్డి మాట్లాడుతూ, ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత సంక్షేమ కార్యక్రమాలు వేగవంతమయ్యాయని, ప్రతి కుటుంబానికి పథకాలు చేరేలా చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. మహిళా శక్తి పథకం, గృహజ్యోతి, రైతు భరోసా వంటి పథకాల ద్వారా ప్రజలకు నేరుగా లబ్ధి చేకూరుతోందని పేర్కొన్నారు. నియోజకవర్గంలో రహదారులు, తాగు నీటి సదుపాయాలు, విద్యాసంస్థల అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయని తెలిపారు. రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ చైర్మన్ శివసేనారెడ్డి మాట్లాడుతూ, ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. గ్రామస్థాయిలో అధికారులు ప్రజల వద్దకు వెళ్లి అవగాహన కల్పించాలని కోరారు. ప్రతి గ్రామంలో క్రీడా ప్రాంగణాలు, యువత కోసం క్రికెట్ కిట్లు అందించనున్నట్లు తెలిపారు. కార్యక్రమం అనంతరం వివిధ శాఖల స్టాల్స్‌ను అతిథులు సందర్శించారు. మహిళా సంఘాలకు బ్యాంకు లింకేజీ రుణాలు, వడ్డీ లేని రుణాలు, ఇతర గ్రాంట్ల చెక్కులు పంపిణీ చేయడంతో పాటు, ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాలను లబ్ధిదారులకు అందజేశారు. కార్యక్రమంలో జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులు, మహిళా సంఘాల సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# డ్రగ్స్‌పై సమాజం మొత్తం అప్రమత్తం కావాలి

- యువత భవిష్యత్తును నాశనం చేస్తున్న మత్తు పదార్థాలు
- తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల పర్యవేక్షణ కీలకం
- పోలీసుల కఠిన చర్యలు కొనసాగుతాయని హెచ్చరిక
- అవగాహనతోనే డ్రగ్స్ మహమ్మారికి అడ్డుకట్ట : అడిషనల్ డీసీపీ వెంకటరమణ



కాప్రా, మే 02 (జనంసాక్షి): రాష్ట్రంలో డ్రగ్స్ మహమ్మారిని అరికట్టేందుకు ప్రతి పౌరుడు ముందుకు రావాలని మల్కాజ్‌గిరి కమిషనరేట్ అడిషనల్ డీసీపీ వెంకటరమణ తెలిపారు. కుషాయిగూడలో విబిఎస్ ట్రస్ట్, కుషాయిగూడ పోలీసుల ఆధ్వర్యంలో యాంటీ డ్రగ్స్ అవేర్‌నెస్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉప్పల్ నియోజకవర్గం ఎమ్మెల్యే బండారు లక్ష్మారెడ్డి, నగర మాజీ మేయర్ బొంతు రామ్మోహన్, కాప్రా సర్కిల్ డిప్యూటీ కమిషనర్ శ్రీహరి, కుషాయిగూడ ఇన్‌స్పెక్టర్ భాస్కర్ రెడ్డి, నార్కోటిక్స్ ఇన్‌స్పెక్టర్ రాంప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అడిషనల్ డీసీపీ వెంకటరమణ మాట్లాడుతూ, సమాజంలో డ్రగ్స్ మహమ్మారితో ఎన్నో కుటుంబాలు రోడ్డున పడుతున్నాయని, డ్రగ్స్‌ను కఠినంగా అరికట్టేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. గంజాయి, డ్రగ్స్ మత్తులో పడి యువత అమూల్యమైన జీవితాలను నాశనం చేసుకుంటున్నారని, వారిని మార్చేందుకు తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, యాజమాన్యం కట్టడి చేయాలని సూచించారు. విబిఎస్ ట్రస్ట్ ఆధ్వర్యంలో వడ్లోజు జ్యోతిర్మయా చారి పారిశుధ్య కార్మికులకు, పోలీస్ మహిళా సిబ్బందికి చీరలు పంపిణీ చేశారు. విబిఎస్ ట్రస్ట్ వ్యవస్థాపక చైర్మన్, లయన్స్ క్లబ్ ఆఫ్ భాగ్యనగర్ గ్రీన్ సిటీ అధ్యక్షులు విశ్వకర్మ ట్రస్ట్ సభ్యులు, చీఫ్ అడ్వైజర్ విజయదుర్గా, మల్లేశ్వర స్వామి ఆలయ కమిటీ చీఫ్ అడ్వైజర్ ల ఆచారి మాట్లాడుతూ, డ్రగ్స్ మహమ్మారి వల్ల విద్యార్థులు, కుటుంబాలు వీధిన పడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. సభాధ్యక్షులు లయన్ వడ్లు జ్యోతిర్మయ చారిటీ సివిల్ కోర్టు హైదరాబాద్ స్టాండింగ్ కౌన్సిల్, జీహెచ్‌ఎంసి సభ్యులు, సిటీ సివిల్ కోర్టు మాజీ ప్రధాన కార్యదర్శి అజయ్ మాట్లాడుతూ, డ్రగ్స్ మహమ్మారిని అరికట్టడంలో ప్రతి పౌరుడు బాధ్యతగా వ్యవహరించాలని, మన కాలనీలోనైనా డ్రగ్స్ రహిత వాతావరణం సృష్టించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు కొత్త రామారావు, బొంతు శ్రీదేవి యాదవ్, గొల్లూరి అంజయ్య, ఎస్‌ఐలు వెంకన్న, సుధాకర్ రెడ్డి, సునీల్ రెడ్డి, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# బెల్ట్ షాపులపై సర్పంచ్ కొరడా

## 'జనంసాక్షి' కథనానికి సత్వర స్పందన




- బెల్ట్ షాపులు బంద్... నిర్వహిస్తే రూ.25 వేల జరిమానాబి
- కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి ఆశయాలకు అనుగుణంగా సర్పంచ్ శిరీష లోకేష్ గౌడ్ కీలక తీర్మానం




**మర్రిగూడ, మే 2 (జనంసాక్షి) :**
'మర్రిగూడలో బెల్ట్ షాపుల రాజ్యం' అనే శీర్షికతో 'జనంసాక్షి'లో వెలువడిన కథనానికి మర్రిగూడ సర్పంచ్ వీరమల్ల శిరీష లోకేష్ గౌడ్ తక్షణమే స్పందించారు. మండల కేంద్రంలో అక్రమంగా నిర్వహిస్తున్న బెల్ట్ షాపుల పై ఉక్కుపాదం మోపుతూ కీలక నిర్ణయం తీసుకున్నారు.

**గ్రామపంచాయతీ సంచలన తీర్మానం**
శనివారం అత్యవసరంగా సమావేశమైన మర్రిగూడ గ్రామ పంచాయతీ పాలకవర్గం ఏకగ్రీవంగా తీర్మానం చేసింది. దీని ప్రకారం, మండల కేంద్రం పరిధిలో ఎవరైనా బెల్ట్ షాపు నిర్వహిస్తున్నట్లు తేలితే, నిర్వాహకులకు రూ.25,000 జరిమానా విధించడంతో పాటు, పోలీస్, ఎక్సైజ్ శాఖలకు ఫిర్యాదు చేసి క్రిమినల్ చర్యలు తీసుకుంటామని స్పష్టం చేసింది.

**"బెల్ట్ షాపులు బంద్ చేయండి" - సర్పంచ్ ఆదేశం**
ఈ సందర్భంగా సర్పంచ్ శిరీష లోకేష్ గౌడ్ మాట్లాడుతూ, "మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి ఆశయాల మేరకు మర్రిగూడ మండల కేంద్రంలో బెల్ట్ షాపులను పూర్తిగా నిర్మూలిస్తున్నాం. కూలీల కష్టం తాగుడికే పోతోంది. ఇకపై ఇది సహించేది లేదు. మా పంచాయతీ తీర్మానం తు.చ. తప్పకుండా అమలు చేస్తాం. అవసరమైతే రాత్రి వేళల్లో నేనే స్వయంగా తనిఖీలు చేస్తా" అని హెచ్చరించారు. "అర్ధరాత్రి దాటినా మద్యం అమ్మకాలు జరగడం, యువత, కూలీలు రోడ్లపై పడిపోవడం చాలా బాధాకరం. మహిళలు, చిన్నారులు భయంతో బయటకు రాలేని పరిస్థితి ఉంది. ఇకపై మర్రిగూడలో బెల్ట్ షాపు అనే మాటే వినిపించకూడదు. వెంటనే అన్ని బెల్ట్ షాపులను స్వచ్ఛందంగా మూసివేయాలి. లేదంటే పంచాయతీ తీర్మానం ప్రకారం కఠిన చర్యలు తప్పవు" అని ఆమె స్పష్టం చేశారు.

**ప్రజల హర్షం:**
సర్పంచ్ తీసుకున్న సత్వర నిర్ణయంపై మహిళా సంఘాలు, స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. "సర్పంచ్ స్పందించి తీర్మానం చేయడం అభినందనీయం. ఇలాంటి చిత్తశుద్ధి అధికారుల్లో కూడా ఉంటే మర్రిగూడ 'మద్యం అడ్డా'గా మారేది కాదు" అని గ్రామస్తులు పేర్కొన్నారు.

# మహిళా సంఘాలకు రూ.147 కోట్ల చెక్కులు పంపిణీ

- ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భారీ లబ్ధి
- ప్రజల పక్షపాతిగా రేవంత్ ప్రభుత్వం: ఎమ్మెల్యే యాదయ్య
- కేంద్ర-రాష్ట్ర సమన్వయం అవసరం: ఎంపీ విశ్వేశ్వర్ రెడ్డి
- ఆయిల్ పామ్, ప్రత్యామ్నాయ పంటలపై దృష్టి

**చేవెళ్ల, మే 02 (జనంసాక్షి)** రేవంత్ రెడ్డి ప్రభుత్వం ప్రజల పక్షపాతిగా పనిచేస్తుందని చేవెళ్ల ఎమ్మెల్యే క్యార యాదయ్య పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక అనే కార్యక్ర మంలో భాగంగా శనివారం చేవెళ్లలోని కేజీఆర్ గార్డెన్ లో నిర్వహించడం జరిగింది. ఈ సమావేశానికి చేవెళ్ల ఎంపీ కొండ విశ్వేశ్వర్ రెడ్డి ఎమ్మెల్యే కాలే యాదయ్య, జిల్లా గ్రంధాలయ చైర్మన్ ఎలుగంటి మధుసూధన్ రెడ్డి, మున్సిపల్ చైర్మన్లు దేవర సమతా వెంకట్ రెడ్డి, సాత ప్రవీణ్ కుమార్ కౌన్సిలర్లు, అధికారులు పాల్గొన్నారు. యొక్క ప్రజాపాలనా ప్రగతి ప్రణాళికలో భాగంగా మహిళ సంఘాలకు 147 కోట్ల రూపాయల చెక్కును ఎమ్మెల్యే చేతుల మీదుగా ప్రదానం చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో మహిళా సంఘాల తరపున (అండ్ క్రాఫ్ట్) చేతివృత్తులతో నిర్మించిన పలు స్టాళ్లను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా స్థానిక ఎమ్మెల్యే కాలే యాదయ్య మాట్లాడుతూ.. ప్రజా పాలన-ప్రగతి ప్రణాళిక లో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన సంక్షేమ పథకాలు కళ్యాణ, లక్ష్మి షాదీ ముబారక్ ద్వారా 2023-24 నుండి 25, 26 వరకు 3298 మందికి రూ.33 కోట్ల 3 లక్షల రూపాయలను ఇవ్వడం జరిగిందన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలను అందరికీ అందిస్తుందని తెలిపారు. రైతులకు సబ్సిడీ ద్వారా పనిముట్లను అలాగే ఆర్టికల్చర్ ద్వారా ఎన్నో సంక్షేమ పథకాలను అందించామన్నారు. అనంతరం ఎంపీ కొండ విశ్వేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ.. ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమాన్ని రాష్ట్ర ప్రభుత్వం పెట్టడం చాలా సంతోషంగా ఉంది ఇలాంటి ప్రణాళికను ప్రతి సంవత్సరం పెడితే చాలా బాగుంటుందని తెలిపారు. ఇలాంటి కార్యక్రమాలు ప్రభుత్వం ఏర్పాటు చేసిన పథకాలను ఇంప్లిమెంట్ చేయడం అమలు చేయడం చాలా ముఖ్యం మని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వం కలిసి నడుస్తున్నందుకు చాలా సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపాలిటీ చైర్ వైస్ చైర్మన్ రాము గౌడ్, చేవెళ్ల మార్కెట్ కమిటీ చైర్మన్ పెంటయ్య గౌడ్, వైస్ చైర్మన్ రాములు, మాజీ సొసైటీ చైర్మన్ లు దేవర వెంకట్ రెడ్డి, గోనె ప్రతాప్ రెడ్డి, కౌన్సిలర్ లు బండారి శైలజా ఆగి రెడ్డి, కల్యాణి యాదగిరి, సుచిత బల్వాంత్ రెడ్డి, మాధవి యాది రెడ్డి, తాళ్ళపల్లి నర్సింహులు, క్రిష్ణా నాయక్, సర్పంచులు ప్రభాకర్ రెడ్డి, శ్రీనివాస్ గౌడ్, మాజీ సర్పంచ్ లు పడాల ప్రభాకర్, మధుసూధన్ గుప్తా, టేకులపల్లి శ్రీనివాస్, ఎంపీడీవో హిమబిందు, ప్రభుత్వ అధికారులు పాల్గొన్నారు.

## బీసీ సంక్షేమ సలహాదారుగా వి. హనుమంతరావు

### రాష్ట్రవ్యాప్తంగా అభినందనలు వెల్లువ

**ఖైరతాబాద్, మే 2 (జనంసాక్షి):** ప్రముఖ సామాజికవేత్త, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు వి. హనుమంతరావును బీసీ సంక్షేమ ప్రభుత్వ సలహాదారుగా నియమించడంపై రాష్ట్రవ్యాప్తంగా అభినందనలు వెల్లువెత్తుతున్నాయి. ఆయనకు ఉన్న దీర్ఘకాలిక ప్రజాసేవా అనుభవం, బీసీ వర్గాల సమస్యలపై ఉన్న లోతైన అవగాహన ఈ బాధ్యతలో కీలకంగా ఉపయోగపడుతుందని నాయకులు పేర్కొంటున్నారు. ఈ సందర్భంగా మంగళారపు లక్ష్మణ్ తదితరులు శనివారం హనుమంతరావును కలుసుకుని పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ నియామకం బీసీ వర్గాల సంక్షేమానికి, వారి సామాజిక-ఆర్థిక అభివృద్ధికి మరింత బలాన్ని చేకూరుస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు.
బీసీ సమాజ హక్కుల పరిరక్షణ, విద్య, ఉపాధి, ఆర్థిక అవకాశాల విస్తరణ వంటి అంశాల్లో హనుమంతరావు మార్గదర్శకత్వం ప్రభుత్వానికి దిశానిర్దేశం చేస్తుందని అభిప్రాయపడ్డారు. ఈ నియామకం ద్వారా బీసీ వర్గాల సమస్యలకు సమగ్ర పరిష్కారాలు లభిస్తాయని, ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ కార్యక్రమాలు మరింత ప్రభావవంతంగా కొనసాగుతాయని నాయకులు విశ్వాసం వ్యక్తం చేశారు. మొత్తం మీద వి. హనుమంతరావు నియామకం బీసీ సమాజానికి శుభపరిణామంగా మారనుందని భావిస్తున్నారు.

# వ్యవసాయ వారోత్సవాలకు విస్తృత ఏర్పాట్లు

- మే 4 నుంచి 9 వరకు ఘనంగా నిర్వహణకు ఆదేశాలు
- రైతు వేదికల్లో అవగాహన కార్యక్రమాలు
- ఆధునిక, ప్రత్యామ్నాయ సాగుపై దృష్టి
- మట్టి, ఇసుక రవాణాపై కట్టుదిట్టమైన నియంత్రణలు
- సెన్సస్-2027పై సమన్వయంతో ముందుకు సాగాలి



**పెద్దపల్లి, మే 2 (జనం సాక్షి):**
జిల్లాలో మే 4 నుంచి 9 వరకు నిర్వహించనున్న వ్యవసాయ వారోత్సవాలను విజయవంతంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష అధికారులను ఆదేశించారు. శనివారం సమీకృత జిల్లా కలెక్టరేట్‌లో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన పాల్గొని, రైతులకు విస్తృత అవగాహన కల్పించేలా కార్యాచరణ రూపొందించాలని సూచించారు.
రైతు వేదికల్లో సహజ వ్యవసాయం, నానో యూరియా వినియోగం, మట్టిపరీక్షలు, పంటల వైవిధ్యంపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని తెలిపారు. మట్టి సారాన్ని పెంచేందుకు శాస్త్రీయ పద్ధతుల్లో ఎరువుల వినియోగంపై రైతులకు మార్గనిర్దేశం చేయాలని, అధిక ఎరువుల వాడకం వల్ల కలిగే నష్టాలను వివరించాలని ఆదేశించారు. ఉద్యాన పంటల ప్రోత్సాహం, ఆయిల్ పామ్ సాగు విస్తరణపై ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టాలని పేర్కొన్నారు. సహకార సంఘాలు, మార్కెటింగ్ కమిటీలు రైతులకు సమర్థవంతమైన సేవలు అందించేలా చర్యలు తీసుకోవాలని, భవిష్యత్ నిల్వ సదుపాయాలపై ప్రణాళికలు సిద్ధం చేయాలని సూచించారు. పీఎం కుసుమ్ పథకం, టీజీ రెడ్కో కార్యక్రమాలపై రైతులకు అవగాహన కల్పించాలని తెలిపారు. టీజీ ఆర్గానిక్ యాప్ వినియోగంపై రైతులను చైతన్యపరచాలని అధికారులకు సూచించారు.
చెరువుల నుంచి మట్టి (గ్రావెల్), ఇసుక రవాణాపై కట్టుదిట్టమైన నియంత్రణలు అమలు చేయాలని కలెక్టర్ ఆదేశించారు. నీరు లేని చెరువులకే అనుమతులు ఇచ్చి, క్షేత్రస్థాయిలో పరిశీలన అనంతరం ఎనఓసీలు మంజూరు చేయాలని తెలిపారు. ప్రతి వాహన రవాణాను పర్యవేక్షించి, రసీదులు జారీ చేయాలని, అధిక లోడుతో రవాణా చేయ కుండా కఠిన చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. అక్రమ తవ్వకాలపై కఠినంగా వ్యవహరించాలని హెచ్చరించారు.
ఇక సెన్సస్-2027ను సమర్థవంతంగా నిర్వహించేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ సూచించారు. మే 11 నుంచి జూన్ 9 వరకు మొదటి దశ హౌస్ లిస్టింగ్ చేపట్టాలని, తదుపరి దశలో జనాభా గణన నిర్వహించనున్నట్లు తెలిపారు. డిజిటల్ విధానంలో డేటా సేకరణ జరుగుతుందని, స్వీయ గణనకు కూడా అవకాశం కల్పించామని చెప్పారు. ప్రస్తుతం స్వీయ గణనపై స్పందన తక్కువగా ఉందని, ప్రభుత్వ ఉద్యోగులు ముందుండి నమోదు చేయాలని ఆదేశించారు. గ్రామ, వార్డు స్థాయిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించి ఎక్కువ మంది పాల్గొనేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. జిల్లాలో వ్యవసాయాభివృద్ధి, వనరుల సంరక్షణ, గణాంకాల సేకరణ వంటి అంశాల్లో సమగ్ర చర్యలు చేపట్టడం ద్వారా అభివృద్ధి లక్ష్యాలను సాధించవచ్చని కలెక్టర్ పేర్కొన్నారు. సమావేశంలో సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

# సర్వీస్ లైన్ ఛార్జీలకు కొత్త విధానం

## వినియోగదారులకు సరళత, పారదర్శకత

- లోడ్ ఆధారంగా ఏకరీతి ఛార్జీలు.. త్వరితగతిన కనెక్షన్ల మంజూరు
- రైతులకు ప్రత్యేక రాయితీలు.. ట్రాన్స్‌ఫార్మర్ ఖర్చు విద్యుత్ సంస్థ భారం



**కరీంనగర్ టౌన్, మే 2 (జనం సాక్షి):** విద్యుత్ వినియోగదారులకు మరింత సులభతరం, పారదర్శకత కలిగించేలా కొత్త సర్వీస్ లైన్ ఛార్జీల (రాజ) విధానాన్ని అమల్లోకి తీసుకువచ్చినట్లు కరీంనగర్ సూపరింటెండింగ్ ఇంజనీర్ ఆర్. రవీందర్ తెలిపారు. తెలంగాణ రాష్ట్ర విద్యుత్ నియంత్రణ మండలి రెగ్యులేషన్ నం.1 ఆఫ్ 2026 ప్రకారం ఈ విధానం జనవరి 19, 2026 నుంచి అమలులోకి వచ్చినట్లు వెల్లడించారు. కొత్త విధానం ప్రకారం ఎల్టీ కనెక్షన్లు, అదనపు లోడ్ కోసం ఛార్జీలను లోడ్ ఆధారంగా ఏకరీతిగా నిర్ణయించామని తెలిపారు. క్షేత్రస్థాయి పరిశీలన అవసరం లేకుండా త్వరితగతిన కనెక్షన్లు మంజూరు చేయడం వల్ల వినియోగదారులకు సమయం ఆదా అవుతుందని, ముందుగానే చెల్లించాల్సిన మొత్తం స్పష్టంగా తెలిసి ఆలస్యం తగ్గుతుందని పేర్కొన్నారు.
ఛార్జీల విధానంలో 20 కిలోవాట్ వరకు డెవలప్‌మెంట్ ఛార్జీలు, సర్వీస్ లైన్ ఛార్జీలు రెండూ వర్తిస్తాయి. 20 కిలోవాట్ పైగా కేవలం సర్వీస్ లైన్ ఛార్జీలు మాత్రమే అమలవుతాయి. గృహ వినియోగదారులకు 1 కిలోవాట్ వరకు రూ.500గా, 1-5 కిలోవాట్ వరకు రూ.500తో పాటు ప్రతి కిలోవాట్‌కు రూ.600, 5-20 కిలోవాట్ వరకు రూ.2900తో పాటు ప్రతి కిలోవాట్‌కు రూ.1500గా నిర్ణయించారు. 20 కిలోవాట్ పైగా ప్రతి కిలోవాట్‌కు రూ.10,000గా ఫిక్స్ చేశారు.
కమర్షియల్ వినియోగదారులకు 1 కిలోవాట్ వరకు రూ.1000, 1-5 కిలోవాట్ వరకు రూ.1000తో పాటు ప్రతి కిలోవాట్‌కు రూ.1200, 5-20 కిలోవాట్ వరకు రూ.5800తో పాటు ప్రతి కిలోవాట్‌కు రూ.2000గా, 20 కిలోవాట్ పైగా ప్రతి కిలోవాట్‌కు రూ.10,000గా నిర్ణయించారు. ఇండస్ట్రీలకు 20 కిలోవాట్ వరకు ప్రతి కిలోవాట్‌కు రూ.4000, 20 కిలోవాట్ పైగా ప్రతి కిలోవాట్‌కు రూ.10,000గా అమలు చేస్తున్నారు. రైతులకు ఈ విధానం ప్రత్యేకంగా ప్రయోజనకరంగా ఉండి, 1 కిలోవాట్‌కు రూ.1000 మాత్రమే చెల్లించాల్సి ఉంటుందని తెలిపారు. 5 హెచ్‌పీ మోటార్‌కు అవసరమైన 4 కిలోవాట్లకు సుమారు రూ.9150 చెల్లిస్తే సరిపోతుందని వివరించారు. అపార్ట్‌మెంట్లు, కమర్షియల్ కాంప్లెక్స్‌లు, మల్టీ స్టోరీ భవనాలకు మొత్తం కాంట్రాక్ట్ లోడ్ ఆధారంగా ఛార్జీలు విధిస్తారని, ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు బాధ్యత విద్యుత్ సంస్థదేనని స్పష్టం చేశారు. ఈ విధానం ఎల్టీ కేటగిరి 1 నుంచి 7,9 వరకు వర్తిస్తుందని, 1 కిలోమీటర్ లోపు ఉన్న ఓవర్‌హెడ్ లైన్లకు మాత్రమే అమలవుతుందని తెలిపారు. ఈ కొత్త విధానం ద్వారా విద్యుత్ కనెక్షన్లు వేగవంతంగా, సులభంగా లభించడమే కాకుండా వినియోగదారులకు ఉపయోగపడుతుందని అధికారులు పేర్కొన్నారు.

# హుస్నాబాద్ అభివృద్ధి దిశగా దూసుకెళ్తాం

- రూ.250 కోట్ల రైతు భరోసా, రూ.150 కోట్లతో ఇందిరమ్మ ఇండ్లు
- ఉచిత విద్యుత్, పింఛన్లు, రేషన్ కార్డులతో సంక్షేమం విస్తరణ
- రహదారులు, విద్య, వైద్య రంగాల్లో భారీ ప్రణాళికలు
- పర్యాటకం, వ్యవసాయం, క్రీడలకు ప్రాధాన్యం : మంత్రి పొన్నం ప్రభాకర్





**సిద్దిపేట బ్యూరో, మే 2 (జనం సాక్షి):**
హుస్నాబాద్‌ను అన్ని రంగాల్లో సమగ్రంగా అభివృద్ధి చేయడం ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ స్పష్టం చేశారు. శనివారం హుస్నాబాద్ పట్టణంలోని లక్ష్మీ గార్డెన్స్‌లో నిర్వహించిన నియోజకవర్గ స్థాయి ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించా రు. అనంతరం ముఖ్యమంత్రి సందేశాన్ని ఆర్డీఓ రామ్మూర్తి చదివి వినిపించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రజా ప్రభుత్వం అధికా రంలోకి వచ్చిన తర్వాత రెండేళ్ల ఐదు నెలల్లోనే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో అనేక సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు విజయవంతంగా అమలు చేశామని తెలిపారు. నియోజకవర్గంలో రూ. 250 కోట్ల రైతు భరోసా నిధులను రైతులకు అందించగా, మరణించిన 679 మంది రైతు కుటుంబా లకు రూ.49.96 కోట్ల రైతు బీమా అందించినట్లు వివరించారు. రూ.150 కోట్లతో 3,515 ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేసి, వాటిలో కొన్ని పూర్తి కాగా, మరికొన్ని నిర్మాణ దశలో ఉన్నాయని తెలిపారు. 57,963 గృహాలకు గృహజ్యోతి పథకం కింద 200 యూనిట్ల ఉచిత విద్యుత్ అందిస్తున్నామని, 45 వేల మందికి పింఛన్లు అందిస్తున్నామని తెలిపారు. కొత్తగా 13 వేల రేషన్ కార్డులను మంజూరు చేసి, మొత్తం 61 వేల మందికి ప్రతినెల ఉచిత సన్న బియ్యం పంపిణీ చేస్తున్నట్లు వెల్లడించారు. అభివృద్ధి కార్యక్రమాల్లో భాగంగా పంచాయతీరాజ్, ఆర్ అండ్ బీ శాఖల ద్వారా రహదారుల అభివృద్ధి చేపట్టామని, కొత్తపల్లి-హుస్నాబాద్ నాలుగు వరుసల రహదారి పనులు జరుగుతున్నాయ ని, హుస్నాబాద్-అక్కన్నపేట రహదారి నిర్మాణానికి టెండర్లు పిలిచామని తెలిపారు. గౌరవెల్లి ప్రాజెక్టు పూర్తి తన బాధ్యతగా తీసుకుని భూ నిర్వాసితులకు పరిహారం చెల్లించి కాల్వల నిర్మాణం పూర్తి చేస్తామని పేర్కొన్నారు.
విద్యాభివృద్ధి దిశగా యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ నిర్మాణం కొనసాగుతోందని, శాతవాహన ఇంజనీరింగ్ కాలేజీకి భవన నిర్మాణం చేపడుతున్నామని తెలిపారు. పురుషులు, మహిళల కోసం ప్రత్యేక హాస్టళ్లు నిర్మించనున్నట్లు చెప్పారు. వైద్య రంగంలో భాగంగా 250 పడకల ఆసుపత్రిని అభివృద్ధి చేసి, మెడికల్ కాలేజీ ఏర్పాటు దిశగా చర్యలు తీసుకుంటున్నామని వెల్లడించారు. పర్యాటక అభివృద్ధిలో భాగంగా ఎల్లమ్మ చెరువు, అర్బన్ పార్క్ అభివృద్ధి, పట్టణ సుందరీకరణ పనులు చేపడుతున్నామని, కూరగాయల హోల్‌సేల్ మార్కెట్ ఏర్పాటు, తెలంగాణ పబ్లిక్ స్కూల్ నిర్మాణం వంటి ప్రణాళికలు అమలు చేస్తున్నామని తెలిపారు. క్రీడలకు ప్రాధాన్యమిస్తూ కబడ్డీ అకాడమీ ఏర్పాటు దిశగా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. జిల్లా కలెక్టర్ హైమావతి మాట్లాడుతూ ప్రజల భాగస్వామ్యంతో సంక్షేమ పథకాలు సమర్థవంతంగా అమలు చేయడానికి ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఐదు అంచెల్లో ఈ కార్యక్రమాన్ని అమలు చేస్తూ పది శాఖల ద్వారా ప్రజలకు సేవలు అందిస్తున్నామని పేర్కొన్నారు. సిద్దిపేట సీపీ సాధన రష్మీ పెరుమాళ్ మాట్లాడుతూ సురక్ష నేత్ర కార్యక్రమం ద్వారా గ్రామాలు, ప్రధాన కూడళ్లలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తున్నామని, ప్రజలు భద్రతా చర్యల్లో భాగస్వాములు కావాలని సూచించారు. ఈ సందర్భంగా స్వయం సహాయక సంఘాలకు రూ.128 కోట్ల బ్యాంకు లింకేజీ చెక్కులు, కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్, నేతన్న భీమా చెక్కులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, అధికారులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

# ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

## అర్హులందరికీ సంక్షేమ పథకాలు చేరాలి : టీయూఎఫ్ఐడీసీ చైర్మన్ చల్లా నర్సింహ రెడ్డి




**మహేశ్వరం, మే 2 (జనంసాక్షి):** ప్రజల సంక్షేమమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తుందని టీయూఎఫ్ఐడీసీ చైర్మన్ చల్లా నర్సింహ రెడ్డి అన్నారు. శనివారం మహేశ్వరం మండలంలోని కాకి ఈశ్వర్ ఫంక్షన్ హాల్లో మహేశ్వరం నియోజకవర్గం స్థాయి ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా చల్లా నర్సింహ రెడ్డి మాట్లాడుతూ... రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశ పెడుతున్న సంక్షేమ పథకాలు అర్హులందరికీ చేరేలా అధికారులు పని చేయాలన్నారు. ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమాన్ని 99 రోజుల పాటు చేపట్టిందన్నారు. సీఎం రేవంత్ రెడ్డి రాష్ట్ర ప్రగతి కోసం నిరంతరం కృషి చేస్తున్నారన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాల గురించి స్టాల్స్ ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో చేనేత కళ అభివృద్ధి చైర్మన్ నాయుడు సత్యనారాయణ, జిల్లా అడిషనల్ కలెక్టర్ చంద్రారెడ్డి, కందుకూరు ఆర్డీవో జగదీశ్వర్ రెడ్డి, వ్యవసాయ శాఖ ఏడీ సుధారాణి, మహేశ్వరం మార్కెట్ కమిటీ చైర్మన్ కృష్ణ నాయక్, వైస్ చైర్మన్ యాదయ్య, ఎంపీడీవోలు శైలజ రెడ్డి, సరిత, తహశీల్దార్లు చిన్న అప్పలనాయుడు, గోపాల్, ఇందిరా దేవి, మహేశ్వరం జోన్ ఏసీపీ జానకీ రెడ్డి, సీఐ రాఘవేందర్ రెడ్డి, పలు శాఖల అధికారులు, పలు గ్రామాల సర్పంచులు తదితరులు పాల్గొన్నారు.

జనంసాక్షి
www.janamsakshi.org
ఆదివారం
3 మే 2026

# అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు అమలు

- ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక ద్వారా భవిష్యత్ ప్రణాళికలు
- విద్య, వైద్యం, సంక్షేమ రంగాల్లో ప్రభుత్వం ప్రత్యేక దృష్టి
- యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్, కలికోట సూరమ్మ ప్రాజెక్టు వేగవంతం



**రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రతినిధి, మే 2 (జనంసాక్షి):** రాష్ట్రంలో అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు అమలు చేస్తున్నామని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. ప్రజాపాలన – ప్రగతి ప్రణాళి క 99 రోజుల కార్యాచరణలో భాగంగా రాధా బాయ్ అధ్యక్షతన శనివారం వేములవాడలో నియోజకవర్గ స్థాయి సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథులుగా ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ హాజరయ్యారు. ముందుగా జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. తెలంగాణ గీతం, జయ జయహే తెలంగాణ వీడియో పాటను ప్రదర్శించారు. జిల్లా అధికార యంత్రాంగం ఆధ్వర్యంలో అభివృద్ధి, సంక్షేమ పనులపై ప్రత్యేకంగా రూపొందించిన వీడియోను ప్రదర్శించారు. ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం పేద ప్రజల సంక్షేమమే లక్ష్యంగా పథకాలు అమలు చేస్తున్నదని తెలిపారు. 99 రోజుల ప్రణాళికలో గ్రామ సభలు, మండల స్థాయి సభలు పూర్తి చేసుకొని నియోజకవర్గ స్థాయి సభలు ఏర్పాటు చేశామన్నారు. గ్రామాల్లోని సమస్యలు గుర్తించి వాటి పరిష్కారం కోసం కృషి చేస్తున్నామన్నారు.

**విద్య, వైద్యం రంగాల్లో ప్రత్యేక దృష్టి**

జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆధ్వర్యంలో అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పని చేస్తున్నారని అభినందించారు. మహిళా సంక్షేమానికి పెద్ద ఎత్తున నిధులు కేటాయిస్తున్నామన్నారు. విద్య, వైద్య సేవలకు ప్రాధాన్యత ఇస్తున్నామని, కార్పొరేట్ విద్యా సంస్థలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేస్తున్నామన్నారు. నూతనంగా రూ.200 కోట్లతో అంతర్జాతీయ ప్రమాణాలతో 25 ఎకరాల్లో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ మంజూరైందని, హైదరాబాద్ పబ్లిక్ స్కూల్ తరహాలో తెలంగాణ పబ్లిక్ స్కూల్ ఏర్పాటు చేయనున్నామన్నారు. స్పోర్ట్స్, స్కిల్ యూనివర్సిటీలు ఏర్పాటు చేస్తున్నామని, గంజాయి రహిత రాష్ట్రంగా మారుస్తున్నామని తెలిపారు. వేములవాడ రాజన్న ఆలయాన్ని రూ.150 కోట్లతో అభివృద్ధి చేస్తున్నామని, కలికోట సూరమ్మ ప్రాజెక్టు పనులు ముమ్మరంగా జరుగుతున్నాయని, మల్రిపల్లి ప్రాజెక్టులో ఈ వర్షాకాలంలో నీరు నింపుతామని వెల్లడించారు. మల్కపేట రిజర్వాయర్ మిగతా పనులు పూర్తి చేస్తామన్నారు. జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ, సీఎం రేవంత్ రెడ్డి మార్చి 6న ప్రజాపాలన–ప్రగతి ప్రణాళికను ప్రారంభించారని గుర్తు చేశారు. గ్రామ, మండల సభలు నిర్వహించి భవిష్యత్ ప్రణాళికలు రూపొందిస్తున్నామన్నారు. రైతులు సన్న రకం వడ్లు, ఆయిల్ పామ్ సాగు చేయాలని సూచించారు.

**నియోజకవర్గంలో వివిధ పథకాల ద్వారా లబ్ధి**

- **రైతు భరోసా :** 67,810 మందికి రూ.162.74 కోట్లు
- **రైతు బాండ్ మాఫీ :**18,488 మందికి రూ.369.76 కోట్లు
- **ఇందిరమ్మ ఇళ్లు :**2,907 ఇళ్లు మంజూరు, రూ.146.51కోట్లు
- **మహాలక్ష్మి ఉచిత బస్సు :** రూ.80 కోట్లు ఆదా
- **గృహ జ్యోతి :** 56,091 మందికి ఉచిత విద్యుత్

ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ నాగుల సత్యనారాయణ గౌడ్, మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు, మార్కెట్ కమిటీ చైర్మన్లు, ఆర్డీఓ రాధా బాయ్, సీపీఓ శ్రీనివాసాచారి, డీఆర్డీఏ మచ్చ గీత, డీఎస్పీ శ్రీనివాసులు, తహసీల్దార్లు, ఎంపీడీఓలు, మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

## మల్కాజిగిరి అభివృద్ధికి అడ్డంకులు తొలగించాలి

- హైడ్రా అధికారులను కోరిన ఎమ్మెల్యే
- అల్వాల్ ఫైర్ స్టేషన్, బండ చెరువు పనులపై చర్చ



**మల్కాజిగిరి, మే 2 (జనంసాక్షి) :** నియోజకవర్గ పరిధిలోని ప్రజా సమస్యల పరిష్కారం, మౌలిక సదుపాయాల కల్పనే తన ప్రధాన లక్ష్యమని మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి స్పష్టం చేశారు. శనివారం ఆయన హైడ్రా కార్యాలయంలో అడిషనల్ డైరెక్టర్ ఫైర్ సర్వీసెస్ పాపయ్య వర్మ, డిప్యూటీ సిటీ ప్లానర్ రాంరెడ్డిలను మర్యాదపూర్వకంగా కలిశారు. నియోజకవర్గంలో పెండింగ్‌లో ఉన్న పలు కీలక ప్రాజెక్టులు, అభివృద్ధి పనులకు ఎదురవుతున్న న్యాయపరమైన చిక్కులపై వారితో సుదీర్ఘంగా చర్చించి వినతి పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, అల్వాల్‌లో ఫైర్ స్టేషన్ నిర్మాణ పనులు కోర్టు స్టే కారణంగా నిలిచిపోయాయని, దీనివల్ల ప్రజలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయని వివరించారు. ఈ స్టేను త్వరితగతిన తొలగించి పనులు ప్రారంభించేలా చూడాలని కోరారు. బండ చెరువు అభివృద్ధి, ఆధునీకరణపై ప్రత్యేక దృష్టి సారించాలని విజ్ఞప్తి చేశారు. నియోజకవర్గంలోని చెరువుల పరిరక్షణకు సంబంధించి ఉన్న న్యాయపరమైన సమస్యలను పరిష్కరించాలని, నియోజకవర్గంలో పెరుగుతున్న భూకబ్జాలు, అక్రమ నిర్మాణాల పట్ల కఠినంగా వ్యవహరించాలని అధికారులకు సూచించారు. ముఖ్యంగా గ్రామ కంఠం భూముల పరిరక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని అధికారుల దృష్టికి తీసుకువెళ్లి వినతి పత్రాలను అందజేశామని తెలిపారు. సానుకూలంగా స్పందించిన అధికారులు పెండింగ్‌లో ఉన్న అంశాలను పరిశీలించి, అభివృద్ధి పనులకు ఆటంకం కలగకుండా తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కారంలో రాజీ పడే ప్రసక్తే లేదని, నియోజకవర్గ సమగ్ర అభివృద్ధికి అహర్నిశలు కృషి చేస్తానని ఎమ్మెల్యే స్పష్టం చేశారు.

## శేరిలింగంపల్లి సమగ్ర అభివృద్ధే లక్ష్యం

- రూ.4.70 కోట్ల పనులకు శంకుస్థాపన.. సీసీ రోడ్లు, కాల్వల నిర్మాణానికి శ్రీకారం
- అన్ని కాలనీల్లో మౌలిక వసతులపై దృష్టి.. అసంపూర్తి పనులు త్వరలో పూర్తిల



**శేరిలింగంపల్లి, మే 2 (జనంసాక్షి):** శేరిలింగంపల్లి నియోజకవర్గ సమగ్ర, సంతు లిత అభివృద్ధే తన ప్రధాన ధ్యేయమని రాష్ట్ర ప్రజాపద్దుల కమిటీ చైర్మన్ అరికెపూడి గాంధీ స్పష్టం చేశారు. ప్రజా సంక్షేమాన్ని లక్ష్యంగా పెట్టుకుని కోట్లాది రూపాయల నిధులతో అభివృద్ధి కార్యక్రమాలను కొనసాగిస్తామని తెలిపారు. శనివారం మియాపూర్, మాదాపూర్ డివిజన్ల పరిధిలో రూ.4.70 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టనున్న పలు అభివృద్ధి పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. మియాపూర్ డివిజన్‌లోని మయూరి నగర్, లక్ష్మీనగర్ కాలనీలలో రూ.1.49 కోట్లతో సీసీ రోడ్లు, వరదనీటి కాల్వల నిర్మాణ పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ శేరిలింగంపల్లి ప్రజలు ఎప్పటినుంచో తనపై చూపుతున్న ఆదరణకు కృతజ్ఞతలు తెలిపారు. నియోజకవర్గ అభివృద్ధికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇప్పటికే భారీగా నిధులు మంజూరు చేశారని గుర్తుచేశారు. రాష్ట్ర మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు సహకారంతో నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తామని పేర్కొన్నారు.

ప్రజలకు అవసరమైన మౌలిక వసతులు అందించడమే లక్ష్యంగా రోడ్లు, కాల్వలు, యుజిడి పనులను దశలవారీగా చేపడతామని తెలిపారు. అసంపూర్తిగా ఉన్న పనులను త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. త్వరలోనే నియోజకవర్గంలోని ప్రతి కాలనీలో పర్యటించి సమస్యలను తెలుసుకుని పరిష్కరిస్తామని తెలిపారు. భవిష్యత్తులో టీమ్ పార్కులు, ఓపెన్ జిమ్‌లు ఏర్పాటు చేసి ప్రజలకు మెరుగైన ఆరోగ్య సదుపాయాలు కల్పించేందుకు కృషి చేస్తామని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, కార్యకర్తలు, కాలనీవాసులు పాల్గొన్నారు.

# ఓవైపు సంక్షేమం.. మరోవైపు అభివృద్ధి







- ప్రజా పాలనలో గ్రామాల పట్టణాల అభివృద్యే లక్ష్యం
- షాద్‌నగర్ ఎమ్మెల్యే ప్రభుత్వ రంగ సంస్థల చైర్మన్ వీర్లపల్లి శంకర్
- ఆరోగ్యాన్ని ప్రతి ఒక్కరూ కాపాడుకోవాలి : అడిషనల్ కలెక్టర్ కొప్పిశెట్టి కిరణ్మయి
- షాద్‌నగర్‌లో ప్రజాపాలన కార్యక్రమంలో విస్తృత అవగాహన

**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి/షాద్‌నగర్ (జనంసాక్షి) :** కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఓవైపు సంక్షేమం, మరోవైపు అభివృద్ధి లక్ష్యంగా పని చేస్తున్నామని షాద్‌నగర్ ఎమ్మెల్యే, ప్రభుత్వ రంగ సంస్థల చైర్మన్ వీర్లపల్లి శంకర్ స్పష్టం చేశారు. 99 రోజుల ప్రజా పాలన కార్యక్రమంలో భాగంగా షాద్‌నగర్ నియోజక వర్గ పరిధిలోని వివిధ గ్రామాల, మున్సిపాలిటీ పట్టణ అభివృద్ధిలో భాగంగా ఏయే మండలాలకు ఏప శాఖ ద్వారా లబ్ధిదారు లకు ఎన్ని నిధులు చేకూరయో అనే అంశంపై షాద్‌నగర్ పట్టణంలోని రెడ్ రోజ్ ఫంక్షన్‌హాల్‌లో ఆర్డీవో సరిత అధ్యక్షతన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ సర్కారు విద్యా వైద్యంతో పాటు రైతులకు భరోసా కలిగించే పథకాలు అమలు చేస్తోందన్నారు. వ్యవసాయానికి పెద్దపీట వేస్తూ.. మహిళల స్వావలంబనకు దోహదపడే చర్యలు తీసుకుంటోందన్నారు. అడిషనల్ కలెక్టర్ కొప్పిశెట్టి కిరణ్మయి మాట్లాడుతూ.. నేటి సమాజంలో రకరకాల వ్యాధులు వస్తున్నాయని, మహిళలు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. రోడ్డు ప్రమాదాలు గురికాకుండా ఉండాలంటే ట్రాఫిక్ నియమాలు పాటించాలని కోరారు. గుర్తుతెలి యని వ్యక్తులకు, కాల్స్‌కు ఓటీపీ, ఆధార్ నెంబర్లు చెప్పకూడద న్నారు. అనంతరం మహిళా సంఘాలకు రూ.238 కోట్లకు పైగా వడ్డీ లేని రుణాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో షాద్‌నగర్ మున్సిపల్ చైర్మన్ అగ్గనూరి బస్వాం, వైస్ చైర్మన్ అందే మోహన్, మార్కెట్ కమిటీ చైర్మన్ సులోచన కృష్ణారెడ్డి, షాద్‌నగర్ ఏసిపి లక్ష్మీనారాయణ, మున్సిపల్ కమిషనర్ సునీత, మండల విద్యాధికారి మనోహర్, ఫరూక్‌నగర్ మండల తాహసిల్దార్ నాగయ్య, ఎంపీడీవో బన్సీలాల్ తదితరులు పాల్గొన్నారు.

**హ్యాండ్ బ్యాగ్ కొనుగోలు చేసిన అడిషనల్ కలెక్టర్**

ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌తో కలిసి ఫంక్షన్ హాల్ ఆవరణలో ఏర్పాటు చేసిన వివిధ రకాల స్టాల్స్‌ను అడిషనల్ కలెక్టర్ కిరణ్మయి తిలకించారు. స్టాల్స్‌లో ఏర్పాటు చేసిన చిరుధాన్యాలు, ఫ్రూట్స్ న్యాచురల్‌గా తయారు చేసిన షర్బతులాంటివి పరిశీలించా రు. ఓ స్టాల్లో హ్యాండ్ బ్యాగును కొనుగోలు చేశారు. మహిళలు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలని ఆమె ఆకాంక్షించారు.

**పిల్లలకు ఫోన్లు ఇవ్వొద్దు..**

పిల్లల ఎదుగుదలపై తల్లిదండ్రులు నిరంతరం దృష్టి పెట్టాలని, వారి ప్రవర్తనను సమీక్షిస్తూ సరికొత్త సవాళ్ల నుంచి రక్షించాలని జిల్లా అదనపు కలెక్టర్ కిరణ్మయి సూచించారు. పిల్లలను సెల్‌ఫోన్లకు అతుక్కుపోకుండా నియంత్రిస్తూ, వారి భవిష్యత్తును దృష్టిలో పెట్టుకొని తల్లిదండ్రులు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ముఖ్యంగా 14 సంవత్సరాలు దాటిన బాలికలకు గర్భాశయ క్యాన్సర్ నివారణలో భాగంగా హెచ్‌పివి టీకా తప్పనిసరిగా వేయించాలన్నారు. మహిళల ఆర్థిక స్వావలంబనకు ప్రభుత్వం వడ్డీ లేని రుణాలు అందిస్తూ సహకరిస్తోందని, మహిళా సంఘాలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని స్వయం ఉపాధి వైపు అడుగులు వేయాలని సూచించారు.

## గంజాయిని సరఫరా చేస్తున్న ఇద్దరు యువకుల అరెస్టు

**50 గ్రాముల నిషేధిత గంజాయి, ఒక ద్విచక్ర వాహనం, రెండు సెల్ ఫోన్లు స్వాధీనం**



**కథలాపూర్, మే 2(జనం సాక్షి) :** జగిత్యాల ఎస్పీ శ్రీ అశోక్ కుమార్ ఐపిఎస్ ఆదేశాల మేరకు, మెట్పల్లి డిఎస్పి శ్రీ రాములు పర్యవేక్షణలో, కోరుట్ల సీఐ శ్రీ లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో కథలాపూర్ ఎస్సై రవి కిరణ్ తమ పోలీస్ సిబ్బందితో కలిసి నమ్మదగిన సమాచారం మేరకు శనివారం రోజు ఇద్దరు యువకులు ద్విచక్ర వాహనంపై నిషేధిత గంజాయిని సరఫరా చేస్తున్నారని సమాచారం మేరకు దుంపేట గ్రామ శివారులో గల వరద కాలువ వద్ద ఇద్దరు యువకులు సుదీప్ తీ/శీ మానాల మరియు గౌతమ్ తీ/శీ భూషణ్ రావుపేట అనువారిని పట్టుకొని విచారించగా వారి వద్ద నుండి లినిషేధిత గంజాయి 50 గ్రాములు విలువ 1500/- రూపాయలు గలది దొరికినది. తదుపరి పంచనామా నిర్వహించి ఇరువురు వ్యక్తులను, వారి వద్ద నుండి లినిషేధిత గంజాయిని, ఒక పల్సర్ బైకును, రెండు సెల్ ఫోన్లనులి స్వాధీన పరుచుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు కథలాపూర్ ఎస్సై రవి కిరణ్ తెలియజేసినారు. ఇట్టి ఆపరేషన్ లో పోలీస్ సిబ్బంది శ్రీకాంత్, శ్రీనునాయక్, దినేష్, ముత్తయ్య, అరుణ్, మధు, భగవాన్ పాల్గొన్నారు.

## మల్కాజిగిరిలో ప్రజా పాలన- ప్రగతిపై సమీక్ష

**మల్కాజిగిరి మే 2 (జనంసాక్షి) :** అర్హులైన వారందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందే విధంగా చర్యలు తీసుకోవాలని మల్కాజిగిరి జోనల్ కమిషనర్ సంచిత్ గాంగ్వార్ అధికారులకు సూచించారు. ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక లో భాగంగా 99 రోజుల కార్యాచరణపై శనివారం ఆనంద్ భాగ్ లోని బృందావన్ గార్డెన్స్‌లో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై అధికారులకు దిశానిర్దేశం చేశారు. ప్రభుత్వ లక్ష్యాలకు అనుగుణంగా ప్రజలకు సేవలను వేగవంతం చేయాలని ఆయన ఆదేశించారు. ధరణి దరఖాస్తులు, మ్యుటేషన్లు 100 శాతం పూర్తి చేయాలి. పారిశుద్ధ్యం, తాగునీరు, వీధి దీపాలపై నిత్యం నిఘా ఉంచాలి, కొత్త రేషన్ కార్డులు, ఆధార్ కార్డులు ఈ–కేవైసీ ప్రక్రియలో జాప్యం జరగకూడదు. బస్తీ దవాఖానాల్లో మందుల కొరత లేకుండా చూడాలి. ఇందిరమ్మ ఇళ్లు, కల్యాణ లక్ష్మి దరఖాస్తుల పరిష్కారం, 200 యూనిట్ల ఉచిత విద్యుత్ పథకం నమోదు ప్రక్రియను వేగవంతం చేయాలి.ప్రతి సోమవారం నియోజకవర్గాల వారీగా 'ప్రజావాణి' నిర్వహిస్తామని, జనాభా లెక్కల నమోదుతో పాటు ఓటరు నమోదుపై దృష్టి సారించాలని కమిషనర్ సూచించారు. ఈ సమావేశంలో స్పెషల్ ఆఫీసర్ యూనీస్ రాణి, తహసీల్దార్లు సీతారాం, రాములు, డిప్యూటీ కమిషనర్ జకియా సుల్తానా తదితర అధికారులు, స్థానికులు వివిధ పార్టీల నాయకులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## వేసవి తాపం-ముళ్ల నాచుతో మత్స్యకారులకు భారీ నష్టం

- చెరువుల్లో చేపల మృతి, జీవనోపాధిపై ప్రభావం
- మార్కెట్‌లో ధరలు పడిపోవడంతో ఇబ్బందులు
- నాచు నివారణపై ప్రభుత్వ చర్యలు కోరుతున్న జాలర్లు





**భూత్పూర్, ఏప్రిల్ 02 (జనం సాక్షి):** వేసవి తాపం తీవ్రతతో పాటు ముళ్ల నాచు పెరుగుదల కారణంగా మత్స్యకారులు భారీ నష్టాలను ఎదుర్కొం టున్నారు. మహబూబ్‌నగర్ జిల్లా భూత్పూర్ మండలంలోని మద్దిగట్ల, పాత మోలుగరా, వెల్కిచర్ల, కప్పేట గ్రామాల చెరువుల్లో చేపలు పెద్ద ఎత్తున మృత్యువాత పడుతున్నాయి. జాలర్లు తెలిపిన వివరాల ప్రకారం, వేసవి కాలంలో అధిక ఉష్ణోగ్రతల వల్ల చెరువుల్లో నీటి మట్టం తగ్గిపోవడంతో నీరు వేడెక్కి చేపలు చనిపోతున్నాయి. అంతేకాకుండా చెరువుల్లో ముళ్ల నాచు విపరీతం గా పెరగడం వల్ల నీటిలో ఆక్సిజన్ తగ్గి చేపలు బతకలేని పరిస్థితి ఏర్పడుతోంది. ముళ్ల నాచు ఎక్కువ గా ఉండటంతో వలలు సరిగా పనిచేయక, నీటి అడుగుభాగానికి చేరకపోవడంతో చేపలు పట్టడం కష్టమవుతోందని మత్స్యకారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ సమస్య గత ఐదేళ్లుగా తీవ్రరూపం దాల్చినప్పటికీ సరైన పరిష్కారం లభించలేదని తెలిపారు. ఇక వేసవి కాలంలో అన్ని చెరువుల్లో ఒకేసారి చేపలు పట్టడం వల్ల మార్కెట్‌లో సరఫరా పెరిగి ధరలు పడిపోవడం మరో సమస్యగా మారిందన్నారు. దీంతో తమకు వచ్చిన చేపలకు సరైన ధర దక్కక మరింత నష్టపోతున్నామ ని జాలర్లు వాపోయారు. ముళ్ల నాచు నివారణకు ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలని, మత్స్యకారులకు అవగాహన సదస్సులు నిర్వహించాలని, చెరువుల నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించా లని వారు కోరుతున్నారు. ఈ చర్యల ద్వారా తమ జీవనోపాధి మెరుగుపడుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

### నూతన డీజీపీ ఆనంద్‌కు శుభాకాంక్షలు తెలిపిన కోలేటి

**గోదావరిఖని, జనంసాక్షి:** తెలంగాణ నూతన డీజీపీగా నియమితులైన సీవీ ఆనంద్‌ను పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ కోలేటి దామోదర్ మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. సీవీ ఆనంద్ ఈ నెల 1వ తేదీన పదవి బాధ్యతలు స్వీకరించినట్లు తెలిపారు. హైదరాబాద్‌లోని డీజీపీ కార్యాలయంలో ఆయనను కలిసి, తిరుమల శ్రీవారి ప్రసాదం అందజేసి శాలువాతో సన్మానించారు.

# ప్రజా సంక్షేమానికి అధిక ప్రాధాన్యం

- శాఖల వారీగా సమస్యల పరిష్కారం... ప్రభుత్వ పథకాలపై పర్యవేక్షణ
- అర్హులకు సంక్షేమ ఫలాలు అందేలా పకడ్బందీ చర్యలు
- నియోజకవర్గస్థాయి సమావేశంలో కలెక్టర్ చిత్ర మిశ్రా



**కరీంనగర్ బ్యూరో, మే 02 (జనంసాక్షి) :**

పేద ప్రజల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తుందని అందులో భాగంగా శాఖల వారీగా సమస్యలు పరిష్కరిస్తూ అర్హులకు సంక్షేమ ఫలాలు అందేలా చర్యలు తీసుకుంటున్నామని కలెక్టర్ చిత్రమిశ్రా పేర్కొన్నారు. శనివారం గంగాధర మండలం వెంకటాయ పల్లిలో ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా చొప్పదండి నియోజకవర్గం స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి డిసిసి అధ్యక్షుడు, చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం, స్థానిక సంస్థల ఆదనపు కలెక్టర్, నియోజకవర్గస్థాయి క్లస్టర్ ఆఫీసర్ అశ్విని తానాజీ వాకడే, ఆర్డీఓ మహేశ్వర్, వివిధ శాఖల అధికారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడారు. స్త్రీ శిశు సంక్షేమం, స్థానిక సంస్థలు, ఇందిరమ్మ ఇల్లు, ప్రజావాణి సమస్యల పరిష్కారం పై ప్రత్యేక దృష్టి సారించినట్లు పేర్కొన్నారు. జిల్లా, మండల, గ్రామస్థాయి భారీగా దరఖాస్తులు పరిశీలించి పరిష్కరిస్తున్నట్లు వివరించారు. క్షేత్రస్థాయి లో పరిశీలిస్తూ అధికారులంతా సమన్వయంతో ముందుకు సాగుతూ ప్రజా సమస్యలు పరిష్కరిస్తున్నట్లు వివరించారు. ఈ సందర్భంగా వివిధ శాఖల అధికారులు నియోజకవర్గంలోని ఆరు మండలాల్లో ప్రభుత్వ పథకాలు పొందిన, పొందుతున్న లబ్ధిదారుల వివరాలు వివరించారు. రైతు బీమా, కళ్యాణి లక్ష్మి, రైతు భరోసా, మహాలక్ష్మి, మహిళా సంఘాలకు వడ్డీ లేని రుణాలు, చేయూత పెన్షన్లు , అంగన్వాడి కేంద్రాల సేవలు, ఆయిల్ ఫామ్ సాగు వివరాలు వివరించారు.

ఈ సందర్భంగా చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం మాట్లాడుతూ... పార్టీలతో సంబంధం లేకుండా అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు అందిస్తున్నట్లు వివరించారు. గతంలో రేషన్ దుకాణాల్లో దొడ్డు బియ్యం ఇచ్చేవారని కానీ కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత సన్నబియ్యం ఇస్తూ పేదల కడుపు నింపుతుందన్నారు.

కాంగ్రెస్ ప్రభుత్వం అందిస్తున్న ఉచిత ఆర్టీసీ బస్సు, గృహలక్ష్మి, అర్హులకు ఇందిరమ్మ ఇల్లు, రేషన్ కార్డుల జారీ, తదితర పథకాలు త్వరలో ప్రవేశ పెట్టే పథకాలను వివరించారు.గత ప్రభుత్వం వరి వేసుకుంటే ఉరేనని చెప్పిందని, సన్న రకాలకు 500 బోనస్ ఇస్తూ రైతులకు అండగా ఉంటున్నామని వివరించారు. దేశంలో ఎక్కడలేని విధంగా రైతులకు రెండు లక్షల రుణమాఫీ చేశామని, విద్యారంగాన్ని తీర్చిదిద్దేందుకు నియోజకవర్గానికి ఒక రెసిడెన్షియల్ స్కూల్ ను ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు. నాడు వైయస్ రాజశేఖర్ రెడ్డి జేఎన్టీయూ ఇస్తే నేడు మరిన్ని వసతులు కల్పిస్తున్నట్లు తెలిపారు. నియోజకవర్గంలోని ప్రాజెక్టులు పూర్తి చేసి రైతుల పాదాలు కడుగుతానని ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం పేర్కొన్నారు. నారాయణపూర్ ప్రాజెక్టు పూర్తయితే చొప్పదండితోపాటు వేములవాడ నియోజకవర్గాలకు సాగునీటి కష్టాలు తప్పుతాయన్నారు. ఇప్పటికే ఈ ప్రాజెక్టు భూసేకరణకు 23.5 కోట్లు మంజూరు చేశారని మరో 20 కోట్లు త్వరలో విడుదల అవుతాయని పేర్కొన్నారు. వచ్చే ఐదేళ్లలో నియోజకవర్గానికి మరిన్ని పరిశ్రమలు తీసుకొచ్చి యువతకు ఉపాధి కల్పిస్తానని, అవినీతికి ఆస్కారం లేకుండా పాలన చేస్తున్నట్లు వివరించారు. చొప్పదండి ప్రజలు మాకు దేవుళ్లతో సమానమని నన్ను గెలిపించినందుకు చివరి రక్తపు బొట్టు వరకు ప్రజాసేవ చేస్తానని పేర్కొన్నారు.కొనుగోలు కేంద్రాల వద్ద రైతులు ఇబ్బంది పడుతున్నట్లు తమ దృష్టికి వచ్చిందని, వారికి ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా సౌకర్యాలు కల్పించాలని కలెక్టర్, ఇతర అధికారులను కోరారు. క్షేత్రస్థాయిలో కేంద్రాలను తనిఖీ చేసి వాస్తవాలు తెలుసుకోవాలని పేర్కొన్నారు. తాను కూడా కేంద్రాలను తనిఖీ చేస్తానని గత ప్రభుత్వంలో మాదిరి ఇష్టానుసారం తూకంలో కోతలు విధించొద్దని ఆదేశించారు.

**సర్పంచులు ఊరి అభివృద్ధిపై దృష్టి సారించండి**

ఎన్నికల వరకే రాజకీయాలు చేయాలని ఎన్నికల తరువాత ఊరి అభివృద్ధి పై దృష్టి సారించాలని నూతన సర్పంచులకు సూచించారు. ఏవైనా సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకొస్తే పరిష్కారానికి కృషి చేస్తానన్నారు.

# విద్యుత్ భద్రత వారోత్సవాలు ప్రారంభం

- ప్రమాదాలను జీరో స్థాయికి తగ్గించడమే లక్ష్యం
- మే 1 నుంచి 7 వరకు అవగాహన కార్యక్రమాలు
- భద్రతా పరికరాలు తప్పనిసరి.. చిన్న నిర్లక్ష్యం పెద్ద ప్రమాదాలకు దారి



**కరీంనగర్ టౌన్, మే 2 (జనంసాక్షి):**

విద్యుత్ ప్రమాదాల నివారణకు అవగాహన కల్పించేందుకు మే 1 నుంచి 7 వరకు విద్యుత్ భద్రత వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు కరీంనగర్ సూపరింటెండింగ్ ఇంజనీర్ ఆర్. రవీందర్ తెలిపారు. టీజీఎన్‌పీడీసీఎల్ కార్యాలయంలోని మీటింగ్ హాల్లో పట్టణ విద్యుత్ సిబ్బందికి భద్రతా ప్రమాణాలపై ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, విద్యుత్ ప్రమాదాలను పూర్తిగా తగ్గించడమే ఈ వారోత్సవాల ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. ఓఅండ్‌ఎం సిబ్బంది విద్యుత్ స్తంభాలపై పనిచేసేటప్పుడు సేఫ్టీ బెల్ట్, హెల్మెట్, ఎర్త్ రాడ్, వోల్టేజ్ డిటెక్టర్ వంటి భద్రతా పరికరాలు తప్పనిసరిగా వినియోగించాలని ఆదేశించారు. సురక్షిత విధానాలను పాటించకుండా పనిచేయకూడదని హెచ్చరించారు.

వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్ సరఫరా అందించాలంటే లైన్ల నిర్వహణను క్రమం తప్పకుండా చేపట్టాలని సూచించారు. అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి ప్రజలకు, రైతులకు విద్యుత్ భద్రతపై పూర్తి స్థాయి అవగాహన కల్పించాలని తెలిపారు. విద్యుత్ ప్రమాదాలకు ప్రధాన కారణాలు నిర్లక్ష్యం, నాసిరకం వైర్ల వినియోగం, ఎర్తింగ్ లేకపోవడం, తడి చేతులతో పరికరాలను ముట్టుకోవడం వంటివేనని వివరించారు. తెగి పడిన విద్యుత్ తీగలను ఎట్టి పరిస్థితుల్లోనూ తాకరాదని, వెంటనే విద్యుత్ శాఖకు సమాచారం ఇవ్వాలని సూచించారు. గృహాలు, వ్యవసాయ క్షేత్రాల్లో సరైన ఎర్తింగ్ వ్యవస్థ ఉండాలని, మీటర్లు, వైర్లు, స్విచ్‌బోర్డులను సకాలంలో తనిఖీ చేయించు కోవాలని చెప్పారు. రైతులు మోటార్లు, పంప్‌సెట్లు ఉపయోగించే సమయంలో ప్రత్యేక జాగ్రత్తలు పాటించాలని సూచించారు. తడి నేలపై నిలబడి స్విచ్ ఆన్ చేయకూడదని, మోటార్ స్టార్టర్ల వద్ద ఇన్సులేషన్ సరిగా ఉండాలని తెలిపారు. అవగాహన కార్యక్రమాల భాగంగా గ్రామాలు, పట్టణాల్లో సమావేశాలు నిర్వహించడం, పోస్టర్లు, కరపత్రాలు పంపిణీ చేయడం జరుగుతుందని చెప్పారు. ప్రమాదకర లైన్లు, వంగిన స్తంభాలు, పాత వైర్లను గుర్తించి వెంటనే మరమ్మతులు చేపడుతున్నట్లు తెలిపారు. "విద్యుత్ భద్రత ప్రతి ఒక్కరి బాధ్యత. చిన్న నిర్లక్ష్యం కూడా పెద్ద ప్రమాదాలకు దారితీస్తుంది" అని పేర్కొంటూ, ఎలాంటి సమస్యలు ఎదురైనా 1912 టోల్ ఫ్రీ నంబర్‌కు ఫోన్ చేసి పరిష్కారం పొందాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డీఈలు ఉపేందర్, రాజ్యం, ఏడీఈలు శ్రీనివాస్, లావణ్య, ఏఈలు, ఓఅండ్‌ఎం సిబ్బంది పాల్గొన్నారు.



# కిశోర బాలికల కోసం స్నేహ సమ్మర్ క్యాంప్స్

## రాష్ట్రవ్యాప్తంగా అన్ని గ్రామాల్లో ప్రారంభం

**హైదరాబాద్ (జనంసాక్షి) :** రాష్ట్రవ్యాప్తంగా అన్ని గ్రామాల్లో కిశోర బాలికల కోసం 'స్నేహ సమ్మర్ క్యాంప్స్' ఘనంగా ప్రారంభమయ్యాయి. సెర్ప్ ఆధ్వర్యంలో ప్రణాళికాబద్ధంగా అమలు అవుతున్న ఈ సమ్మర్ క్యాంపుల్లో పెద్ద సంఖ్యలో టీనేజ్ బాలికలు ఉత్సాహంగా పాల్గొంటున్నారు. మే 2 నుంచి జూన్ 10 వరకు నిర్వహించ బడుతున్న ఈ క్యాంపులు కిశోర బాలికల సమగ్ర అభివృద్ధిని లక్ష్యంగా పెట్టుకుని ప్రత్యేకంగా రూపొందించడం జరిగింది. వివిధ సెషన్ల ద్వారా బాలికలకు ఆరోగ్యం, భద్రత, విద్య, జీవన నైపుణ్యాలు (లైఫ్ స్కిల్స్) పై అవగాహన కల్పిస్తున్నారు. క్యాంప్‌లో భాగంగా బాల్య వివాహాల నిర్మూలన, రక్తహీనత (అనీమియా) వంటి ఆరోగ్య సమస్యలు, గ్రామాలను బాలికలకు సురక్షిత ప్రాంతాలుగా తీర్చిదిద్దే చర్యలు వంటి అంశాలపై చర్చలు జరుగుతున్నాయి. బాలికలు ఎదుర్కొనే వ్యక్తిగత, సామాజిక సవాళ్లను గుర్తించి వాటికి పరిష్కార మార్గాలపై అవగాహన పెంపొం దిస్తున్నారు. ప్రభుత్వ పథకాలు, బ్యాంకింగ్ అలవాట్లు, పొదుపు ప్రాముఖ్యత, శారీరక వ్యాయామం, క్రీడలు, యోగా వంటి అంశాలపై కూడా శిక్షణ ఇస్తున్నారు. విద్య ప్రాముఖ్యత, కెరీర్ మార్గదర్శకత్వం, నైపుణ్యాల అభివృద్ధి పై ప్రత్యేక సెషన్లు నిర్వహిస్తున్నారు. సైబర్ భద్రత, స్మార్ట్‌ఫోన్ వినియోగంపై అవగాహన కల్పించ డంతో పాటు, బాలికల స్వతంత్రతను పెంపొం దించే కార్యక్రమాలు కూడా చేపడుతున్నారు. ముఖ్యంగా 18 సంవత్సరాల బాలికలకు సైకిల్ తొక్కే శిక్షణ ఇవ్వడం ద్వారా వారి సాధికారతకు దోహదం చేస్తున్నారు. క్యాంప్ ముగింపు సందర్భంగా తల్లిదండ్రులను ఆహ్వానించి కృతజ్ఞత కార్యక్రమం నిర్వహించడంతో పాటు, పిల్లల గ్రామ సభ ద్వారా బాల్య వివాహాల నిరోధం, బాలికల భద్రత, విద్య ప్రోత్సాహం వంటి అంశాలపై గ్రామ స్థాయి నిర్ణయాలు తీసుకునేలా చర్యలు చేపడుతున్నారు. కీలక శాఖల సమన్వయంతో నిర్వహిస్తున్న ఈ స్నేహ సమ్మర్ క్యాంప్స్ ద్వారా కిశోర బాలికల్లో ఆత్మవిశ్వాసం పెంపొందించడం, ఆరోగ్యకరమైన మరియు సురక్షితమైన భవిష్యత్తు నిర్మాణం లక్ష్యంగా పనిచేస్తున్నారు.



# సేవే పరమ ధర్మం స్ఫూర్తితో వైద్యులు సేవలందించాలి

## ఉస్మానియా మెడికల్ కాలేజ్ 175వ స్నాతకోత్సవ సందేశంలో గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా

**హైదరాబాద్, మే 2 (జనంసాక్షి) :** వైద్య వృత్తి కేవలం ఉపాధి మార్గం మాత్రమే కాదని, అది మానవాళికి సేవ చేయడానికి తీసుకునే పవిత్ర ప్రతిజ్ఞ అని తెలంగాణ గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా పేర్కొన్నారు. వైద్యులు జ్ఞానం, సాంకేతిక నైపుణ్యంతో పాటు కరుణ, సానుభూతి వంటి మానవీయ విలువలను అలవరచుకోవాలని సూచించారు. "సేవే పరమ ధర్మం" స్ఫూర్తితో దేశ ప్రజలకు వైద్యులు సేవలందించాలనీ గవర్నర్ సూచించారు. హైదరాబాద్‌లోని ఉస్మానియా వైద్య కళాశాల 175వ స్నాతకోత్సవానికి శనివారం సాయంత్రం ముఖ్య అతిథిగా హాజరైన గవర్నర్ విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. ఉస్మానియా వైద్య కళాశాల అనేక సంవత్సరాలుగా దేశానికి నిబద్ధతతో, నైపుణ్యంతో కూడిన వైద్యులను అందిస్తున్న గొప్ప వారసత్వ సంస్థగా నిలిచిందని గవర్నర్ కొనియాడారు. పట్టభద్రులైన విద్యార్థులు సాధించిన ఈ విజయానికి వారి కఠోర శ్రమ, అంకితభావమే కారణమని అభినందించారు. ప్రస్తుత ఆరోగ్య రంగం వేగంగా మారు తున్న నేపథ్యంలో సాంకేతికత, పరిశోధనల ప్రాధాన్యం పెరిగిందని పేర్కొన్న గవర్నర్, ఆధునిక పరికరాలను వినియోగిస్తూనే మానవీయతను మరువకూడదని హితవు పలికారు. రోగికి వైద్యుడిపై ఉన్న నమ్మకమే అతిపెద్ద ఆస్తి అని చెప్పారు. పట్టభద్రుల కుటుంబ సభ్యులు, అధ్యాపకుల పాత్రను గవర్నర్ ప్రత్యేకంగా ప్రశంసించారు. వారి త్యాగం, మార్గదర్శకత్వం వల్లే ఈ విద్యార్థులు సమర్థులైన వైద్యులుగా ఎదిగారని పేర్కొన్నారు. యువ వైద్యులు గ్రామీణ సేవ నుంచి అత్యాధునిక పరిశోధనల వరకు ప్రతి రంగంలోనూ నైతిక విలువలతో సేవ చేయాలని గవర్నర్ పిలుపునిచ్చారు. ఉస్మానియా మెడికల్ కాలేజ్ గొప్ప సంప్రదాయాన్ని మరింత ఉన్నత శిఖరాలకు తీసుకెళ్లాలని కోరుతూ పట్టభద్రులందరికీ ఉజ్వల భవిష్యత్తు కలగాలని ఆకాంక్షించారు. అంతకుముందు గవర్నర్ వైద్య విద్య పూర్తి చేసుకున్న విద్యార్థులకు స్నాతకో త్సవ పట్టాలు బహూకరించి అభినందించారు. కార్యక్రమంలో వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజ నర్సింహ, గవర్నర్ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎం దాన కిషోర్, హెల్త్ యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ కే రమేష్ రెడ్డి, డైరెక్టర్ ఆఫ్ మెడికల్ కాలేజీ (డీఎంఈ) నరేందర్ కుమార్, ఉస్మానియా మెడికల్ కాలేజీ ప్రిన్సిపల్ రాజారావు పాల్గొన్నారు.

### ప్రపంచ పత్రిక స్వేచ్ఛ దినోత్సవ శుభాకాంక్షలు

**హైదరాబాద్ (జనంసాక్షి) :** ప్రపంచ పత్రిక స్వేచ్ఛ దినోత్సవం సందర్భంగా టీపీసీసీ అధ్యక్షులు, ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్ రాష్ట్ర ప్రజలకు, ముఖ్యంగా జర్నలిస్టులకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. ప్రజాస్వామ్యానికి పత్రికా స్వేచ్ఛ ఒక ప్రాణాధారం అని, సమాజంలో సత్యాన్ని వెలికితీసే బాధ్యతను మీడియా నిర్వర్తిస్తోందని ఆయన పేర్కొన్నారు. పత్రికలు, మీడియా సంస్థలు ఎలాంటి ఒత్తిళ్లు, బెదిరింపులు లేకుండా స్వేచ్ఛగా పనిచేసే వాతావరణం ఉండాల్సిన అవసరం ఉందని ఆయన అభిప్రాయపడ్డారు.

ప్రజల సమస్యలను ప్రతిబింబిస్తూ, ప్రభుత్వ పనితీరును సమీక్షిస్తూ, సమాజానికి దిశానిర్దేశం చేసే పాత్రలో మీడియా ఎంతో కీలకమని అన్నారు. ఈ సందర్భంగా జర్నలిస్టులు తమ వృత్తి నిబద్ధతను కాపాడుకుంటూ నిజాయితీగా పని చేయాలని ఆకాంక్షించారు. మీడియా స్వేచ్ఛను పరిరక్షించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని, ప్రజాస్వామ్య విలువలను నిలబెట్టడంలో మీడియా పాత్ర మరింత బలోపేతం కావాలని కోరుకున్నారు.

### డీజీపీకి ప్రముఖుల విషెస్



తెలంగాణ రాష్ట్ర డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ (డీజీపీ)గా బాధ్యతలు చేపట్టిన సీవీ ఆనంద్.. రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్కని వారి నివాసంలో శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఉప ముఖ్యమంత్రి ఆయనకు శుభాకాంక్షలు తెలియజేశారు.



తెలంగాణ రాష్ట్ర డిజిపిగా సివి ఆనంద్ నియమితులైన సందర్భంగా తెలంగాణ రాష్ట్ర సలహాదారులు వి.హనుమంతరావు అభినందనలు తెలిపారు.

**హైదరాబాద్, మే 2 (జనంసాక్షి) :**

# హైబ్రిడ్ యాన్యుటీ మోడల్‌పై హరీష్ రావు ఆరోపణలు నిరాధారం

- గ్రామీణ రహదారుల అభివృద్ధిని జీర్ణించు కోలేకే అసత్య ఆరోపణలు చేస్తున్నారు
- హరీష్ రావు ఆరోపణలను ఖండించిన మంత్రి సీతక్క

**హైదరాబాద్ (జనంసాక్షి) :** హైబ్రిడ్ యాన్యుటీ మోడల్ (హెచ్ఏఎం) రహదారులపై మాజీ మంత్రి హరీష్ రావు చేసిన ఆరోపణలను పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి డా. దనసరి అనసూయ సీతక్క ఖండించారు. వాస్తవాలను పక్కనపెట్టి అర్థం లేని విమర్శలు చేయడం బాధాకరమని పేర్కొన్నారు. ఆవేశానికి లోనుకాకుండా ఆలోచనాత్మకంగా వ్యవహరించాలని హరీష్ రావుకు సూచించారు. గ్రామీణ రహదారులను జాతీయ రహదారుల స్థాయిలో ఆధునీకరించడం, కొత్త రహదారుల నిర్మాణం చేపట్టడం ద్వారా రాష్ట్ర ఆర్థికాభివృద్ధిని వేగవంతం చేయాలనే ప్రభుత్వ సంకల్పాన్ని జీర్ణించుకోలేకే ఇలాంటి నిరాధార ఆరోపణలు వస్తున్నాయని మంత్రి సీతక్క ఒక ప్రకటనలో తెలిపారు. టెండర్ల ప్రక్రియ పూర్తికాకముందే అవినీతి ఆరోపణలు చేయడం విడ్డూరమని మండిపడ్డారు. హైబ్రిడ్ యాన్యుటీ మోడల్ (హెచ్ఏఎం) ను కేంద్ర రోడ్డు రవాణా మంత్రిత్వ శాఖ (ఎంఓఆర్ టీహెచ్) ప్రవేశపెట్టగా, నేషనల్ హైవేస్ అథారిటీ ఆఫ్ ఇండియా (ఎన్ హెచ్ఏఐ) 2016 నుంచి విజయవంతంగా అమలు చేస్తోంది. దేశవ్యాప్తంగా ఇప్పటివరకు 374కు పైగా ప్రాజెక్టులు, సుమారు రూ. 4 నుంచి 5 లక్షల కోట్ల పెట్టుబడులతో ఈ మోడల్ ద్వారా అమలవుతున్నాయి. మహారాష్ట్ర, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, మధ్యప్రదేశ్, రాజస్థాన్, బీహార్, ఉత్తరప్రదేశ్, పశ్చిమ బెంగాల్, గుజరాత్, ఛత్తీస్‌గఢ్, ఢిల్లీ వంటి రాష్ట్రాలు కూడా ఈ విధానాన్ని అమలు చేస్తున్నాయి. తెలంగాణ ప్రభుత్వం కూడా ఇదే విధానాన్ని అనుసరిస్తూ గ్రామీణ ప్రాంతాల్లో



రహదారుల దీర్ఘకాలిక నిర్వహణకు ప్రాధాన్యత ఇస్తోంది. అందు కోసం గ్రామీణ ప్రాంతాల్లో పారిశ్రామిక అభివృద్ధి, ఉపాధి అవకాశాల పెరుగుదల లక్ష్యంగా హెచ్ఏఎం మోడల్ ద్వారా రహదారుల నిర్మాణం చేపట్టాలని కేబినెట్ నిర్ణయించింది. హెచ్ఏఎం తొలి దశలో రూ. 6,250 కోట్ల వ్యయంతో 2,162 రహదారులను, మొత్తం 7,450 కిలోమీటర్ల పొడవులో అభివృద్ధి చేయడానికి 17 ప్యాకేజీలుగా పనులు మంజూరు చేశారు. వీటిలో 14 ప్యాకేజీలకు బిడ్లు దాఖలయ్యాయి. మిగతా 3 ప్యాకేజీలకు ఈ నెల 11 వరకు గడువు ఉంది. ప్రస్తుతం సాంకేతిక పరిశీలన పూర్తై, ఆర్థిక బిడ్ల పరిశీలన కొనసాగుతోంది. ఈ పథకం కింద కాంట్రాక్టర్ సంస్థలు 30 నెలల్లో రహదారుల నిర్మాణాన్ని పూర్తి చేసి, అనంతరం 15 సంవత్సరాల పాటు నిర్వహణ బాధ్యతలను చేపడతాయి. నిర్మాణ దశలో ప్రాజెక్ట్ వ్యయంలో 40% ప్రభుత్వం చెల్లించగా, మిగిలిన 60% మొత్తాన్ని 15 సంవత్సరాల నిర్వహణ కాలంలో యాన్యుటీ రూపంలో చెల్లిస్తుంది. దీని ద్వారా తక్కువ వ్యయంతో ఎక్కువ రహదారుల నిర్మాణం సాధ్యమవుతుందని మంత్రి తెలిపారు. ఎన్ హెచ్ఏఐ విధానానికి అనుగుణంగా బ్యాంక్ గ్యారంటీపై గరిష్ఠంగా 10% మొబిలైజేషన్ అడ్వాన్స్ ఇవ్వవచ్చు. ఈ అడ్వాన్స్‌ను వడ్డీతో సహా కాంట్రాక్టర్ బిల్లుల నుంచి దశలవారీగా తిరిగి వసూలు చేస్తారు. ఇది కొత్త విధానం కాదని, దేశవ్యాప్తంగా అమలులో ఉందని మంత్రి స్పష్టం చేశారు. మొబిలైజేషన్ అడ్వాన్స్ తీసుకోవడం కాంట్రాక్టర్‌కు తప్పనిసరి కాదని కూడా తెలిపారు. ఈ టెండర్లు పూర్తిగా ఈ-ప్రొక్యూర్‌మెంట్ ద్వారా పారదర్శకంగా నిర్వహిస్తున్నామని, దేశవ్యాప్తంగా ప్రముఖ సంస్థలతో పాటు ఒక అంతర్జాతీయ సంస్థ కూడా పాల్గొన్నట్లు తెలిపారు. అన్ని నిబంధనలు ఎన్ హెచ్ఏఐ ప్రమాణాలకు అనుగుణంగా కచ్చితంగా అమలు చేస్తున్నామని మంత్రి సీతక్క వెల్లడించారు. వాస్తవాలు ఈ విధంగా ఉన్నప్పటికీ ప్రజలను తప్పుదోవ పట్టించేలా నిరాధార ఆరోపణలు చేయడం మానుకుని రాష్ట్ర అభివృద్ధికి సహకరించాలని మంత్రి సీతక్క కోరారు. రాష్ట్ర ప్రజల ప్రయోజనాలే ప్రభుత్వానికి ముఖ్యమని, పారదర్శకతతో అభివృద్ధి కార్యక్రమాలను కొనసాగిస్తామని స్పష్టం చేశారు.

# భూతగాదాలతో గిరిజన రైతు హత్య

## సంఘటనా స్థలాన్ని పరిశీలించిన డీఎస్పీ, సీఐ

**మల్దకల్ మే 2(జనంసాక్షి)**



జోగులాంబ గద్వాల జిల్లా మల్దకల్ మండల పరిధిలోని మద్దెలబండ తాండలో భూ వివాదాల నేపథ్యం ఓ వ్యక్తి దారుణ హత్యకు దారి తీసింది. మద్దెలబండ తండాకు చెందిన చంద్రునాయక్ (40)కు చెందిన భూమిని, దాయాదులైన బొడియ రాములునాయక్, చంద్రునాయక్ మధ్యగత కొంతకాలంగా భూతగాదాలు నడుస్తున్నాయి. ఈ నేపథ్యంలో శనివారం తెల్లవారుజామున చంద్రునాయక్ తన పొలం వద్ద నుండిచొప్ప తీసుకొని ఇంటికి వెళుతుండగా నిందితులు రాములునాయక్, కుమారులు గన్నేనాయక్, శంకర్ నాయక్,శీను నాయక్, సుక్య నాయక్ తోపాటు మరికొందరు కలిసి కాపు కాసిపథకం ప్రకారం దాడి చేసి దారుణంగా కొట్టి చంపిహత్య చేశారు. 32 సర్వే నెంబర్ రెండు ఎకరాలు, 375 సర్వేనెంబర్ ఒక ఎకరా భూమి తగాదా పై ఇరువర్గాలు మధ్య కొంతకాలంగా వివాదం జరుగుతున్న అధికారులు గ్రామస్తులు కూడా ఎవరు పట్టించుకోవడం లేదని కుటుంబ సభ్యులు ఆరోపించారు. అధికారులు తమకు న్యాయం చేసి ఉంటే మా తండ్రి బతుకు ఉండేవాడని,మృతుడు కుమారుడు హనుమంతు నాయక్ ఆరోపించారు. మృతుడు చంద్ర నాయక్ భూమి కబ్జాలోఉండగా, రికార్డులో మాత్రం రాముల నాయక్ ఉన్నారు. సంఘటన స్థలానికి గద్వాల డిఎస్పి మొగిలయ్య,సిఐ టంగుటూరు శీను



సందర్శించారు. కుమారుడు హనుమంతు నాయక్ ఫిర్యాదు మేరకు శవాన్ని గద్వాల ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి తరలించి పోస్టుమార్టం నిర్వహించి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై కొండా శ్రీహరి తెలిపారు.

**అధికారుల నిర్లక్ష్యంపై గ్రామస్తుల ఆరోపణలు**

మృతుడు చంద్రునాయక్ తహసీల్దార్, పోలీస్ స్టేషన్ చుట్టూ తిరిగినా అధికారులు స్పందించలేదు. అతనికి ప్రాణహాని ఉందని తెలిసినా అధికారులు ముందస్తు చర్యలు తీసుకోకపోవడం వల్లే ఈ హత్య జరిగిందని కుటుంబ సభ్యులు మండిపడుతున్నారు. ఈ ఘటనపై సమగ్ర విచారణ జరిపి, బాధ్యులను కఠినంగా శిక్షించాలని, బాధితుడి కుటుంబానికి న్యాయం చేయాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు.



# గరిబోళ్లకు అండగా ఉప్పల ఫౌండేషన్

**హైదరాబాద్ (జనంసాక్షి) :** నాగోల్‌లోని ఉప్పల క్యాంపు కార్యాలయంలో సిద్దిపేట జిల్లా కొండపాకకి చెందిన తండ్రి లేని (అమ్మాయి) దివంగత బుచ్చయ్య తల్లి గజ్జె లచవ్వ కుమార్తె కృష్ణవేణికి చీర, పుస్తె మట్టెలను టీపీసీసీ ప్రధాన కార్యదర్శి అంతర్జాతీయ ఆర్య వైశ్య ఫెడరేషన్ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్, రాష్ట్ర అధ్యక్షుడు ఉప్పల శ్రీనివాస్ గుప్త, ఆయన సతీమణి ఐవీఎఫ్ ప్రధమ మహిళ ఉప్పల స్వప్న చేతుల మీదుగా అందజేశారు. అమ్మాయి వాళ్ల తల్లి కూలి పని చేస్తుందని, అలాంటి పేద కుటుంబాలకు అండగా నిలవడం సంతోషంగా వుందని అన్నారు. తన ఉప్పల ఫౌండేషన్ ఆధ్వర్యంలో అనేక సేవా కార్యక్రమాలు చేపడుతున్నామని, ఎంతో మంది పేద కుటుంబాలకు అండగా పుస్తె మట్టెలు అందజేస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో అమ్మాయి మేన మామ సురేష్, దళిత సంఘం నాయకులు లింగం తదితరులు పాల్గొన్నారు.

# హజ్ యాత్రికులపై ఏటీఎఫ్ భారం తగదు

## మైనారిటీ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు యాకూబ్ పాషా



**హైదరాబాద్ (జనంసాక్షి) :** ఈ ఏడాది పవిత్ర హజ్ యాత్రకు వెళుతున్న యాత్రికులపై ఏవియేషన్ టర్బైన్ (ఏటీఎఫ్) ధరలు పెరిగాయనే సాకుతో అదనంగా 10వేల రూపాయలు చెల్లించాలని కేంద్ర హజ్ కమిటీ వారు ఉత్తర్వులు జారీ చేయడం పట్ల మైనారిటీ సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఎండీ యాకూబ్ పాషా శనివారం ఒక ప్రకటనలో ఆవేదన వ్యక్తం చేసారు. గత కొన్నేళ్లుగా పవిత్ర హజ్ యాత్ర మధ్య తరగతి, పేద వర్గాల వారికి భారంగా మారిందని గతంలో లక్ష ఉన్న హజ్ యాత్ర రుసుము నేడు 3లక్షల 60వేలకు పెరిగిందని, హజ్ యాత్ర చేసే ప్రయాణికులందరూ హజ్ యాత్ర రుసుము చెల్లించి మే నెల 4వ తేదీన హజ్ కమిటీ ఆధ్వర్యంలో మొదటి హజ్ యాత్రకు సిద్ధమౌతున్న తరుణంలో యాత్రికుల నుండి అదనంగా 10 వేలు చెల్లించాలని పేర్కొనడంతో యాత్రికులు అసహనం వ్యక్తం చేస్తున్నారని పేర్కొన్నారు. ఒకపక్క కేంద్ర ప్రభుత్వం డీజిల్, పెట్రోల్ కొరత లేదని వీటి ధరలు పెంచబోమని తెలుపుతూనే, ఏటీఎఫ్ సాకుతో హజ్ యత్రికుల నుండి 10వేల రూపాయలు లాగడం తగదని, ఈ విషయంలో రాష్ట్రంలోని పార్లమెంట్ సభ్యులందరూ జోక్యం చేసుకొని హజ్ యాత్రికుల మీద విధిస్తున్న అదనపు భారం నిలిపివేసే విధంగా కేంద్ర మైనారిటీ మంత్రిపై ఒత్తిడి తేవాలని కోరారు.

# బతుకమ్మకుంట ముమ్మాటికీ చెరువే..!

- చారిత్రక ఆధారాలు చూపించిన హైడ్రా

**హైదరాబాద్, మే 02 (జనంసాక్షి) :** అంబర్‌పేటలోని బతుకమ్మ కుంట ముమ్మాటికీ చెరువే అని హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ అన్నారు. ఇందుకు సంబంధించి శాటిలైట్, గూగుల్ మ్యాప్స్‌తో చారిత్రక ఆధారాలను చూపించారు. హైడ్రా కార్యాలయంలో శనివారం విలేకరులతో మాట్లాడుతూ ఇటీవల హైడ్రా చేపట్టిన పలు కార్యక్రమాలను వివరిస్తూనే.. బతుకమ్మ కుంట గురించి పలు వార్తలు, వదంతులు ప్రసారం కావడంతో వివరణ ఇచ్చారు. 1975లో ఇరిగేషన్ రికార్డుల్లో కుంటగా పేర్కొన్న ఆధారాలను చూపించారు. సర్వే నంబరు 563/1 లో 9.19 ఎకరాల వరకూ చెరువున్నట్టు రెవెన్యూ, జీహెచ్ ఎంసీ రికార్డులు వెల్లడించాయన్నారు. ఆ చెరువుకు కట్ట 563/2 సర్వే నంబరులో 6 గుంటల మేర మాసాన్ కట్ట పేరిట ఉందన్నారు. గ్రామ రికార్డులతో పాటు.. 1971లో సర్వే ఆఫ్ ఇండియా ఫొటోలు, 1989లో నాసా (ల్యాండ్‌శాట్) రూపొందించిన శాటిలైట్ పిక్చర్స్‌ను మీడియాకు విడుదల చేశారు. ఈ ఫొటోలు, వీడియోలను సరిపోల్చుతూ రూపొందించిన వీడియోను ప్రదర్శించారు. బతుకమ్మ కుంటపై తుది తీర్పు వచ్చే వరకూ దీనిమీద ఎవరూ ఓనర్‌షిప్ క్లెయిమ్ చేయకూడదనే నిబంధనల మేరకు బోర్డులు, గేట్లు తొలగించామని చెప్పారు. చెరువు చుట్టూ వేసిన ఫెన్సింగ్‌ను తొలగిస్తే ప్రమాదాలు జరుగుతాయని సుప్రీంకోర్టులో జరిగిన విచారణ సందర్భంగా తెలిపామన్నారు. వివరణతో 3 వారాల్లో అఫడవిట్‌ను దాఖలు చేయమని సోమవారం సుప్రీం కోర్టు సూచించిందని తెలిపారు. బండ్లగూడ మండలం, విలేజ్‌లోని సల్కం చెరువు విషయంలో కూడా కోర్టు హైడ్రాను తప్పు పట్టలేదనే విషయాన్ని గుర్తు చేశారు. ఇప్పటికే ఇందుకు సంబంధించిన వివరాలు హైడ్రా కోరిన విషయాన్ని కూడా హైకోర్టు తీర్పులో పేర్కొందని.. ఇరిగేషన్, రెవెన్యూ నుంచి వచ్చిన నివేదిక మేరకు చర్యలుంటాయని హైడ్రా కమిషనర్ స్పష్టం చేశారు.






Printed, Published and Owned by M.M.RAHMAN Printed at M/s. Manair Enterprises, Plot No. 16E/4, IDA, Kattedan, Ranga Reddy Dist, Telangana - 500077, Published at Flat No. 301, 8-2-273, 276 & 277, 3rd Floor, Pavani Estate, Indradhanush Complex, Road No. 2, Banjara Hills, Hyderabad – 500034, Telangana, Editor : M.M.RAHMAN RNINo. APTEL/2013/50370